బ్రాహ్మణగీతలు

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత

డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2018

BRAHMANA GITALU
with Commentary

Commentary by
Dr. H.S. Brahmananda

T.T.D. Religious Publications Series No. 1296
© All Rights Reserved

First Print : 2018

Copies : 2000

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **"మహాభారతం"** అయ్యింది.

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు – అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలను వ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **బ్రాహ్మణగీతలు.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

పీఠిక

నివేదన

మహాభారతం పంచమవేదంగా ప్రసిద్ధి పొందింది.

ధర్మే చార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ ।
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్ ॥

అన్నట్లు చతుర్విధ పురుషార్థాలకు చెందిన విషయాలన్నీ ఇందులో విశదీకరించడమైనది. ఈ పురుషార్థాలకు చెందిన అంశాలు ఇందులో ఉన్నవే, ఇతరత్రా వుంటాయి. ఇక్కడ లేనివి ఎక్కడా వుండవని భావం.

విశ్వజనీనమైన మహాభారతాన్ని అధ్యాత్మవిద్యావేత్తలు 'వేదాంత' మన్నారు. 'కోటి విద్యలు కూటికొరకే' అన్నట్లు విద్యలెన్ని ఉన్నా అవి భుక్తికే గాని ముక్తి కుపకరించవు. అందుకే శ్రీశంకరభగవత్పాదులు –

వాగ్వైఖరీ శబ్దఝరీ శాస్త్రవ్యాఖ్యానకౌశలమ్ ।
వైదుష్యం విదుషాం తద్వ ద్భుక్తయే న తు ముక్తయే ॥ (వివేకచూడామణి)

అని అన్నారు. అంటే వాక్కులు, శబ్దాలు ప్రయోగించడంలోని చాతుర్యం, శాస్త్రాలను వ్యాఖ్యానించడంలోని నేర్పు, విద్వాంసుల పాండిత్యం వేదాంతవిద్యతో సంబంధం లేని వైనప్పుడు భుక్తినే గాని, ముక్తిని ప్రసాదించవని తాత్పర్యం. 'అధ్యాత్మవిద్యా విద్యానాం' – అని విద్యలలో తాను అధ్యాత్మవిద్య నని గీతలో భగవంతుని వచనం. ఆ విద్య మాత్రమే ముక్తిని చేకూర్చగలదు.

మహాభారతంలోని భీష్మపర్వంలో భగవద్గీత ఉపనిషత్సారంగా, బ్రహ్మవిద్యగా, యోగశాస్త్రంగా, శ్రీకృష్ణార్జున సంవాదంగా వినుతికెక్కింది.

యుద్ధరంగంలో కర్తవ్యవిముఖుడైన పార్థుణ్ణి గీతోపదేశం కర్తవ్య సుముఖుణ్ణి కావించింది. అందులో కర్మ–భక్తి–ధ్యాన–జ్ఞానయోగాలు

సంగ్రహంగా నిరూపితాలయ్యాయి. శ్రీశంకరులు గీతాశాస్త్రాన్ని సమస్త వేదార్థసారసంగ్రహమని కీర్తించారు.

పాండవులకు యుద్ధంలో విజయం చేకూరిన తరువాత ధర్మజుడు పట్టాభిషిక్తుడయ్యాడు. తదుపరి ఒకనాడు అర్జునుడు శ్రీకృష్ణునితో "మహాత్మా! యుద్ధప్రారంభంలో నీవు నాకు దయతో ఆత్మతత్త్వం బోధించావు. నే నా బోధను చిత్తంలో నిల్పలేకపోయాను. మరొకసారి ఆ తత్త్వం బోధించు" అని అడుగుతాడు.

అప్పుడు శ్రీకృష్ణుడతనితో "నాటి ప్రబోధం మరల చెప్పడం శక్యం కాని పని" అని చెప్పి అతనిపై దయతో మరొక ప్రకారంగా తత్త్వబోధ కావిస్తాడు. ఈ విషయం అశ్వమేధపర్వం ప్రథమాశ్వాసం చివర ఉన్నది.

ద్వితీయాశ్వాసం ప్రారంభంలో భగవంతు డర్జునునికి బ్రాహ్మణగీతలను ప్రబోధిస్తాడు. ఈ ఘట్టం అశ్వమేధపర్వం – ద్వితీయాశ్వాసం ప్రారంభం నుండి 102 గద్య పద్యాలవరకు విస్తరించి ఉన్నది.

అధ్యాత్మ ప్రబోధం కావించుమంటూ ఒక బ్రాహ్మణి తన భర్తయైన బ్రాహ్మణుణ్ణి సవినయంగా ప్రార్థిస్తుంది. అతడామెకు అధ్యాత్మవిద్యా రహస్యాలు వివరిస్తాడు. బ్రాహ్మణుడు బ్రాహ్మణికి బోధించినది కాన ఈ ఘట్టానికి 'బ్రాహ్మణగీతలు' అన్న ప్రశస్తి కలిగింది. దీనిని 'భర్తృభార్యాకృత సంవాదమనీ', 'అభయ' నామకమైన ఇతిహాసమనీ కూడా వ్యవహరిస్తారు.

ఆ బ్రాహ్మణుని ప్రబోధసారంశ మిది – కర్మనిష్ఠులు అజ్ఞానంతో కర్మలను సకలసిద్ధి ప్రదాలంటారు. నిష్కర్మత్వాన్ని మూర్ఖత్వమని నిందిస్తారు. కాని నైష్కర్మ్యం చాలా గొప్పస్థితి. బ్రహ్మాదులు ఇంద్రియాలను జయించి అక్షరతత్త్వోపాసన గావిస్తారు. అక్షరతత్త్వం పవిత్రమైన బుద్ధికి మాత్రమే గోచరిస్తుంది. ప్రాణాదివాయువులు అందులోనే కలిగి అందులోనే లీనమవుతాయి.

ఇలా చెప్పి ఆ బ్రాహ్మణుడు ప్రాణాపానాదుల స్వరూపం వివరిస్తాడు. ఆపై సప్తహోతృవిధి, దశహోతృవిధి అనే రెండు విధాల హోమవిధిని నిరూపిస్తాడు. అంతర్యాగం జరిపే యోగులు విముక్తు లవుతారనీ, కేవల బాహ్యయజ్ఞపరులు సంసారచక్రంలో పరిభ్రమించక తప్పదనీ చెబుతాడు.

పిదప వాక్కు ననుసరించి మనస్సు పరుగిడుతుందని బ్రాహ్మణుడు చెప్పగా మనస్సు ప్రేరణతో జనించేది వాక్కు, అది మనస్సు నెలా అనుసరిస్తుంది? అని బ్రాహ్మణి ప్రశ్నిస్తుంది.

అందుకు బ్రాహ్మణుడు ఒక కార్యాన్ని గురించి ప్రవర్తించవలసివస్తే మనస్సు వాక్కుకు అనుగుణంగానే ప్రవర్తిస్తుంది కాన నేనలా చెప్పానంటాడు.

తరువాత వారిరువురి సంవాద మిలా సాగుతుంది.

బ్రాహ్మణుడు : మనస్సు, వాక్కు – ఇవి ఒకసారి మాలో ఎవరు పెద్ద? అని బ్రహ్మనడిగాయి. బ్రహ్మ మనస్సు పెద్ద అని చెప్పాడు. ఆ మాటను విన్న సరస్వతి "నేను నీ కోర్కెలు తీర్చేదానిని గదా! నన్ను తక్కువచేసి మాట్లాడ వచ్చునా" అని ఆక్షేపించింది.

అందుకు బ్రహ్మ స్థిరమనీ, చరమనీ రెండు మనస్సు లున్నాయనీ, స్థిరం తనవద్దా, చరం సరస్వతివద్దా ఉంటాయనీ చెప్పి చరచిత్తం కంటె సరస్వతి గొప్పదనీ, ఆమెకన్నా స్థిరచిత్తం గొప్పదనీ చెబుతాడు. అందుకు సరస్వతి మౌనం దాల్చింది. ఆ తరువాత బ్రహ్మను శరణు వేడింది" అని బ్రాహ్మణుడు చెప్పాడు. సరస్వతికి కలిగిన క్షోభను బ్రహ్మ ప్రభావం వల్ల ప్రాణవాయువు పోగొట్టగలిగిందని కూడా భార్యకు వివరించాడు.

ఆపై ఘోషిణి, అఘోషిణి అని వాక్కు రెండు విధాలనీ, అందు అఘోషిణి శ్రేష్ఠమనీ, అమృతవర్షిణి అనీ, బ్రహ్మ పదవాచకమనీ బ్రాహ్మణుడు బోధిస్తాడు. తరువాత బ్రాహ్మణుని బోధ ఇలా కొనసాగుతుంది. ఇంద్రియాలు, మనోబుద్ధులు ఒకే జీవుణ్ణి ఆశ్రయించి వుంటాయి. అవి ఒకదాని పని

మరొకటి చేయజాలవు. సందేహించడం, తెలుసుకోవడం మనస్సుచేసే పనులు. బుద్ధిలో మాత్రమే నిష్ఠ నెలకొని వుంటుంది.

ఇంద్రియాలకూ, మనస్సుకూ ఒకసారి సంవాదం సంభవిస్తుంది. ఇంద్రియాలు మనస్సుతో నీవూ, మేమూ ఒకే తరగతి వారమంటాయి. దాని కంగీకరించక మనస్సు తానే గొప్ప అంటుంది. ఇంద్రియాలు మనోవాదాన్ని త్రోసిపుచ్చి మేమూ, నీవూ కలిస్తేనే భోగానుభవం కల్గుతుందని చెబుతాయి.

ఇలాగే ప్రాణాదివాయువులు ఒకసారి బ్రహ్మ చెంతకు వెళ్ళి తమలో ఎవరు గొప్పో చెప్పమన్నాయి. అందుకు "ఎవరణడిగితే ఇతరులందరూ అణగిపోతారో, ఎవరు పనికి పూనుకొంటే ఇతరులు తమ పని ప్రారంభిస్తారో వారే గొప్ప" అని అంటాడు. ప్రాణాదులకు ఆ సమాధానం సంతృప్తికరం కాలేదు.

మరల బ్రహ్మ వాటిని చూచి మీలోని ప్రతి ఒక్కరూ ఒక్కొక్క విశిష్టత కలవారే. ఎప్పుడు ఎవరివల్ల ఒకపని ఏ తీరున జరుగునో, అప్పుడు మాత్రమే వారు గొప్ప. అలా ఒక్కొక్క సమయంలో ఒక్కొక్కరు గొప్పే కాన స్నేహంతో మెలగండి" అని బోధిస్తాడు. దానితో ప్రాణాదులు సమత్వం పొందాయి.

ఆ తరువాత బ్రాహ్మణుడు తన బోధ నిలా కొనసాగించాడు.

ఒకసారి దేవమతు డన్న విప్రుడు నారదునితో "ప్రాణవాయువుల్లో ప్రాణి పుట్టేటప్పుడు ఏ వాయువు మొదట పనిచేస్తుందో చెప్పండి" అని అడిగాడు.

నారదుడు ఏ వాయువు మొదట ప్రాణిని గర్భవాసానికి ప్రేరేపిస్తుందో, ఆ ప్రాణి పుట్టినప్పుడు దాని తరువాతి వాయువు పనిచేయడం మొదలు పెడుతుంది. సమానవాయువు పురుషునిలో వీర్యాన్నీ, వ్యానవాయువు స్త్రీలో రజస్సునూ ప్రభవింపజేస్తాయి. శుక్లశోణితాల కలయిక చేత గర్భం ఏర్పడుతుంది.

రజస్సుతో గట్టిపడ్డ వీర్యంవల్ల అందులో ప్రాణుడు ప్రవేశిస్తాడు. ఆపై ప్రాణుడు – వీర్యం వీటివల్ల అపానుడు వ్యాపిస్తాడు. ప్రాణు డధోముఖంగా, అపానుడు ఊర్ధ్వముఖంగా ప్రసరిస్తారు. ప్రాణాపానాల నడుమ గల అగ్నిని ఉదానుడంటారు. ప్రాణాపానాల మారుపేర్లే ద్వంద్వాలు. వీటి మధ్యనున్న అగ్ని ఉదానం. బ్రహ్మంలో ఏ భేదమూ లేదు, అదే ఉదానతత్త్వం. ఇంద్రియ–ప్రాణ–మనస్సులను తెలిసికోవడం ద్వారా వీటి కతీతమైన ఆత్మతత్త్వాన్ని గ్రహించవచ్చు.

ఇలా చెప్పి బ్రాహ్మణుడు భార్యతో మళ్ళీ ఇలా అంటాడు.

ఈ ప్రపంచం కరణ–కర్మ–కర్తలతో నిండి ఉన్నది. జీవుడు కర్తృత్వభావన వదలి విషయా లనే హవిస్సులను ఉదాన మనే స్రుక్కులో వేసి హోమించడం ద్వారా ఆత్మస్వరూపం గ్రహిస్తాడు. కర్తృత్వభావన, విషయాలు బంధం కల్గిస్తాయి. నేను యోగనిష్ఠలో ఉన్నాను. సర్వత్యాగమే దానికి దక్షిణ. దానితో ముక్తి సిద్ధమవుతుంది.

అనుశాసకుని శాసనానుసారంగా నేను చరిస్తాను. తరణోపాయం పెద్దలవల్ల గ్రహించాను.

ఒకసారి దేవతలు, మునులు బ్రహ్మను శ్రేయోమార్గం చెప్పమన్నారు. ఆయన అక్షరోపాసనమొక్కటే శ్రేయోమార్గమన్నాడు. నేనామార్గంలో వెళ్తున్నాను. నేను కామ–క్రోధ–లోభాలు దాటాను. ఒక వనం ప్రవేశించాను". ఆ మాట విని బ్రాహ్మణి "ఆ వన మెలాంటిది?" అని అడిగింది.

ఆ వనం చిత్రాతిచిత్రమైన దనీ, అక్కడ చిన్నా పెద్దా అనే తారతమ్యం లేదనీ, అది భయం లేని అక్షరతత్త్వ మనీ, ముక్తిపద మనీ బ్రాహ్మణుడు వివరిస్తాడు. ఆపై సుఖదుఃఖాలకు అతీతంగా, స్థితప్రజ్ఞ స్థితిలో ఉన్న తన స్థితిని భార్యకు తెలియజేస్తాడు.

దీని తర్వాత బ్రాహ్మణు డామెకు అధ్వర్యుయతి సంవాదాన్ని ఇలా చెప్పాడు.

ఒక యాజ్ఞికుడు బలిపశువును ప్రోక్షిస్తుండగా ఒక సన్న్యాసి చూచాడు.

సన్న్యాసి : ఇది హింసగదా!

యాజ్ఞికుడు : నీకు వేదవచనాలపై నమ్మకం లేదా? ఈ యజ్ఞపశువైన మేక ఊర్ధ్వగతి పొందుతుంది. యజ్ఞంలో బలి అయ్యే జీవుడు స్వర్గ సుఖం పొందుతాడు గదా!

సన్నాసి : మేక స్వర్గానికి పోతే పోనీ, దానివల్ల నీకేమి ప్రయోజనం?

యాజ్ఞికుడు : బలిపశువుతో యాగం చేస్తే స్వర్గాది దివ్యసౌఖ్యాలు కల్గుతాయి.

సన్న్యాసి : హింస పాపమని వేదాలే చెప్పాయి కదా!

యాజ్ఞికుడు : నీవు సమాధిలో వాయువుని బంధించి, మనస్సును నిగ్రహించి వాటిని పుణ్యకార్యాలుగా చేసి యోగంలో స్థిరపడుతావు. ఇందులో హింస లేదా?

సన్న్యాసి : అక్షరోపాసనచే ప్రకృతిగుణాలు కల శరీరాన్ని ఆశ్రయించిన క్షరతత్త్వాన్ని నశింపజేసి అద్వైతానందం పొంది మనస్సును లౌకిక సుఖాలలోకి జారకుండా నిగ్రహించడం 'హింస' అనడం అజ్ఞానమే.

యాజ్ఞికుడు : స్వామీ! పెద్దల ఉపదేశం విన్నవాడు మంచిచెడులు గుర్తిస్తాడు. నేను బలి యిచ్చేటప్పుడు జ్ఞానాజ్ఞానాలు విభజించి అక్షరతత్త్వం దర్శిస్తాను. కాన నాకు పాపమంటదు. యజ్ఞంతో ఉత్తమగతి పొందుతాను".

సన్న్యాసి : పశుయజ్ఞం కంటె తపోయజ్ఞం మేలైనదని చెప్పాను. ఇక మాట లెందుకు?

దానికి యాజ్ఞికుడు సమ్మతించాడు.

ఈ కథ చెప్పి బ్రాహ్మణుడు భార్యతో మళ్ళీ కార్తవీర్యార్జునుని ఇతిహాసం వివరించాడు. అతడు తండ్రిని చంపిన రాజులను పెక్కుమార్లు వధించాడు. పితృదేవతలు అది తగదని చెప్పినా వినలేదు.

అపుడు వారతనితో తపోయజ్ఞం శ్రేష్ఠమనీ, పూర్వం అలర్కుడనే రాజు ఇంద్రియాలను జయించడానికై ఆయుధాలు ప్రయోగించి విఫలుడై, తపస్సుచేసి సాధించిన అస్త్రాలు ప్రయోగించి యోగమార్గంతో విజయం సాధించాడు. నీవు గూడా అలా విజేతవు కమ్ము అని చెప్పగా, అతడు వారి మాట విని తపోనుష్ఠానంతో ఉత్తమగతి పొందాడు.

అలా చెప్పి బ్రాహ్మణుడు మరల భార్యతో ఇలా అన్నాడు.

అంతశ్శత్రువులను జయించాలి. ఇంద్రియాలతో మనస్సును జయించాలి. తద్ద్వారా శాంతి పొంది మోక్షానికై ప్రయత్నించాలి. ముఖ్య శత్రువును గుర్తించడానికి అంబరీష గీతలున్నాయి అని ఆ గీతలను సంగ్రహంగా పేర్కొంటాడు.

జనకబ్రాహ్మణ సంవాదం

తరువాత బ్రాహ్మణు డామెతో మరొక సంవాదం చెప్పాడు – జనకుడు. తన ఎదుట తప్పు చేసిన ఒక బ్రాహ్మణుణ్ణి "నీవు నా దేశం వదలి వెళ్ళిపో" అన్నాడు.

బ్రాహ్మణుడు : నీ దేశమేదో చెప్పు, గ్రహించి వెళ్తాను.

అంతట జనకుడు మౌనం వహించి మూర్ఛిల్లాడు. అందుండి తేరుకొని "అయ్యా! ఈ రాజ్యం తండ్రి తాతల నుండి మా వశంలో ఉన్నది. కాని 'ఇది నాది' అనే భావన నాకు లేదు. 'ఈ మిథిల నా నగర' మని చెప్పలేను. అంచేత నిన్ను వెళ్ళి పొమ్మన్నందుకు బాధపడి మూర్ఛిల్లాను. అపుడు బ్రాహ్మణుడు – 'రాజా నీవు నీ రాజ్యం మీదా, నగరం మీదా మమకారం లేకుండా ఎలా ఉన్నావు? ఏమిటా రహస్యం?"

జనకుడు : బాగా పరిశీలిస్తే – ఈ రాజ్యం, ధనం ఎప్పుడైనా నశించేవే. కాన ఇది నా సంపద అన్న భావన నాకు కల్గడం లేదు. ఇంద్రియాలూ, విషయాలూ నశించేవే. వాటిని నావి అనుకోకుంటే పంచభూతాలు నాచే జయింపబడిన వవుతాయి.

అందు కా విప్రుడు నవ్వి "నిన్ను పరీక్షించడానికి వచ్చిన యమ ధర్మరాజును నేను" అని అతణ్ణి ఆశీర్వదించి వెళ్ళాడు.

ఇలా బ్రాహ్మణుడు భార్యతో, ఆమె ఆలోచననూ, తన వైరాగ్య తీవ్రతనూ, నిర్భయత్వాన్నీ వివరించాడు. తన ఉపదేశాన్ని గ్రహించి శ్రేయస్సు పొందమన్నాడు. ఆమె భర్తకు నమస్కరించి "మీ మాటలు సాధన లేనివారి కర్థం కావు. సాధన ఉన్నా త్వరగా గోచరించవు. ఒకసారి గ్రహించినా మరల మరపు రావచ్చు. జ్ఞానోపాయం బోధించండి" అని ప్రార్థించింది.

బ్రాహ్మణుడు : బ్రాహ్మణుడు అరణి అనీ, గురువు ఉత్తరారణి అనీ, తపస్సు, వేదం రెండింటినీ మథనం చేస్తే పుట్టే జ్ఞానం ముక్తిప్రదమనీ ఉపదేశించాడు.

ఆమె బ్రాహ్మణుడు, క్షేత్రజ్ఞుడు అంటే ఏమిటో వివరించమన్నది.

బ్రాహ్మణుడు : బ్రాహ్మణుణ్ణి ప్రత్యేకంగా గుర్తించే సాధనం లేదు. అత డింద్రియాల కందడు. ఏ లక్షణాలూ అతనికి లేవు. అహంకారరాహిత్యమనే లక్షణంతో అతణ్ణి కొంత గుర్తించవచ్చు" అని అన్నాడు. అంతట ఆమె విషయం గ్రహించి శాంతించింది.

ఇదంతా శ్రీకృష్ణుడు చెప్పడం విని పార్థుడు "ఆ దంపతులు అంత గొప్పవారా! వారెక్కడివారు?" అని అడిగాడు.

అందుకు భగవానుడు "నా మనస్సే బ్రాహ్మణుడు, బుద్ధి బ్రాహ్మణి" అని చెప్పి "ఇంద్రియాల కందని పరమాత్మను నేనే" అని ఉపదేశించి అర్జునునికి ఆశ్చర్యం కల్గించాడు.

ఇలా ఈ బ్రాహ్మణగీతలలో ఆధ్యాత్మిక విద్యా రహస్యాలు కథల ద్వారా బోధించడమయింది. **– డా॥ సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి**

బ్రాహ్మణగీతలు

బ్రాహ్మణగీతలు (సం. 14-20-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 1

ప్రతిపదార్థం: హరిహరనాథస్వామీ! వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

ఆ. అట్లు శౌరి పార్థు నంచిత బ్రహ్మవి।
ద్యాప్రబోధకంబు లైన యట్టి
వినుతవాక్యవాక్యములు సవిస్తరంబుగ విని।
పించి యతనివలన ప్రీతిఁ జేసి. 2

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; శౌరి= కృష్ణుడు; పార్థున్= అర్జునుడిని (గురించి); అంచిత= గొప్పదైన; బ్రహ్మవిద్యా ప్రబోధకంబులు+ఐన+అట్టి= వేదాంత విద్యను బోధించేటటువంటి; వినుత= ప్రసిద్ధ; వాక్యములు= వాక్యాలు; సవిస్తరంబుగన్= విశదంగా; వినిపించి= చెప్పి; అతనివలనన్= అతడియందు; ప్రీతిన్+చేసి= ప్రేమకారణంగా.

తాత్పర్యం: అట్లా పూర్వపర్వంలో చెప్పిన విధంగా శ్రీకృష్ణుడు అర్జునుడికి గొప్ప వేదాంతవిద్యను బోధించేటటువంటి ప్రసిద్ధకావ్యాలను విశదంగా బోధించినవాడై, అతడిపట్ల ఉన్న ప్రేమకారణంగా. (తరువాతి వచనంతో అన్వయం)

వ. వెండియు నిట్లని బోధించు 3

ప్రతిపదార్థం: వెండియున్= మరల; ఇట్లు+అని= ఈ విధంగా; బోధించున్= బోధించాడు.

తాత్పర్యం: ఇంకా ఇట్లా చెప్పాడు.

సీ. భర్తృభార్యాకృత భవ్యసంవాదంబు।
నభయ నామకమునై యతిశయిల్లు
నట్టిది యొక యితిహాసంబు విను పార్థ!
జననుతసమధికజ్ఞానవర్ణి
తాత్మకుఁ డైన మహాద్విజుఁ డొకఁడు వి।
విక్త ప్రదేశసేవిత్వనిరతి
నున్నెడ నల్ల నాసన్నయై వినయంబు।
భక్తియు నెసఁగఁ దత్పత్ని ప్రణతి

తే. యాచరించి 'మహాత్మ! యధ్యాత్మబోధ।
భరితఁగాఁ జేయవే నన్నుఁ గరుణ పల్ల
వింప' నని దయపుట్టంగ వేఁడుటయును।
మందహాసవిభాసియై మగువఁ జూచి. 4

ప్రతిపదార్థం: పార్థ!= అర్జునా!; భర్తృ భార్యా కృత= భర్తృభార్యలచేత చేయబడిన; భవ్య= గొప్ప; సంవాదంబున్= సంభాషణ; అభయ నామకమున్+ ఐ= అభయమని పేరు కలిగినది; అతిశయిల్లున్= ప్రసిద్ధి చెందిన; అట్టిది= అట్లాంటిది; ఒక+ఇతిహాసంబు= ఒక కథ (ఉన్నది); విను; జననుత= ప్రజలచేత ప్రస్తుతించబడిన; సమధిక= మిక్కిలి అధికమైన; జ్ఞాన వర్ణిత+ ఆత్మకుఁడు+ఐన= జ్ఞానంచేత పేరెన్నిక గన్న ఆత్మ కలిగిన (ఆత్మజ్ఞానం కలిగిన అని అర్థం); మహాద్విజుఁడు= ఉత్తమ బ్రాహ్మణుడు; ఒకఁడు= ఒకాయన; వివిక్త= ఏకాంతమైన; ప్రదేశ= స్థలాలలో; సేవిత్వనిరతిన్= భగవంతుడిని ఉపాసనచేయాలన్న కోరికతో; ఉన్న+ఎడన్= ఉన్న సందర్భంలో; అల్లన్= నెమ్మదిగా; ఆసన్న+ఐ= సమీ పించినదై; వినయంబున్= వినయమూ; భక్తియున్= భక్తీ; ఎసఁగన్= అతిశయించగా; తద్+పత్ని= ఆయన భార్య; ప్రణతి+ఆచరించి= నమస్కారంచేసి; మహాత్మ!= ఓ మహనీయుడా!; నన్నున్= నన్ను; కరుణ+పల్లవింపన్= దయ చిగురొత్తగా; అధ్యాత్మబోధ+ భరితన్+కాన్= అధ్యాత్మజ్ఞానంతో నిండినదానినిగా; చేయవే+ దయతో చేయుము; అని; దయ+పుట్టంగన్= దయ జనించేటట్లుగా; వేఁడుటయును= ప్రార్థించగా; మంద హాస= చిరునవ్వుతో; విభాసి+ఐ= ప్రకాశిస్తున్నవాడై; మగునవన్+చూచి= ఆ స్త్రీని చూచి.

తాత్పర్యం: 'అర్జునా! వినుము. భార్యాభర్తలు చేసిన ఒక గొప్ప సంభాషణ 'అభయ' మనే పేరుతో ప్రసిద్ధమైనది ఒక కథ ఉన్నది. ఆ కథ చెప్తుతాను. ఒక ఊరిలో ప్రజలందరూ స్తుతించే ఒక ఉత్తమబ్రాహ్మణుడు ఉండేవాడు. ప్రజలందరూ అతడి ఆత్మజ్ఞానాన్ని ప్రశంసించేవారు. అతడు ఒకప్పుడు ఏకాంతంగా కాలం గడుపుతూ భగవంతుడిని ఉపాసించా లని అభిలషించాడు. ఆ సమయంలో ఆయన భార్య నెమ్మదిగా అక్కడికి వచ్చి భక్తి, వినయం అతిశయించగా ఆయనకు నమస్కరించి 'స్వామీ! నాకు అధ్యాత్మజ్ఞానాన్ని దయతో బోధించి నన్ను తరింపజేయండి' అని ప్రార్థించింది. అప్పుడు ఆయన చిరునవ్వు నవ్వుతూ ఆమెను చూచి (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'ఈ మాటకుఁ జారుముఖీ।
నామది ముదమందెఁ గాన నాతికి నిదియే
లా మేటితలంపను త్రో।
పేమియు లే; దోపి వినుము హితవచనంబుల్. 5

ప్రతిపదార్థం: చారుముఖీ!= ఓ అందమైన ముఖం కలిగిన నారీమణీ!; ఈ మాటకున్= నీ వాడిన ఈ మాటతో; నా మది= నా మనస్సు; ముదము+ అందెన్+కాన= సంతోషపడింది కాబట్టి; నాతికిన్= స్త్రీకి; ఇది= ఇట్లా అడగటం; ఏలా?= ఎందుకు?; మేటి తలంపు= గొప్ప ఆలోచన; అను= అనేటటువంటి; త్రోపు+ఏమియున్+లేదు= నిషేధం ఏమీ లేదు; హిత వచనంబుల్= నేను చెప్పే మంచి మాటలు; ఓపి+వినుము= ఓపికతో వినుము.

తాత్పర్యం: 'ఓ వనితా! నీ మాటతో నా హృదయం సంతోషపడింది. స్త్రీ ఇంత పెద్ద ఆలోచన చేయటమా అనే నిషేధం ఏమీ లేదు. (అంటే నీవు

అడగటానికి అర్హురాలవే అని అర్థం). కాబట్టి నేను చెప్పే మంచి మాటలు సావధానంగా వినుము.'

విశేషం : వేదభ్యాసం చేయటం స్త్రీకి తగినదా? కాదా? - అనే ధర్మశాస్త్రమీమాంస ఉన్నది. యజ్ఞం ఆచారకాండతో ముడిపడినది. ఆ యజ్ఞానికి కూడా స్త్రీ సహకారం ప్రధానమైనది. ధర్మపత్నితో కూడినవాడై యజ్ఞంచేయాలి. అట్లాగే వేదాంత చర్చ స్త్రీకి అనవసరమనే సాధారణభావమూ ప్రజలలో ఉన్నది. ఈ సందర్భాన్ని చూస్తే వేదాభ్యాసమూ, వేదాంత ప్రశ్న స్త్రీకి అనుచితాలు కావని స్పష్టంగా అర్థం చేసికొనవచ్చును. కాబట్టి స్త్రీకి వేదవిద్య నిషిద్ధమనే భావన చారిత్రకంగా మధ్యయుగాలలో పుట్టినది అని మనం అర్థం చేసికొనవచ్చును.

వ. నా యెఱింగిన భంగిఁ జెప్పెద' నని పలికి యయ్యతులవ్రతుం డా పతివ్రత కిట్లనియె. 6

ప్రతిపదార్థం: నా+ఎఱింగిన= నాకు తెలిసిన; భంగిన్= విధంగా చెప్పెదన్= చెప్పుతాను; అని; పలికి= చెప్పి; ఆ+అతులవ్రతుండు= ఆ నిరుపమదీక్షగల బ్రాహ్మణుడు; ఆ పతివ్రతకున్= ఆ పతివ్రతతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'నాకు తెలిసిన రీతిలో చెప్పుతాను' అని ఆ దీక్షితుడైన బ్రాహ్మణుడు ఆ పతివ్రతతో ఇట్లా అన్నాడు.

సీ. 'వినను గానను జేయ వెరవైన యవి కర్మ।
ములు; వానిఁ గర్మకర్తలు సమస్త
సిద్ధిప్రదము లని చెప్పుదు రజ్ఞాన।
తిమిరాంధులై విను ధీరచిత్త!
జగమున లేదు నిష్కర్మత్వ మెందేనిఁ।
గలిగె నేనియును మౌర్ఖ్యముగ దాని
నిందింతు రెక్కుడు నెల వది యాత్మ నేఁ।
గందు బ్రహ్మంబు నిష్కలత నందు

తే. వెలుఁగు నగ్నితో సోముండు గలసి మిథున।
ధర్మమం దెప్డు నడపి భూతములఁ దాల్చు
నజుఁడు మొదలుగ నక్షరోపాస్తియందుఁ।
జేయుదురు శాంతి నింద్రియజిత్త్వ మొంది. 7

ప్రతిపదార్థం: ధీరచిత్త!= ధీరత్వంతో కూడిన చిత్తం కలిగిన ఓ వనితా!; వినమున్= వినటానికి; కానమున్= చూడటానికి; చేయన్= చేయటానికి; వెరవు+ఐన= వీలైన; అవి= పనులు ఏవి ఉన్నాయో అవి; కర్మములు= కర్మలు; కర్మకర్తలు= కర్మవాదులు; వానిన్= ఆ కర్మలను; అజ్ఞాన= అజ్ఞానమనే; తిమిర+అంధులు+ఐ= చీకటితో కన్ను గాననివారై; సమస్త సిద్ధి ప్రదములు+ అని చెప్పుదురు= అన్ని సిద్ధులను ఇస్తాయని చెప్పుతారు; జగమునన్= ప్రపంచంలో; నిష్కర్మత్వము= కర్మలేనితనం; లేదు; ఎందేనిన్= ఎక్కడైనా; కలిగెను+ఏనియున్= ఉన్నాకూడా; మౌర్ఖ్యముగన్= మూర్ఖుడి లక్షణంతో; దానిన్= ఆ నిష్కర్మపరత్వాన్ని; నిందింతురు= నిరసిస్తారు; అది= ఆ నిష్కర్మపరత్వం; ఎక్కుడు+ నెలవు= ఉన్నతమైన స్థితి (ఎందుకంటే); ఏను= నేను; ఆత్మన్=ఆత్మలో; బ్రహ్మంబున్= బ్రహ్మాన్ని; కందున్= చూస్తాను (ఆ తత్త్వం); నిష్కలతన్+అందు= ఏ కళాలేని స్థితిలో ఉంటుంది (అది నిజంగా నిష్కర్మతోడి స్థితి); వెలుఁగన్= నిరంతరం ప్రకాశించే; అగ్నితో; సోముండు= చంద్రుడు; కలసి= కలసినవాడై; మిథునధర్మమందున్+ ఎప్డున్+ నడపి= సంగమధర్మంలో జగత్తును ఎప్పుడూ నడిపించి; భూతములన్+తాల్చున్= సర్వ ప్రాణులనూ జనింపచేస్తున్నాడు; అజుఁడు= బ్రహ్మ; మొదలుగన్= మొదలైన దేవత లందరూ; శాంతిన్= పరమశాంత చిత్తస్థితులై; ఇంద్రియ జిత్త్వము+ఒంది= ఇంద్రియ జయాన్ని కలిగి, అక్షర+ఉపాస్తి+అందున్+ చేయుదురు= అక్షర తత్త్వాన్ని ఉపాసించటమనే కర్మలో నిరంతరం మగ్నులుగా ఉంటారు.

తాత్పర్యం: 'ఓ ధీరస్వభావురాలా! వినుము! వినటానికి, చూడటానికి, చేయటానికి వీలైన పనులు ఏవేవి ఉన్నాయో అవన్నీ కర్మలు, కర్మవాదులు అజ్ఞానమనే చీకటిలో ఉన్నవారై ఆ కర్మలు సమస్తసిద్ధులను ప్రసాదిస్తాయని అంటారు. అసలు ప్రపంచంలో నిష్కర్మత్వం అనే స్థితే లేదు. ఎక్కడైనా ఉన్నా అది మూర్ఖుడి ధర్మంగా అందరూ నిందిస్తారు. కాని, అట్లా ఏ క్రియా లేని స్థితి అన్నది పరమోన్నతమైనది. అది బ్రహ్మలక్షణం. నేను ఆత్మలో చూస్తాను. బ్రహ్మో పాసనచేస్తాను. ఆ బ్రహ్మతత్త్వం 'నిష్కళంకంగా కనిపిస్తుంది (అందుకే అది 'నిష్కర్మం'గా ఉండగలుగుతుందని అర్థం). ఇక తక్కిన జగత్తంతా క్రియాత్మకమే. అగ్నితో సోముడు కలసి సంగమధర్మంతో జగత్తును నడిపిస్తూ సకలప్రాణరాశినీ సృష్టి స్తున్నాడు. బ్రహ్మాది దేవతలు పరమశాంతిచిత్తులై ఇంద్రియవిజయం పొంది అక్షర తత్త్వోపాసనలో నిరంతరం మగ్నులై ఉంటారు.

విశేషం : లోకంలోని కర్మ మోహజనకమైనది. ఇంద్రియాలు చేసే పనులు అట్లాంటివే. అది సకామం (కామంతో కూడినది). యోగి అభ్యసించేది నిష్కర్మ. దానికి ఫలితం ఇంద్రియజయం. ఆ అనుభవం 'శాంత' స్థితి. అక్కడ ఏ రసాల అలజడులూ లేవు. అది బ్రహ్మ కర్మ, ఇక్కడ బ్రహ్మ శబ్దం చతుర్ముఖబ్రహ్మను సూచించేది కాదు. పరతత్త్వసూచకం. ఇది 'బ్రహ్మం.'

'అగ్నిషోమాత్మకం బీజం రామనామే ప్రతిష్ఠితమ్' అని వేదాంతులు రామశబ్దాన్ని నిర్వచిస్తారు. రకారం అగ్నిబీజమని, మకారం సోమబీజమని, స+ఉమ - అని విడదీస్తే ఉమతోకూడినవాడు 'ఈశ్వరుడు' అవుతాడు. అగ్ని శివపార్వతుల సమాగమాన్ని భంగంచేసి శివతేజస్సును గ్రహించగా కుమారుడు పుట్టాడు. ఈ కుమారుడు విశ్వకుమారుడు. (ప్రపంచంలో ప్రతి కుమారుడి పుట్టుకకూడా ఈ కథలోనే ఉన్నదని అగ్ని, సోముల కలయిక ప్రస్తావన నిరూపిస్తున్నది. సర్వప్రాణుల హృదయాలలో ఉన్నవాడు ఈశ్వరుడు (ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి - అని గీత). కనుక చంద్రాగ్నుల కలయికతో జగద్బీజం ఏర్పడుతున్నదని

తాత్పర్యం. ఇదీ కర్మమే కాని ఇది మోహజయం కలిగిన నిర్వికారకర్మ. జగత్తును రక్షించటానికి వినియోగించిన నిష్కామకర్మ కాబట్టి కర్మ-అకర్మ - నిష్కర్మలను గుర్తించటంద్వారా మనిషి జ్ఞానవంతు డవుతాడని ఆ భర్త భార్యకు బోధిస్తున్నాడు.)

వ. అక్షరంబు తెఱం గెఱింగించెద. 8

ప్రతిపదార్థం: అక్షరంబు= అక్షరతత్త్వపు; తెఱంగు= లక్షణాన్ని; ఎఱింగించెదన్= తెలియజేస్తాను.

తాత్పర్యం: అక్షరతత్త్వ స్వభావాన్ని వివరిస్తాను.

విశేషం: పూర్వపద్యంలో బ్రహ్మాది దేవతలు అక్షరతత్త్వాన్ని ఉపాసిస్తా రన్నాడు కదా! ఆ 'అక్షర' స్వభావం ఏమిటో చెప్పుతున్నాడు. న+క్షరం - అంటే ఎప్పటికీ తరగనిది. క్షీణించనిది అని అర్థం. ప్రకృతిశక్తులన్నీ నశిస్తాయి. పురుషతత్త్వమైన ఆత్మపదార్థం ఒకటే ఎప్పుడూ స్థిరంగా ఉండేది. అది ఎట్లాగో నిరూపిస్తున్నాడు.

సీ. స్పర్శంబు రసము రూపంబును శబ్దంబు।
గంధంబుఁ గాకున్కి కారణముగఁ
ద్వక్కున జిహ్వ నేత్రమున శ్రోత్రంబున।
ఘ్రాణంబునను బరిగ్రహవిధాన
మాచరించుటకు లోనై యుండ దాతత్త్వ।
మమలిన బుద్ధ్యవగమము దానిఁ
బ్రాపించుఁ బ్రాణాది పంచవాయువులును।
విను దానివలన వర్తనముఁ బొందు

తే. నంద డిందుఁ బ్రాణంబు నపానమును స।
మాననామకవ్యానమధ్యమున నడచు
మెలఁగుచుండుఁ బ్రాణాపానములకు నడిమి।
దెస నుదానంబు శ్రుతి యిట్లు దేటపఱిచె. 9

ప్రతిపదార్థం: అ తత్త్వము= ఆ అక్షర పరబ్రహ్మతత్త్వం; స్పర్శంబు= స్పర్శ; రసము= రసం; రూపంబును= రూపం; శబ్దంబు= శబ్దం; గంధంబు= గంధం; కాక+ఉన్కి+ కారణముగన్= కాకుండా ఉండటంవలన; త్వక్కునన్= చర్మంతో; జిహ్వన్= నాలుకతో; నేత్రమునన్= కంటితో; శ్రోత్రంబునన్= చెవితో; ఘ్రాణంబునన్= ముక్కుతో; పరిగ్రహవిధానము+ఆచరించుటకున్= గ్రహించటానికి; లొను+ఐ+ఉండదు= వీలుకాదు; అమలిన= నిర్మలమైన; బుద్ధి+అవగమము= వివేకంతోనే తెలిసికొనదగింది (బుద్ధికి అందేది); దానిన్+ప్రాపించు= ఆ తత్త్వాన్ని పొందేటట్లు చేసేటటువంటి; ప్రాణాది= ప్రాణాది= ప్రాణ, అపానాదులైన; పంచవాయువులునున్= ఐదు వాయువులూ; దానివలనన్= అ అక్షరతత్త్వంవలననే; వర్తనమున్+పొందున్= ప్రవర్తిస్తున్నాయి; విను= బాగా శ్రద్ధగా వినుము. అందున్+అ= ఆ తత్త్వంలోనే (అవి); డిందున్= లీనమవుతాయి; ప్రాణంబున్+అపానమునున్= ప్రాణం, అపానం అనబడేవి; సమాన నామక= సమానమనే పేరుగలిగిన; వ్యానమధ్యమునన్= వ్యానం నడుమ; నడచున్= ప్రసరిస్తూ ఉంటుంది; ప్రాణ+అపానములకున్= ప్రాణాపానాలకు; నడిమి దెసన్= నడుమగా; ఉదానంబు= ఉదానం; మెలఁగుచుండున్= వ్యాపించి ఉంటుంది; ఇట్లు= ఈ విధంగా; శ్రుతి= వేదం; తేటపఱిచెన్= స్పష్టంగా చెప్పినది.

తాత్పర్యం: ఆ అక్షర పరబ్రహ్మతత్త్వం స్పర్శ, రస, రూప, శబ్ద, గంధాలు లేనిది కావటంచేత చర్మంతోకాని, నాలుకతోకాని, కంటితోకాని, చెవితోకాని, ముక్కుతోకాని గుర్తించటానికి సాధ్యం కాదు. అది కేవలం పవిత్రమైన బుద్ధివిశేషంచేత మాత్రమే తెలిసికొనబడుతుంది. ఆ తత్త్వాన్ని పొందించేటటువంటి ప్రాణాపానాది పంచవాయువులు కూడా ఆ అక్షరతత్త్వంవలననే ప్రభవిస్తున్నాయి. అందులోనే చివరికి లీన మవుతున్నాయి కూడా. ప్రాణాపానాలు సమానమని పేరు కలిగిన వ్యానం మధ్యంలో ఉండగా, ప్రాణాపానాలనడుమ ఉదానం ప్రసవిస్తూ ఉంటుంది - అని వేదం స్పష్టంగా ప్రతిపాదించి ఉన్నది.

విశేషం :

"హృది ప్రాణః గుదే-ఉపానః సమానో నాభిసంస్థితః,
ఉదానః కంఠదేశస్థః వ్యానః సర్వశరీరగః" అని చెప్పుతారు.

(హృదయంలో ప్రాణం, గుదస్థానంలో అపానం, నాభిలో సమానం, కంఠంలో ఉదానం ఉండగా, వ్యానం సర్వదేహంలోనూ వ్యాపించి ఉంటుంది.)

"నాగశ్చ కూర్మః కృకరో దేవదత్తో ధనంజయః,
వాగ్ద్వారే నాగ ఆఖ్యాతః కూర్మ ఉన్మీలనే స్మృతః.
కృకరాచ్చ క్షుతం జ్ఞేయం దేవదత్తా విజృంభణే,
న జహాతి మృతం వాపి సర్వవ్యాపీ ధనంజయః."

(ఈ పంచప్రాణాలకు - నాగ, కూర్మ, కృకర, దేవత్త, ధనంజయాలని పేర్లు, నోటి ద్వారంలో నాగం, కంటి రెప్పలలో కూర్మం, తుమ్ములో కృకరం, ఆవులింతలో దేవదత్తం, మనిషి చనిపోయినా దేహమంతటా వ్యాపించి ధనంజయం - అనే ప్రాణాలు ఉంటాయి.)

క. **నెలకొని ప్రాణపానం**
బులఁ బురుషుఁడు సుప్తుఁ డైనఁ బొలఁతి! విలీనం
బులగు సమానవ్యానం
బులు యోగులు సంశయంబుఁ బొందరు దీనన్. **10**

ప్రతిపదార్థం: పొలఁతి!= ఓ వనితా!; పురుషుఁడు= జీవుడు; ప్రాణ+అపానంబులన్= ప్రాణాపానాలలో; నెలకొని= ఉండి; సుప్తుఁడు+ఐనన్= నిద్రిస్తే; సమాన వ్యానంబులు= సమానం, వ్యానం అనే ప్రాణాలు; విలీనంబులు+అగున్= కలిసిపోతాయి; దీనన్= ఈ విషయంలో; యోగులు= యోగసాధకులు; సంశయంబున్+పొందరు= ఏ సందేహమూ పడరు.

తాత్పర్యం: ఓ వనితా! జీవుడు ప్రాణాపానాలలో ఉండి నిదురపోతే సమానవ్యానాలు కలిసిపోతాయి. యోగులు ఈ విషయంలో ఏ సందేహమూ పడరు.

క. విను తెలియంగ నుదానం।
బున సుప్తుం డైనఁ బ్రాణము నపానంబున్
వనజనిభలోచనా! పురు।
షుని విడువవు యోగిజనుల చూ పిట్లుండున్. 11

ప్రతిపదార్థం: వనజనిభలోచనా!= కమలసమాననయనా!; తెలియంగన్+విను= బాగా వినుము; ఉదానంబునన్= ఉదానంలో; సుప్తుండు+ఐనన్= నిద్రిస్తే; పురుషునిన్= పురుషుడిని; ప్రాణమున్+ అపానంబున్= ప్రాణాపానాలు; విడువవు= వదలిపెట్టవు; యోగిజనుల= యోగులగుజనుల; చూపు= దృష్టి; ఇట్లు+ఉండున్= ఇట్లా ఉంటుంది.

తాత్పర్యం: పద్మలోచనా! బాగా వినుము, ఉదానంలో నిద్రిస్తే ప్రాణాపానాలు ఆ జీవుడిని వదలిపెట్టవు. యోగుల దృష్టి ఇట్లాంటిది.

విశేషం : పై రెండు పద్యాలలో వివరించిన వాయువుల సమ్మేళనవిషయం తరువాత వివరించబోయే 'అంతర్యాగవిషయం'గా చాలా ప్రధానం. యోగులు ప్రాణవాయువులను ఏయే విధంగా శిక్షణలో ఉంచుకొంటారో ఈ వర్ణనవలన తెలిసికొనవచ్చును.

అంతర్యాగప్రకారంబు నిరూపించి చెప్పుట (సం. 14-20-18)

వ. ఇవ్వాయువు లేనును మనంబును బుద్ధియుంగూడ నీ యేడును వైశ్వానరునకు జిహ్వాలు; వైశ్వానరుం డనఁబ్రాణుల దేహంబులం దగ్నిరూపంబున వెలుంగుచున్న యాత్ముండు; ఘ్రేయంబును భక్ష్యంబును దృశ్యంబును స్పృశ్యంబును శ్రావ్యంబును మంతవ్యంబును బోద్ధవ్యంబును నగు నీ సప్తసంఖ్య సమిధలు, ఘ్రాతయు, భక్షయితయు, ద్రష్టయు, స్పృష్టయు, శ్రోతయు, మంతయు, బోద్ధయు నయిన యీ యేడ్వురును వరుసన ఘ్రేయాదులయిన హవిస్సులేడింటిని వేల్చుఋత్విజు; లిదిసప్తహోతృవిధాన ప్రకారంబు వైశ్వానరు వదనంబులు పదియు దిగ్వాయు సూర్యచంద్ర

పృథివీపావకశక్ర విష్ణుప్రజాపతిమి త్రాత్మకంబులు; శబ్దస్పర్శరూపరస గంధ వక్తవ్యకర్తవ్యగంతవ్యవిసర్గానందంబులు హవిస్సు లీ పదింటినిం గ్రమంబున నాహుతులు సేయుహోతలు శ్రోత్ర త్వక్చక్షుర్జిహ్వాఘ్రాణవాక్పాణి పాదపాయూపస్థంబు లయిన దశేంద్రియంబు; లిత్తెఱంగు దశహోతృవిధి; యీ రెంటిని నెఱింగి యిం దేవిధంబున నేనియు జీవాత్ముం డుపద్రష్టగా నంతర్యాగంబు నడపు యోగి జనంబులు జనన మరణవిముక్తులగుదురు. బహిర్యజ్ఞపరులు గమనాగమన భ్రమణంబులం బొందుచుండుదు' రని చెప్పి వెండియు. 12

ప్రతిపదార్థం: ఈ+వాయువులు+ఏనునున్= ఈ ఐదు వాయువులూ; మనంబునున్= మనస్సూ; బుద్ధియున్+కూడన్= బుద్ధీ కలిస్తే; ఈ+ఏడును= ఈ ఏడూ; వైశ్వానరునకున్= వైశ్వానరుడికి; జిహ్వాలు= నాలుకలు; వైశ్వానరుండు+అనన్= వైశ్వానరుడు అనే పేరుతో; ప్రాణుల దేహములందున్= ప్రాణుల దేహాలలో; అగ్నిరూపంబునన్= అగ్నిరూపంలో; వెలుంగుచున్+ఉన్న= వెలుగుతున్న; ఆత్ముండు= ఆత్మ; ఘ్రేయంబునున్= వాసన చూడదగినది; భక్ష్యంబునున్= తినదగినది; దృశ్యంబునున్= చూడదగినది; స్పృశ్యంబునున్= స్పర్శించదగినది; శ్రావ్యంబునున్= వినదగినది; మంతవ్యంబునున్= ఆలోచింపదగినది; బోద్ధవ్యంబునున్= తెలిసికొనదగినది; అగు= అనేటటువంటి; ఈ సప్తసంఖ్య సమిధలున్= ఈ ఏడు సమిదలును; ఘ్రాతయున్= వాసన చూచేవాడూ. భక్షయితయున్= తినేవాడూ; ద్రష్టయున్= చూచేవాడూ; స్పృష్టయున్= తాకేవాడూ; శ్రోతయున్= వినేవాడూ మంతయున్= ఆలోచించేవాడూ; బోద్ధయున్= తెలిసికొనేవాడూ; అయిన+ఈ+ఏడ్వురును= అనే ఈ ఏడుగురూ; వరుసన్+అ= క్రమంగా; ఘ్రేయాదులు+అయిన= వాసన చూడదగినవి అయిన; హవిస్సులు+ఏడింటినిన్= ఏడు హవిస్సులను; వేల్చు= హోమంచేసే; ఋత్విజులు= ఋత్విక్కులు; ఇది= ఇట్లా చేయటం; సప్త హోతృ విధాన ప్రకారంబు= ఏడుగురు హోతలు హోమం చేసే విధానం; వైశ్వానరు వదనంబులు= వైశ్వానరుడి ముఖాలు; పదియున్= పది (ఏ వంటే);

దిక్= దిక్కులు; వాయు= వాయువూ; సూర్య= సూర్యుడూ; చంద్ర= చంద్రుడూ; పృథివీ= భూమీ; పావక= అగ్నీ; శక్ర= ఇంద్రుడూ; విష్ణు= విష్ణువూ; ప్రజాపతి; మిత్ర+ఆత్మకంబులు= మిత్రుడు అనబడేవాడు; శబ్ద= శబ్దము; స్పర్శ= తాకటం; రూప= రూపమూ; రస= రసమూ; గంధ= గంధమూ; వక్తవ్య= మాటాడదగినదీ; కర్తవ్య= చేయదగినదీ; గంతవ్య= పోదగినదీ; విసర్గ= విసర్జించదగినదీ; ఆనందంబులు= ఆనందం - అనబడేవి; హవిస్సులు= హోమద్రవ్యాలు; ఈ పదింటిని, క్రమంబునన్= క్రమంగా; ఆహుతులు+ చేయు= హోమం చేసే; హోతలు= ఋత్విక్కులు; శ్రోత్ర= చెవి; త్వక్= చర్మ; చక్షుస్= కన్నులు; జిహ్వా= నోరు; ఆఘ్రాణ= ముక్కు; వాక్= నాలుక; పాణి= చేతులు; పాద= కాళ్ళు; పాయు= గుదం; ఉపస్థంబులు= జననేంద్రియం అనబడే; దశ+ఇంద్రియంబులు= పది కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలు; ఈ+తెఱంగు= ఇట్లా హోమం చేయటం; దశహోతృవిధి= పదిమంది ఋత్విక్కులు హోమం చేసే విధానం అనబడుతుంది; ఈ రెంటినిన్+ఎఱింగి= ఈ రెండింటిని గుర్తించి; ఇందున్+ఏవిధంబునన్+ఏనియున్= ఇందులో ఏ విధంగానైనా; జీవాత్మన్= జీవాత్ముడిని; ఉపద్రష్టగాన్= ఉపాధ్యాయుడిగా; అంతర్+యాగంబు= శరీరంలోపల జరిపే యాగాన్ని; నడపు= నడిపే; యోగిజనంబులు= యోగులైనవారు; జనన మరణ= చావు పుట్టుకలనుండి; విముక్తులు+అగుదురు= విడుదల పొందుతారు; బహిస్+యజ్ఞపరులు= సాధారణంగా బయట జరిపే యజ్ఞం చేసేవారు; గమన+ఆగమన= చావుపుట్టుకలనే; భ్రమణంబులన్= చక్రభ్రమణం; పొందుచున్+ ఉండుదురు= పొందుతూ ఉంటారు; అని చెప్పి; వెండియున్= ఇంకా ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ప్రాణాపానాది పంచవాయువులు, మనస్సు, బుద్ధి - అనే ఏడూ వైశ్వానరుడికి జిహ్వాలు. అందుకే అగ్నిదేవుడిని సప్తజిహ్వుడంటారు. వైశ్వానరుడు - అంటే ప్రాణుల దేహాలలో అన్ని రూపాలలో వెలుగుతున్న ఆత్మతత్త్వమే. ఇక శరీరంలోపల రెండు విధాలుగా 'హోమ' విధి జరుగుతుంది. దానిని

వివరిస్తాను. మొదటిది సప్తహోతృవిధి. వాసన చూడదగినది, తినదగినది, చూడదగినది, తాకదగినది, వినదగినది, ఆలోచింప దగినది, తెలిసికొనదగినది - అనే ఈ ఏడు సమిధలను వాసన చూచేవాడు, తినేవాడు, చూచేవాడు, తాకేవాడు, వినేవాడు, ఆలోచించేవాడు, తెలిసికొనేవాడు అనే ఏడుగురు ఋత్విక్కులు వైశ్వానరాగ్నిలో హోమం చేస్తారు. ఇదే సప్తహోతృ విధానం. ఇక రెండవది దశహోతృవిధానం; ఇక్కడ వైశ్వానరుడి ముఖాలు పది ఉంటాయి. దిక్కు, వాయువు, సూర్యుడు, చంద్రుడు, భూమి, అగ్ని, ఇంద్రుడు, విష్ణువు, ప్రజాపతి, మిత్రుడు - అనబడేవి ఆ ముఖాలు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు, మాటాడదగిన, చేయదగిన, పోదగిన, విసర్జించదగిన, ఆనందించదగిన - అనే ఈ పదీ హోమద్రవ్యాలు. ఈ పదింటినీ చెవి, చర్మం, కళ్ళు, నోరు, ముక్కు (జ్ఞానేంద్రియాలు), నాలుక, చేతులు, కాళ్ళు, గుదం, జననేంద్రియం (కర్మేంద్రియాలు) అనే ఈ పది ఇంద్రియాలు హోమం చేస్తాయి. ఇది దశహోతృవిధానం. ఈ రెండు పద్ధతులను గుర్తించి ఎంత ప్రయత్నించి అయినా జీవాత్మను ఉపద్రష్టగా ఉంచుకొని ఈ అంతర్యాగాన్ని జరిపే యోగిజనులు జననమరణభ్రమణం నుండి విముక్తు లవుతారు. అట్లా కాకుండా సాధారణంగా జరిపే బాహ్యయజ్ఞాన్ని జరిపేవారు జననమరణ చక్రభ్రమణంలో తిరుగుతూ ఉంటారు.

విశేషం : చేసే ప్రతిపనీ 'యాగమే'. ఆత్మ సాక్షీభూతుడైన 'ఉపద్రష్ట'. అందుచేత అతడికి ఏ కర్మఫలమూ అంటదు. కానీ, అన్నీ అతడే చేయిస్తాడు. ఇంద్రియాలు తాము చేస్తున్న పనిని 'బ్రహ్మకర్మ'గా భావించి చేస్తే అది అంతర్యాగం. బంధమోక్షణహేతువు. కేవలం పనిగా చేస్తే అది బంధహేతువు. ఇక వైశ్వానరుడనే అగ్నిని గురించి కొంత వివరించాలి. ఈ అంతర్యాగం చేయటానికి ఆత్మ 'చైతన్య' రూపంలో 'అగ్ని'గా నిరంతరం పనిచేస్తూ ఉంటుంది.

"అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః,
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్" అని గీత.

(ప్రాణుల దేహాలను ఆశ్రయించి నేను వైశ్వానరుడనే అగ్నిరూపంగా ప్రాణాపానాలతో కూడినవాడనై భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలనబడే నాలుగు విధాలైన ఆహారాలనూ పచనం చేస్తున్నాను).

క. విను ప్రణవాదికరూప।
త్వనిరూఢిం బుట్టు వాక్కు దాని వెను చనున్
మనము పురుషార్థబుద్ధిన్।
బనుపడి' యని చెప్పె సతికి బ్రాహ్మణుఁ డనఘా! 13

ప్రతిపదార్థం: విను= ఓ వనితా జాగ్రత్తగా వినుము; ప్రణవ+ఆదిక+రూపత్వ నిరూఢిన్= ఓం కారం మొదలైన మంత్ర రూపంగా; వాక్కు; పుట్టున్= పుట్టుతుంది; దానిన్= దానిని వెంబడించి; పురుషార్థబుద్ధిన్= పురుషార్థ సాధనకొరకని; పనుపడి= పూనికతో; మనము= మనస్సు; వెనుచనున్= వెనకనే వెళ్ళుతుంది; అని; అనఘా!= ఓ అర్జునా!; బ్రాహ్మణుండు= ఆ విప్రుడు; సతికిన్+చెప్పెన్= భార్యకు చెప్పాడు.

తాత్పర్యం: 'ఓంకారం' ఇత్యాదిగా ఉన్న మంత్రరూపంగా వాక్కు పుట్టుతుంది. దానిని అనుసరించి పురుషార్థసాధన నిమిత్తంగా మనస్సు పరుగిడుతుంది' అని ఆ విప్రుడు భార్యతో ఇట్లా చెప్పాడు.

క. విని యా విప్రునితో ని।
ట్లను నయ్యెలనాగ 'మన మనఘ! ప్రేరేపం
గ నెగయు వాక్కు తదనువ।
ర్తనము మనంబునకు నెవ్విధంబునఁ గలుగున్?' 14

ప్రతిపదార్థం: విని= భర్తమాటలు విని, ఆ విప్రునితోన్= ఆ బ్రాహ్మణుడితో; ఆ+ ఎలనాగ= ఆ స్త్రీ; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది; అనఘ!= పుణ్యాత్మా!; మనము= మనస్సు; ప్రేరేపంగన్= ప్రేరేపించగా; వాక్కు+ఎగయున్= వాక్కు పుట్టుతుంది (కదా!) అట్లాంటప్పుడు); తద్+అనువర్తనము= దానిని అనుసరించి ప్రవర్తించటం; మనంబు నకున్= మనస్సునకు; ఏ విధంబునన్+ కలుగున్?=ఏ విధంగా కలుగుతుంది?

తాత్పర్యం: ఆ మాటలు విని భర్తతో ఆ స్త్రీ ఇట్లా అన్నది. 'పుణ్యాత్మా! మనస్సు ప్రేరేపిస్తే కదా వాక్కు పుట్టుతుంది. అట్లాంటప్పుడు వాక్కును అనుసరించి మనస్సు ప్రవర్తించటం ఎట్లా సాధ్యం?'

విశేషం: ఇక్కడ బ్రాహ్మణవనిత అడుగుతున్న ప్రశ్న వేదమూలాన్ని కలిగిన జిజ్ఞాస. 'దేవీం వాచమజనయంత దేవాః' (దేవతలు దేవీవాక్కును సృష్టించారు) అని వేదమంత్రం (దేవం మనః - దేవత మనస్స్వరూపుడు).

'వాజ్ మే మనసి ప్రతిష్ఠితా । మనో మే వాచి ప్రతిష్ఠితం' అని ఐతరేయ శాంతిపాఠం. వాక్కు మనస్సులో, మనస్సు వాక్కులో అవిభక్తంగా ఉన్నాయి. మరి ఈ రెండూ ఒకదానినుండి మరొకటి పుట్టటం, ఒకటి మరొకదానిని అనుసరించటం - అనే అంశాలు బాహ్యంగా విరుద్ధంగా కనిపిస్తాయి. దానికి ఆ విప్రుడు సమాధానం చెప్పాడు.

వ. అనవుడు నతండు 15

తాత్పర్యం: అని చెప్పగా ఆ బ్రాహ్మణుడు (తరవాతి పద్యంతో అన్వయం.)

చ. 'మనసు నుదానవాయువును మానిని! కూడి వెలార్చు వాక్కు నా
త్మునివలనన్ భవద్వచనమున్ జనతానుభవంబు చొప్ప యై
నను విను కార్యముం గుఱిచినం దగ వాగనువర్తనంబు సే
యన వలసెన్ మనంబునకు నమ్మెయి గల్గుట నట్లు సెప్పితిన్. 16

ప్రతిపదార్థం: మానిని!= ఓ వనితా!; మనసు; ఆత్మునివలనన్= ఆత్మ ప్రేరణతో; ఉదాన వాయువునున్+కూడి= కంఠస్థానంలో ఉండే ఉదాన వాయువును కలిసికొని; వాక్కున్+వెలార్చున్= వాక్కును బహిర్గతం చేస్తుంది; భవత్+వచనమున్= నీవు అన్నమాట కూడా; జనతా= అనుభవంబు+

చొప్పు+అ= జనులందరి అనుభవం ప్రకారంగానే ఉన్నది (అందరూ ఇట్లాగే భావిస్తారు); ఐననున్= ఐనా కూడా; విను(ము)= ఒక వైశిష్ట్యం ఉన్నది వినుము; కార్యమున్+గుఱిచినన్= ఒక కార్యాన్ని గురించి ప్రవర్తించవలసివచ్చినప్పుడు; మనంబునకున్= మనస్సునకు; తగన్= తగినట్టుగా; వాక్+అనువర్తనంబున్= వాక్కును అనుసరించటం; చేయన్+అ+వలసెన్= చేయవలసి వచ్చింది (వస్తున్నది); ఆ+మెయిన్+కల్గుటన్= అట్లా ఉండటంవలన; అట్లు+చెప్పితిన్= అట్లా చెప్పాను.

తాత్పర్యం: ఓ వనితా! ఆత్మప్రేరణతో మనస్సు ఉదానవాయువును కూడుకొని వాక్కును బహిర్గతం చేస్తుందని నీవు అన్నట్లే ప్రజలందరూ భావిస్తారు. అందులో దోషమేమీ లేదు. కాని ఒక ప్రత్యేకవ్యాపారం ఉన్నది వినుము. ఒక కార్యాన్ని గురించి ప్రవర్తించవలసి వచ్చినప్పుడు మాత్రం మనస్సు వాక్కుకు అనుగుణంగానే ప్రవర్తిస్తుంది. అందుచేత అట్లా చెప్పాను.

వ. అని పలికి మఱియు నమ్మహీసురోత్తముం డిట్లనియె. 17

ప్రతిపదార్థం: అని పలికి; మఱియున్; ఆ+మహీసుర+ఉత్తముండు= ఆ బ్రాహ్మణో త్తముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి ఆ బ్రాహ్మణోత్తముడు ఇంకా ఇట్లా అన్నాడు.

క. మనసును వాక్కును మాలో।
ననఘచరిత! యెక్కు డెవ్వ? రని యంభోజా
సను నడిగిన నతం డెక్కుడు।
మన మనవుడు వాని యక్కమలభవుతోడన్. 18

ప్రతిపదార్థం: మనసునున్= మనస్సూ; వాక్కునున్= వాక్కూ; అనఘచరిత!= ఓ పుణ్య చరిత్రుడా! (చెప్పుమని); మాలోనన్= మా ఇద్దరిలో; ఎక్కుడు+ఎవ్వరు= ఎవరు అధికం (గొప్ప); అని; అంభోజాసనున్= కమలాసనుడైన బ్రహ్మదేవుడిని; అడిగినన్= అడుగగా; అతఁడు= ఆ బ్రహ్మదేవుడు; మనము= మనస్సు;

ఎక్కుడు= గొప్ప; అనవుడున్= అని చెప్పగా; వాణి= సరస్వతి; ఆ+ కమలభవుతోడన్= ఆ కమలగర్భుడైన బ్రహ్మతో

తాత్పర్యం: ఒకప్పుడు మనస్సు, వాక్కు బ్రహ్మదేవుడివద్దకు వెళ్ళి 'స్వామీ! మా ఇద్దరిలో ఎవరు గొప్ప? తేల్చి చెప్పండి' అని అడుగగా ఆయన 'మనస్సే గొప్పది' అని చెప్పాడు. అప్పుడు సరస్వతి ఆయనతో (తరవాతి వచనంతో అన్వయం)

వ. 'ఏను నీకుం గామదోహిని నయి యుండ న న్నెట్లు తక్కువగాఁ బలికి?' తనిన నతండు 'స్థావరంబును జంగమంబును నన నాకు రెండు మనస్సులు గల వందు స్థావరంబు నాయొద్దను జంగమంబు నీకడను నిలుచు; భవద్గోచరత్వంబునం బరఁగు వర్ణంబు మంత్రంబు స్వరంబు జంగను మనస్సుగా నెగడు; దానికంటె నీ వెక్కుడు నీకంటె నెక్కుడు స్థావరమనస్సు గావున నిమ్మాట యాడంగలదానవు గా' వని నిర్దేశించె. 19

ప్రతిపదార్థం: ఏను= నేను; నీకున్; కామదోహినిన్+అయి= కోరిన కోర్కెలను పిదికేదిగా; ఉండన్= ఉండగా; నన్నున్+ఎట్లు= నన్ను ఎట్లా; తక్కువగాన్= తక్కువచేసి; పలికితి(వి)?= పలికావు?; అనినన్= అని సరస్వతి అడుగగా; అతండు= ఆ బ్రహ్మదేవుడు; నాకున్= నాకు; స్థావరంబును= స్థిరమైనదీ; జంగమంబును= కదిలేదీ; అనన్= అని పేర్లుగల; రెండు మనస్సులు+కలవు= రెండు మనస్సు లున్నాయి; అందున్= ఆ రెండింటిలో; స్థావరంబు= కదలనిది; నా+ఒద్దను= నా వద్దా; జంగమంబు= కదిలేది; నీ కడను= నీ వద్దా; నిల్చున్= ఉంటాయి; భవత్+గోచరత్వంబునన్= నీకు తెలిసి; పరఁగు= ఉచ్చరింప బడేటటువంటి; వర్ణంబు= వర్ణాలు; మంత్రంబు= మంత్రాలు; స్వరంబు= ఉదాత్తాది స్వరాలు; జంగమ మనస్సుగాన్= జంగమ మనస్సుగా; నెగడున్= ఉంటుంది; దానికంటెన్= ఆ జంగమమనస్సుకన్నా; నీవు+ఎక్కుడు= నీవు గొప్ప; నీకంటెన్; స్థావర మనస్సు= స్థిరమైన మనస్సు; ఎక్కుడు= అధికం; కావున= అందుచేత; ఈ+మాట= ఈ పలుకు; ఆడన్+కలదానవు+కావు=

పలకటానికి తగినదానవు కావు (ఈ మాట అనరాదు); అని; నిర్దేశించెన్= ఉపదేశించాడు.

తాత్పర్యం: 'నేను నీకు అన్ని కోరికలను వర్షిస్తున్న దానిని కదా! నన్ను ఇట్లా తక్కువ చేసి మాటాడటం బాగున్నదా? అని సరస్వతి అడుగగా బ్రహ్మ ఇట్లా అన్నాడు. 'స్థిరమని, చరమని (కదిలేది) నాకు రెండు మనస్సులున్నాయి. వాటిలో స్థిరం నావద్దా, చరం నీవద్దా ఉంటాయి. నీ అనుగ్రహంతో పుట్టే వర్ణమంత్రస్వరాదు లన్నీ చరచిత్తంగా పర్యవసిస్తాయి. దానికన్నా నీవు గొప్పదానవు. నీకన్నా స్థిర చిత్తం గొప్పది. అందుచేత నీవు ఇట్లా మాటాడటం సమంజసంగా లేదు.' అని ఆయన ఉపదేశించాడు.

విశేషం : ఈ సందర్భంలో చెప్పబడ్డ స్థిర, చర చిత్త విషయం ఆధునిక మనస్తత్త్వశాస్త్రప్రకారంగా (విశ్వ, వైయక్తిక చైతన్యాలుగా) పరిగణించబడుతున్న చైతన్యభేదాలనే స్థిర, చర మనస్సులుగా భారతం ప్రతిపాదిస్తున్నది. విశ్వమనస్సు సర్వభావభాండాగారం. వర్ణమంత్రస్వరరూపమైన శబ్దం. దాని భావజగత్తు పరిమిత మైనది. అందుకే 'జంగమ' (కదిలేది) మని బ్రహ్మ చెప్పుతున్నాడు. దీనికి పరమైన వాగ్దేవి జంగమమనస్సుకంటె గొప్పది. కాని బ్రహ్మపదార్థం అపరిమితమైన విశ్వభావపర్యాప్తమైనది. అందుకే బ్రహ్మ ఇట్లా ఉపదేశించాడు.

క. విను మమ్మెయి నిర్దేశం।
బున నవ్వాగ్దేవి మూర్ఛవోయినయ ట్లే
మిని బలుక కుండి పదపడి।
వినయంబున నజుని శరణువేఁడె లతాంగీ!' 20

ప్రతిపదార్థం: లతాంగీ!= తీగవంటి దేహం కలిగిన ఓ వనితా!; వినుము; ఆ+మెయిన్= ఆ విధంగా (చేసిన); నిర్దేశంబునన్= ఉపదేశంతో; ఆ+వాగ్దేవి= ఆ సరస్వతి మూర్ఛ+ పోయిన+అట్లు= మూర్ఛపోయిన విధంగా; ఏమినిన్= ఏమీ; పలుక+ఉండి= మాటాడ కుండా ఉండిపోయిన; పదపడి= తరువాత;

వినయంబునన్= వినయంతో; అజునిన్= బ్రహ్మను; శరణువేఁడెన్= శరణు కోరింది.

తాత్పర్యం: ఓ వనితా! ఆ విధంగా బ్రహ్మ ఉపదేశం చేయటంతో సరస్వతి మూర్ఛపోయినట్లుగా ఏమీ పలకకుండా ఉండిపోయి. కొంచెం సేపటికి బ్రహ్మదేవుడిని శరణుకోరింది.'

వ. అనిన బ్రాహ్మణి పతితో 'బ్రహ్మమాటకుం గొలువోయిన వాణి యేమిటం దేఱె?' నని యడిగిన బ్రాహ్మణుం డిట్లనియె. 21

ప్రతిపదార్థం: అనినన్= అని బ్రాహ్మణుడు చెప్పగా; బ్రాహ్మణి= ఆ బ్రాహ్మణస్త్రీ; పతితోన్= తన భర్తతో; బ్రహ్మమాటకున్= బ్రహ్మమాటకు; కొలు+పోయిన= చిన్నబోయిన; వాణి= సరస్వతి; ఏమిటన్= దేనిచేత; తేఱెను?+అని= తేరుకుంది?అని; అడిగినన్= అడుగగా; బ్రాహ్మణుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని బ్రాహ్మణుడు చెప్పగా ఆయన భార్య 'బ్రహ్మ మాటలతో చిన్నబోయిన సరస్వతి ఎట్లా సర్దుకొంది' అని అడుగగా బ్రాహ్మణుడు ఇట్లా చెప్పాడు.

క. 'ప్రాణాపానంబుల యెడ।
వాణి నిలుచుఁ గాన ప్రాణవాయు వొదవి తత్
క్షీణత్వ ముడిపె నది గీ।
ర్వాణజ్యేష్ఠప్రభావవాసిత యగుటన్. 22

ప్రతిపదార్థం: ప్రాణ+అపానంబుల+ఎడన్= ప్రాణాపానాల నాశ్రయించి; వాణి= సరస్వతి; నిలుచున్+కానన్= నిలుస్తుంది (ఉంటుంది) కాబట్టి; ప్రాణవాయువు+ఒదవి= ప్రాణవాయువు ప్రసరించి; తద్+క్షీణత్వము= దానియొక్క నశించటాన్ని (లేదా సరస్వతి క్షీణించటాన్ని); అది= ఆ ప్రాణవాయువు గీర్వాణ జ్యేష్ఠ= సురజ్యేష్ఠుడైన బ్రహ్మ యొక్క; ప్రభావ

వాసిత+అగుటన్= ప్రభావంచేత మహనీయమైనది కావటంచేత (బ్రహ్మదేవుడు వాక్కును సృష్టించారు కాబట్టి, ఉడిపెన్= పోగొట్టింది)

తాత్పర్యం: 'వాణి ప్రాణాపానాలను ఆశ్రయించి పుట్టుతుంది కాబట్టి, వాణి క్షీణించగానే ఆమెలోని ప్రాణవాయువు గీర్వాణి' ప్రథముడైన బ్రహ్మయొక్క ప్రభావంవలన మహనీయమైనది కావటంచేత ఆ సరస్వతి పడుతున్న క్షోభను పోగొట్టగలిగింది.

వ. ఇట్టి వని వాఙ్మనఃప్రకారంబు లెఱుంగుట మోక్షంబునకు మూలం; బింకను వాణి మనస్సుల తెఱంగు సెప్పెద వినుము. 23

ప్రతిపదార్థం: వాక్+మనస్+ప్రకారంబులు= వాక్కుల, మనస్సుల పద్ధతులు; ఇట్టివి+అని= ఇట్లాంటివని; ఎఱుంగుట= తెలిసికొనటం; మోక్షంబునకున్+ మూలంబు= మోక్షానికి ఆధారం; ఇంకను= ఇంకా; వాణీ= వాక్కు; మనస్సుల= మనస్సులు ప్రవర్తించే; తెఱంగు= రీతిని; చెప్పెదన్= చెప్పుతాను; వినుము.

తాత్పర్యం: వాక్కు, మనస్సులు ప్రవర్తించే రీతులు ఇవని గుర్తించటం మోక్షానికి మూలమవుతుంది. ఇంకా ఈ రెండూ ఎట్లా ఉంటాయో చెప్పుతాను వినుము.

తే. ప్రాణుఁ బొదువుట వాణి యపానుఁ జెంది।
తాను దాన భూతాత్మ యై తనువు విడిచి
వ్యానచేష్టిత సర్వసంవ్యాప్తి నొంద।
మనసు సుస్థితి నొందు సమాను నందు. 24

ప్రతిపదార్థం: ప్రాణున్= ప్రాణం అనే వాయువును; పొదువుటన్= ఆక్రమించుకొనటంవలన; వాణి= వాక్కు; అపానున్+చెంది= అపానుడనే ప్రాణాన్ని చెంది; తాను+తాను+అ= తానే స్వయంగా (తనకు తానే); భూతాత్మ+ఐ= భూతరూపాన్ని పొంది= తనువు+విడిచి= దేహాన్ని వదలిపెట్టి; వ్యాన+చేష్టితన్= వ్యానుడి క్రియవలన; సర్వసంవ్యాప్తిన్+ఒందన్= దేహమంతటా వ్యాపించగా; మనసు ప్రశాంతమై సుస్థితి పొందుతుంది.

తాత్పర్యం: ప్రాణుని పొందటంవలన వాణి అపానుడిని కూడా చేరుతుంది. తనకు తానే తన రూపాన్ని (శబ్దరూపాన్ని) వదలిపెట్టి, భూతాలలో కలిసిపోయి, వ్యానుడి క్రియవలన దేహమంతటా వ్యాపిస్తుంది. సమానుడిలో ప్రవేశించినపుడు మనస్సు ప్రశాంతమై సుస్థితి పొందుతుంది.

వ. మనసు సుస్థితం బొందుట ముక్తికిం గారణ' మని చెప్పి వెండియు.25

ప్రతిపదార్థం: మనసు; సుస్థితిన్+పొందుట= ప్రశాంతత్వాన్ని పొందటం; ముక్తికిన్= ముక్తికి; కారణము+అని= కారణమని; చెప్పి; వెండియున్= మళ్ళీ,

తాత్పర్యం: మనసు ప్రశాంతతను పొందటమే ముక్తికి కారణ' మని చెప్పి మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'ఘోషిణి నాఁగ నఘోషిణి యన రెండు।
దెఱంగులు గలిగి వాగ్దేవి పరఁగు
నం దఘోషిణి గరీయసి యుత్తమరసంబు।
గోవు చందంబునఁ గురియుచుండు
నవ్యయరూప దివ్యప్రభావోజ్జ్వల।
బ్రహ్మవాదిని యిట్లు బ్రాహ్మివిధము
గనుట మహానందకర' మని చెప్పి య।
వ్విప్రుండు మఱియు నవ్వెలఁదితోడ

తే. 'వినుము ప్రాణాదికము లైదు మనసు బుద్ధి।
యొక యధిష్ఠానమున నుండియును నెఱుంగ
వబల! యొండొంటి విషయంబు నలమికొనఁగ'।
ననిన 'వివరింపు మా తెఱం' గనియె నింతి 26

ప్రతిపదార్థం: ఘోషిణి+నాఁగన్= ఘోషిణి అని; అఘోషిణి అనన్= అఘోషిణి అని; రెండు తెఱఁగులు= రెండు విధాలు; కలిగి; వాగ్దేవి+ఎసఁగున్= వాగ్దేవి ప్రకాశిస్తుంది; అందున్= వాటిలో; అఘోషిణి; గరీయసి= గొప్పది; ఉత్తమ

రసంబున్= అత్యుత్తమ రసాన్ని; గోవు చందంబునన్= గోవువలె; కురియుచున్+ఉండున్= కురుస్తూ ఉంటుంది; అవ్యయ+రూప= ఆమె నశించనటువంటి రూపం కలిగినది; దివ్యప్రభావ+ఉజ్జ్వల= మహనీయశక్తితో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్నది; బ్రహ్మవాదిని= బ్రహ్మపదానికి వాచకం; ఇట్లు= ఈ విధంగా; బ్రాహ్మి విధమున్+కనుట= సరస్వతీతత్త్వాన్ని తెలిసికొనటం; మహానందకరము= మహానందాన్ని ప్రసాదిస్తుంది; అని; చెప్పి; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; మఱియున్= ఇంకా; ఆ+వెలఁదితోడన్= ఆ స్త్రీతో; వినుము; ఘ్రాణ+ ఆదికములు= ముక్కు మొదలైన; ఐదున్= ఐదు ఇంద్రియాలు; మనసు; బుద్ధి (ఈ ఏడూ); ఒక= ఒకే; అధిష్ఠానమునన్= ఆధారంలో; ఉండియునున్= ఉన్నా కూడా; అబల!= ఓ వనితా!; ఒండొంటి విషయంబున్= ఒకటి మరొక విషయాన్నిగురించి; అలమికొనఁగన్= వ్యాపించటానికి; ఎఱుంగవు= సమర్థాలు కావు; అనినన్= అనగా ఇంతి= ఆ స్త్రీ; ఆ తెఱంగు= ఆ విధం; వివరింపుము+అనియెన్= వివరంగా చెప్పుము అని కోరింది.

తాత్పర్యం: 'వాక్కు ఘోషిణి (శబ్దించేది), అఘోషిణి (శబ్దించనిది) అని రెండు విధాలుగా ఉంటుంది. అందు అఘోషిణి గొప్పది. తనంతట తాను వర్షించే గోవువలె అది అమృతాన్ని (ఉత్తమరసమంటే అదే) వర్షిస్తుంది. ఆ వాక్కు అవ్యయరూపమైనది. మహనీయశక్తితో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తుంది. అది బ్రహ్మపదానికి వాచకం. ఇది బ్రాహ్మీతత్త్వం. దీనిని తెలిసికొంటే మహానందం సిద్ధిస్తుంది' అని చెప్పి, ఆ బ్రాహ్మణుడు అతడి భార్యతో ఇట్లా చెప్పాడు 'ముక్కు మొదలైన కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి అనే ఈ ఏడూ ఒకే జీవుడిని ఆశ్రయించి ఉన్నా ఒకదాని పనిని మరొకటి చేయటానికి సమర్థం కావు' అని భర్త చెప్పగా ఆ వనిత 'అది ఎట్లాగో వివరంగా చెప్పండి' అని అడిగింది.

విశేషం : వైదికవాఙ్మయంలో శబ్దించే వాక్కును 'వైఖరి' అని, శబ్దించని వాక్కును పరా, పశ్యంతి, మధ్యమ అని వేరు చేసి చెప్పటం జరిగింది. మనుష్యులు మాటాడేది

'వైఖరి' అని; తక్కిన 'అఘోషిణి' వాక్కు 'గుహ'లో దాగి ఉంటుందని; దానిని ధీమంతులు మాత్రమే గుర్తించగలరని చెప్పారు.

"చత్వారి వాక్ పరిమితా పదాని । తాని విదుర్బ్రహ్మణో యే మనీషిణః
త్రీణి గుహా నిహితానేఙ్గయంతి । తురీయో వాచో మనుష్యా వదంతి"

ఇక 'అఘోషిణి' ఎట్లాంటిదో, అది 'గోవు' రూపం కలిగినది అంటే ఏమిటో కూడా చాలా ప్రధానమైనది. 'బ్రాహ్మీ తు భారతీ భాషా గీర్వాగ్వాణీ సరస్వతీ' అని ఏడు పేర్లు (సరస్వతి, వాణి, వాక్కు, గీః, భాషా, భారతీ, బ్రాహ్మీ)- వాక్కుకు పర్యాయపదాలున్నాయి. వీరు సప్తమాతృకాస్వరూపలు. బ్రహ్మతత్త్వం ఏ వాక్కుచేత వ్యక్తీకరించబడుతుందో ఆ అవ్యక్త - అమృత నిష్యంది-వాక్కు పరా వాక్కు అనబడింది. అదే 'బ్రాహ్మీ'. స్వతంత్రమైనదీ, అతర్క్యమైనదీ అయిన సృజనాత్మకప్రతిభ దాని లక్షణం. అందుకే అది తన అంతస్తత్త్వాన్ని తనకు తానుగా మనీషులకు వ్యక్తం చేస్తుందని వేదం ప్రతిపాదించింది (జాయేవ పత్య ఉశసీ సువాసాః అని వైదికోపమానం - ధర్మపత్ని తన స్వస్వరూపాన్ని భర్తకు మాత్రమే చూపించినట్లు అని అర్థం.)

మునుపు 20వ పద్యంలో నేను నీకు 'కామదోహిని' గా ఉన్నాను కదా! అనే మాటకు అర్థమే 'అమృతాన్ని గోవు రూపంగా వర్షిస్తుంది' అని ఇక్కడ చెప్పుతున్నది కూడా. కామధేను వని, కల్పవృక్షమని, నందిని అనే పేర్లతో ఏయే వర్ణనలు కావ్యాలలో కనిపిస్తాయో అవన్నీ దివ్యవరప్రభావసమర్థాలైనవే. దివ్యవాక్కును అనుసరించి అర్థం ప్రవర్తిస్తుంది కాబట్టి (ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోఽను ధావతి - అని భవభూతి) తన ఉత్తరరామచరిత్ర నాటకంలో) పరావాక్కు అమృతరసనిష్యందిని.

కవులనే బాలకులకు సరస్వతీమాత అనే గోవు తన క్షీరాన్ని స్వయంగా కురిపించి, వారికి తన రసస్వరూపాన్ని ప్రసాదించి వారిని బలోపేతులుగా చేస్తుందని అభినవగుప్త పాదాచార్యులు 'లోచన' వ్యాఖ్యానంలో అంటారు.

శ్రీ శంకరులు కూడా 'తవ స్తవ్యం మన్యే' అనే సౌందర్యలహరి శ్లోకంలో 'నీ స్తన్యం త్రాగటంవలననే కదా ద్రావిడశిశువైన నేను సంస్కృతంలో ఇంత గొప్ప కవిని అయ్యాను!' అని ఆ మహామాతృస్వరూపిణిని వర్ణించారు. 'సంగీతసాహిత్యాలు సరస్వతీ స్తనరూపాలని వర్ణించటంలోనూ ఈ రహస్యమే ఉన్నది. కనుక వాణి ఉపాసనీయురాలైన దేవతగా పురాణాలలో చెప్పబడినది.'

వ. అనుటయు నయ్యవనీదేవుం డయ్యువిద కిట్లనియె **27**

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; ఆ+అవనీదేవుండు= ఆ బ్రాహ్మణుడు; ఆ+ఉవిదకున్= ఆ స్త్రీతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని ఆమె అడుగగా ఆ భూసురుడు ఆ స్త్రీతో ఇట్లా అన్నాడు.

సీ. 'గంధంబు ఘ్రాణంబ కాని తక్కిన యాఱు।
నధిగమింపఁగ నోప, వధిగమించు
రసము జిహ్వయ యితరము లాపనికిఁ గావు;।
రూపంబుఁ జక్షుస్స యోపు నెఱుఁగఁ
బెఱయని యెఱుఁగవు తెఱవ! సంస్పర్శంబుఁ।
గాంచుఁ జర్మంబ తక్కటివి గానఁ
జాలవు; శబ్దంబుఁ జాలుఁ బట్టంగ శ్రో।
త్రంబ; యన్యములు దత్కరణమునకు

తే. వెరవులేవు; సంశయిత సంవేదనంబు।
మనసు కృత్యంబ యిక్కార్యమునకు నొండ్లు
సొరవు; నిష్ఠ బుద్ధిన యగుఁ జొరఁగ నేర;।
విత్తెఱంగున కపరంబు లెఱిఁగి కొనుము. **28**

ప్రతిపదార్థం: తెఱవ!= ఓ వనితా!; గంధంబున్= గంధాన్ని గుర్తించటానికి; ఘ్రాణంబు+ అ= ముక్కు మాత్రమే; కాని; తక్కిన+ఆఱున్= ముందు చెప్పిన

ఆరూ; అధిగమింపఁగన్+ఓపవు= ఆక్రమించటానికి సమర్థాలు కావు; రసమున్= రసాన్ని (రుచిని); జిహ్వ+అ= నాలుకే; అధిగమించున్= గుర్తిస్తుంది; ఇతరములు= ఇతరాలు; ఆ పనికిన్+కావు= ఆ పనిచేయజాలవు; రూపంబున్= రూపాన్ని; చక్షుస్సు+అ= కళ్ళు మాత్రమే; ఎఱుఁగన్+ ఓపున్= గుర్తించగలుగుతాయి; పెఱ+అవి= తక్కిన అవయవాలు; ఎఱుఁగవు= గుర్తింప జాలవు; సంస్పర్శంబున్= స్పర్శలక్షణాన్ని; చర్మంబు+అ= చర్మం మాత్రమే; కాంచున్= కలిగి ఉంటుంది; తక్కటివి= తక్కిన అవయవాలు; కానన్+చాలవు= ఆ లక్షణాన్ని పొందలేవు; శబ్దంబున్= శబ్దాన్ని; శ్రోత్రంబు+అ= చెవి మాత్రమే; పట్టంగన్+ చాలున్= వినగలుగుతుంది; అన్యములు= తక్కినవి; తద్+కరణమునకున్= ఆ పనిచేయటానికి; వెరవు లేవు= సమర్థాలు కావు (వెరవు= ఉపాయం, శక్తి); సంశయిత= సంశయించటం; సంవేదనంబు= తెలిసికొనటం; మనసు= మనస్సుయొక్క; కృత్యంబు+ అ= పని మాత్రమే; ఈ+కార్యమునకున్= ఈ పనికి; ఒండ్లు= తక్కినవి; చొరవు= ప్రవేశింపవు; నిష్ఠ= శ్రద్ధతో కార్యనిర్వహణం చేయగల సంస్కారం; బుద్ధిన్+ఆ+అగున్= బుద్ధివలననే అవుతుంది; ఈ+తెఱంగునకున్× ఈ పనికి; అవసరంబులు= తక్కినవి; చొరఁగన్+నేరవు= ప్రవేశింపజాలవు; ఎఱిఁగికొనుము= తెలిసికొనుము.

తాత్పర్యం: వాసన పట్టటం ముక్కు మాత్రమే చేస్తుంది. రుచిని నాలుక మాత్రమే గ్రహిస్తుంది. రూపాన్ని కళ్ళు మాత్రమే చూస్తాయి. స్పర్శను చర్మం మాత్రమే గుర్తిస్తుంది. శబ్దాన్ని చెవి మాత్రమే వింటుంది. తక్కిన అవయవాలు కూడా వాటి వాటి పనులు తప్ప వేరే వాటిని చేయజాలవు. సంశయించటం, తెలిసికొనటం మనస్సు పనులు. బుద్ధిలో మాత్రమే నిష్ఠ ఉంటుంది. గుర్తించుము.

విశేషం : కర్మేంద్రియాలకంటె జ్ఞానేంద్రియాలు, వాటికంటె మనస్సు, అన్నిటికంటె బుద్ధి - వీటి కంటె ఆత్మ ఎట్లా ఉన్నత స్థాయిని కలిగినవో అర్థం చేసికొనటంద్వార బ్రహ్మతత్త్వాన్ని సులభంగా వ్యాఖ్యానించవచ్చును. అందుకే సర్వశాస్త్రవిదుడైన ఆ విప్రుడు ఇంద్రియాదుల పరిమితవ్యాపారనిరూపణం చేస్తున్నాడు. ఈ ఇంద్రియాలలో వాగింద్రియం (నాలుక) వాక్ వ్యాపారం (శబ్దించటం) మనిషిని

జ్ఞానిగా మార్చగలిగిన ఉత్తమసాధనాలు కాబట్టి వాణీతత్త్వాన్ని గురించి ముందు ఉపన్యసించాడు. వాక్కు - మనస్సు 'తగాదా'ను బ్రహ్మ పరిష్కరించాడు. తక్కిన ఇంద్రియాలు కూడా 'మనస్సు'తో ఎట్లా వివాదపడుతుంటాయో తరువాత వివరిస్తున్నాడు.

ఇంద్రియ మనఃపరస్పరసంవాదప్రకారము (సం. 14-22-13)

వ. 'అని చెప్పి, మనస్సునకు నింద్రియంబులకుం దొల్లి గలిగిన సంవాదంబు సెప్పెద నాకర్ణింపు 'మింద్రియంబులు మనస్సుతో నేము నీవు నొక్కరూప' యనుటయు మనస్సు వాని కిట్లనియె. 29

ప్రతిపదార్థం: అని చెప్పి= అని ఇంద్రియాల పరిమితవ్యాపారపరత్వాన్ని వివరించినవాడై ఆ వనితతో; మనస్సునకున్= మనస్సునకూ; ఇంద్రియంబులకున్= ఇంద్రియాలకు; తొల్లి= మునుపు; కలిగిన= జరిగిన; సంవాదంబు= సంభాషణ (ఇక్కడ తగాదా); చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము (అంటూ ఇట్లా చెప్పాడు); ఇంద్రియంబులు= ఇంద్రియాలు; మనస్సుతోన్; ఏమున్= మేమూ; నీవు; ఒక్కరూపు+అ= ఒకే విధమైన వాళ్ళమే; అనుటయున్= అనగా; మనస్సు; వానికిన్= ఇంద్రియాలతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని చెప్పి, ఆ విప్రుడు తన భార్యతో 'ఒకప్పుడు మనస్సుకు, ఇంద్రియాలకు పెద్ద వాగ్వాదం జరిగింది. ఆ విషయం చెప్పుతాను వినుము. అంటూ ఇట్లా మొదలు పెట్టాడు. 'మనస్సుతో ఇంద్రియాలు అన్నాయి - మేము నీవు ఒకే తీరువాళ్ళమే కదా!' అని. అపుడు మనస్సు ఇట్లా అన్నది.

విశేషం : ఇవి సాంకేతికమైన కథలు, వీటిద్వారా తత్త్వాన్ని సులభంగా బోధించటం వ్యాసమహర్షి ఆశయం.

చ. 'చన దిటులంట గం పెఱుఁగఁ జాలదు నాసిక, జిహ్వయుం జవుల్
గొన వెర వేదు, రూపు గనుఁగొంటకుఁ గన్ను వలంతిగాదు, సోఁ

కు నెఱుఁగు శక్తి చర్మమునకుం బ్రభవింపదు, శబ్దజాతము
న్వినఁ జెవి కల్ప మేనియును నేర్పొడఁగూడదు నేఁ దొఱంగినన్. 30

ప్రతిపదార్థం: ఇటులు+అంట= ఇట్లా అనటం; చనదు= తగదు; నేన్+ తొఱంగినన్= నేను వదలిపెడితే (నన్ను నేను ఉపసంహరించుకొంటే); నాసిక= ముక్కు; కంపు+ఎఱుఁగన్+చాలదు= వాసన పట్టజాలదు; జిహ్వయున్= నాలుక; చవుల్+కొనన్+వెరవు+ఏదున్= రుచిపట్టే శక్తిని కోల్పోతుంది; రూపున్+కనుఁగొంటకున్= రూపాన్ని చూడటానికి; కన్ను+వలంతి+కాదు= కన్ను సమర్థం కాదు; సోఁకు= తాకును; ఎఱుఁగు శక్తి= తెలిసికొనే శక్తి; చర్మమునకున్+ప్రభవింపదు= చర్మానికి పుట్టదు; శబ్దజాతమున్= శబ్దజాలాన్ని; వినన్= వినటానికి; చెవి; కల్పము+ఏనియునున్= కల్పకాలం కాచుకొన్నా; నేర్పు+ఒడన్+కూడదు= శక్తిని సంపాదించుకొనజాలదు.

తాత్పర్యం: 'ఇట్లా అనటం సమంజసం కాదు. నేను లేకపోతే ముక్కు వాసన పట్టదు. నాలుక రుచులు లెక్కింపజాలదు. కన్ను దేనినీ చూడజాలదు. చర్మం గుర్తించదు. ఎన్ని ఏళ్ళు గడిచినా శబ్దాన్ని వినే శక్తి చెవికి ఉండదు.

విశేషం : అందుకే ముందటి పద్యంలో సంవేదనంబు (తెలిసికొనటం) మనస్సు చేసే పనిగా చెప్పాడు. చెవి ఇత్యాదులు చేస్తున్న పనులను మనసు సహాయంతోనే ఇంద్రియాలు చేస్తున్నాయి. లేకపోతే వాటి కా శక్తిలేదు.

వ. నిజంబుగా నేను దొఱంగితి నేని. 31

ప్రతిపదార్థం: నిజంబుగాన్= నిజానికి; నేను+తొఱంగితిన్+ఏనిన్= నేను నన్ను ఉపసంహరించు కొంటే.

తాత్పర్యం: నిజంగా నేను పక్కకు వెళ్ళితే - పనిచేయటం మానేస్తే. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. అప్రయోజనంబులై యుండు నాటిన।
నిప్పులట్లు శూన్యనిలయములును

బోలె మీ స్వరూపములు గాన మనలోన।
నెక్కుడేన సూవె యింత నిజము.' **32**

ప్రతిపదార్థం: ఆఱిన నిప్పులు+అట్లు= ఆరిపోయిన నిప్పులవలె; శూన్యనిలయములు నున్+ పోలెన్= ఎవరూ లేని ఇళ్ళవలె; మీ స్వరూపములు= మీ మీ రూపాలు; అప్రయోజనంబులు+ఐ+ ఉండున్= ఏ ప్రయోజనమూ లేనివిగా ఉంటాయి; కానన్= కాబట్టి; మనలోనన్= మనందరిలో; ఏను+అ= నేనే; ఎక్కుడు= అధికుడిని; చూవె!= సుమా!; ఇంత= నేను చెప్పినదెల్ల, నిజము= సత్యం.

తాత్పర్యం: నేను లేని పక్షంలో మీ మీ రూపాలు ఆరిపోయిన నిప్పువలె, శూన్యగృహాలవలె ఏ ప్రయోజనమూ లేనివిగా పడి ఉంటాయి. అందుచేత మన అందరిలో నేనే గొప్పదానను. ఇది మాత్రం సత్యం."

వ. అనిన విని యింద్రియంబులు మనంబున కిట్లనియె. **33**

తాత్పర్యం: అనగా విని ఇంద్రియాలు మనస్సుతో ఇట్లా అన్నాయి.

విశేషం : మనసు అనుభవాలను కలిగిస్తున్నదన్నమాట నిజమే. కాని ఇంద్రియాలు అనుభవ ద్వారాలు. అవి లేకుండా మనసు మాత్రం ఏమి చేస్తుంది! అందుకే ఇంద్రియాలు ఇట్లా అన్నాయి.

సీ. 'ఇంతవ ట్టిట్టిద యిట్లైన యంతన।
కలుగనేర్చునె యధికత్వ మేము
వెలిగాఁగ? నీ వొక విషయంబు నేనియు।
ననుభవించితయేని నధిక మగుట
గానంగ వచ్చు? మాలో నొకం డడఁగిన।
ననుభవింపుము తదీయార్థ; మట్లుఁ
గాక ఘ్రాణంబున గంధంబ జిహ్వ ర।
సంబ చక్షువున రూపంబ వినుము

ఆ. చర్మశక్తిఁ జేసి సంస్పర్శ విషయంబ।
శ్రోత్రయుక్తి శబ్దమాతృకంబ
కానియొంట నొంటిఁ గబళింపఁ జాల వె।
ట్లధికతా నిరూఢి కాసవడితి? **34**

ప్రతిపదార్థం: ఇంత+పట్టు+ఇట్టిది+అ= ఇంతమాత్రం నిజమే; ఇట్లు+ఐన+ అంతన= ఇంత మాత్రాన; అధికత్వము= గొప్పతనం; కలుగన్+నేర్చునె?= ఏర్పడుతుందా!; ఏము+వెలికాఁగన్= మేము లేకుండా; ఈవు= నీవు; ఒక విషయంబును ఏనియున్= ఒక విషయాన్నైనా; అను భవించితి(ని)+అ+ఏనిన్= అనుభవించగలిగి ఉంటే; అధికము+ అగుటన్+గొప్పకావటాన్ని; కానంగన్+ వచ్చున్= చూడవచ్చును; మాలోన్= మాలో; ఒకండు= ఒకడు; అడఁగినన్= అణగి పోయినపుడు; తదీయ+అర్థము= అతడి కోరికను; అనుభవింపుము= అనుభవించుము (చూద్దాము); అట్లు+కాక= అట్లా కాకుండా; ఘ్రాణంబునన్= ముక్కుద్వారా; గంధంబు+అ= గంధమే; జిహ్వన్= నాలుకతో; రసంబు+అ= రసమే; చక్షువునన్= కంటితో; రూపంబు+అ= రూపమే; వినుము= ఇంకా వినుము; చర్మశక్తిన్+చేసి= చర్మశక్తివలన; సంస్పర్శ విషయంబు+అ= బాగా తాకటమే; శ్రోత్రయుక్తిన్= చెవితోకూడి; శబ్దమాతృకంబు+అ= శబ్దాన్ని మాత్రమే (వింటావు); కాని; ఒంటిన్= ఒకదానితో; ఒంటిన్= మరొకదానిని; కబళింపన్+చాలవు= ఆక్రమింపజాలవు; అధికతా నిరూఢికిన్= ఆధిక్యం పొందటానికి; ఎట్లు= ఏ విధంగా; ఆసపడితి(వి)?= ఎట్లా ఆశపడ్డావు?

తాత్పర్యం: 'నీవు చెప్పినది నిజమే! ఒప్పుకుందాము కాని ఇంత మాత్రాన నీకు గొప్పతనం ఏర్పడుతుందా? మేము లేకుండా నీవు ఒక విషయాన్ని అయినా అనుభవించగలిగి ఉంటే అప్పుడు నీ గొప్పతనాన్ని గుర్తించవచ్చును. మాలో ఒకడు లోపించినపుడు ఆ ఇంద్రియసుఖాన్ని నీవు అనుభవించుము (చూద్దాము). అట్లా నీవు చేయలేవు. ముక్కు ద్వారా గంధాన్ని మాత్రమే వాసన పట్టగలుగుతావు. నాలుకతో రసాన్నే చవిచూస్తావు. కంటితో రూపాన్ని మాత్రమే

చూడగలవు. చర్మంతో స్పర్శను, చెవితో శబ్దాన్ని చేయగలవు. ఒకదానితో మరొకదానిని కబళించేశక్తి నీకు లేదు కదా! అందుచేత నీ గొప్ప ఏమిటి? ఎందుకంత ఆశ?

క. మును మే మాలంబించిన।
వెనుకఁ గదా నీకు ననుభవింప వశం? బో
మనసా! నీ వెంగిలి కా।
దనుమా యవ్విషయ మెక్కుడయ్యెడు మనలోన్. 35

ప్రతిపదార్థం: ఓ మనసా!= మును= ముందుగా; మేము; ఆలంబించిన= పట్టుకొన్న (ఆక్రమించిన, అనుభవించిన); వెనుకన్= తరువాత; కదా; నీకున్+ అనుభవింపన్= నీకు అనుభవించటానికి (శక్యమౌతుంది); ఆ+విషయమున్= ఆ విషయాన్ని; నీవు+ఎంగిలి కాదు+అనుమా= నీవు ఎంగిలికాదని చెప్పుము; ఎక్కుడు= అధిక్యం; మనలోన్= మనలో; అయ్యెడున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: ఓ మనసా! ముందుగా మేము అనుభవించాక కదా విషయసుఖాన్ని నీవు అనుభవించటం! అందుచేత నీవు అనుభవిస్తున్నది ఎంగిలి మాత్రమే. అట్లా కాదని చెప్పుము చూద్దాము. అప్పుడు నీదే అధిక్యం.

విశేషం : మనసు ఇంద్రియాల ద్వారా అనుభవిస్తున్న సుఖదుఃఖస్పర్శ తొలుత ఇంద్రియాలకే కదా తగిలేది! తరువాతే మనసు అనుభవిస్తుంది. ఇది ఇంద్రియాలు చేస్తున్న వాదం.

క. నీ వడఁగినను బ్రాణముఁ।
గావఁగ మాయందు బోధకం బగు ద్రవ్యం
బావర్తింపఁగఁ జేయుట।
గావించును నీకుఁ దెలివు గనికొను మిదియున్. 36

ప్రతిపదార్థం: నీవు+అడఁగిననున్= నీవు నశించినా; ప్రాణమున్+కావఁగన్= ప్రాణాన్ని కాపాడటానికి; మా+అందున్= మాలో; బోధకంబు+అగు= జ్ఞానదాయకమైన; ద్రవ్యంబు= పదార్థం; నీకున్= నీకు; తెలివున్= జ్ఞానాన్ని; ఆవర్తింపఁగన్+చేయుటన్= మరల తిరిగివచ్చేటట్లు చేయటాన్ని; కావించును= చేస్తుంది; ఇదియున్= ఇదికూడా; కనికొనుము= తెలిసికొనుము.

తాత్పర్యం: నీవు ఇంకొకవిషయం తెలిసికొనుము. ఒక సమయంలో నీవు నశించినా మాలోని పదార్థమే మరలా నీలో జ్ఞానదాయకమైన శక్తిని మరలా కలిగించి నిన్ను బ్రతికిస్తుంది. (ప్రాణదాయకమైన చైతన్యశక్తి మాలోకూడా ఉన్నది. దీనిని మరచిపోవద్దు అని అర్థం).

సీ. అట్లు గా దిట్లని యనుశాసనము సేయఁ।
గడు నేర్చు శిష్యులకడకుఁ బోయి
వినిపింపఁ దొడఁగి యవ్వినుతార్థములు వార।
లుగ్గడింపఁగఁ గను నొజ్జవోలె
మముఁ గొని విషయోత్కరము నీవు భోగ్యంబు।
గాఁ జేసికొందు నీ కలలు గన్న
యప్పుడు మా లేమి నవ్విషయంబు బొం।
కైన వాకిలిలేని యాలయంబుఁ

ఆ. జెందిమరలినట్లు సేద్పాటు వొరయుదు।
గాక సత్యభుక్తి గలదె నీకు?
నింతపట్టు గాన్పు మేమును నీవును।
గలసి పరఁగ భోగకలన గలుగు.' 37

ప్రతిపదార్థం: అట్లు+కాదు= అట్లా కాదు; ఇట్లు+అని= ఇట్లా అని; అనుశాసనము+చేయన్= నిర్ణయం చేయటానికి; కడున్+నేర్చు = మిక్కిలి నేర్పరులైన; శిష్యులకడకున్+ పోయి= శిష్యులవద్దకు వెళ్ళి; వినిపింపన్+ తొడఁగి= ఉపదేశం ప్రారంభించి; ఆ+వినుత+ అర్థములు= ఆ గొప్ప విషయాలను; వారలు= ఆ శిష్యులు; ఉగ్గడింపఁగన్= చెప్పుతుండగా; కను=

చూస్తున్న; ఒజ్జ+పోలెన్= గురువువలె; మమున్+కొని= మమ్మలను ఆధారంగా గ్రహించి; నీవు; విషయ+ఉత్కరమున్= విషయసమూహాన్ని; భోగ్యంబుగాన్= అనుభవించ దగినదిగా; చేసికొందు(వు)= చేసికొంటావు; నీ కలలు= నీవు కలలు; కన్న+అప్పుడు= కన్నప్పుడు; మా లేమిన్= మేము లేకపోతే; ఆ+విషయంబు= ఆ విషయానుభవం; బొంకు+ఐనన్= అబద్ధం కాగా; వాకిలిలేని= తలుపులేని; ఆలయంబున్+చెంది= ఇంటి లోనికి వెళ్ళి; మరలినట్లు= తిరిగివచ్చినట్లు; చేడ్పాటున్= కీడును (నిర్వ్యాపారాన్ని); పొరయుదు(వు)+కాక= పొందుతావు తప్ప; నీకున్= నీకు; సత్యభుక్తి= నిజంగా అనుభవించటం; కలదె?= ఉన్నదా?; ఇంత+పట్టున్+కాన్పు(ము)= ఇంతమాత్రం అర్థం చేసికొనుము; ఏమునున్= మేమూ; నీవునున్= నీవూ; కలసి+పరఁగన్= కలిసి పనిచేస్తే; భోగకలన= భోగానుభవం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: అట్లా కాదు - ఇట్లా చేయాలి అని చెప్పటంకొరకు మిక్కిలి నేర్పరులైన శిష్యులవద్దకు వెళ్ళి ఉపదేశం ప్రారంభించి, చివరికి ఆ శిష్యులు ఆ గొప్ప విషయాలను చెప్పుతుండగా నివ్వెరపోయి చూచి వింటున్న గురువువలె ఉన్నది నీ పని, మమ్మలను ఆధారంగా గ్రహించి నీవు విషయసమూహాన్ని అనుభవించదగినదిగా చేసికొంటున్నావు. మేమే లేకుండాపోతే ఆ విషయానుభవం వట్టి 'బొంకు' మాత్రమే! తలుపులులేని ఇంటి లోనికి వెళ్ళి మరలివచ్చినట్లు నిష్ప్రయోజకంగా నీవు తయారవుతావు. అందుచేత నీకు నిజమైన అనుభవం ఎక్కడిది? ఇంతమాత్రం అర్థంచేసికొనుము. మేమూ నీవూ కలిస్తేనే 'భోగానుభవం' కలుగుతున్నది. అందుచేత నీ గొప్ప ఏమిటీ?' అని ఇంద్రియాల వాదం.'

విశేషం: అలం; ఉపమ మనస్సు లేక ఇంద్రియాలు, ఇంద్రియాలు లేక మనస్సు రెండూ అనుభవాన్ని పొందజాలవని భావం. నిజానికి మనస్సు ఇంద్రియముఖంగా అనుభవం పొందుతుండగా, ఇంద్రియాలు మనస్సుద్వారా విషయాభిరమణం పొందుతున్నాయి. అందుచేత రెండూ ప్రధానమే. మనస్సు ఇంద్రియాలను

నియంత్రించగల సందర్భం ఉంటుందేమో కాని, ఎక్కువ ఇంద్రియాలు చెప్పినట్లు మనస్సు ప్రవర్తించటమూ ఉన్నది. ఇంద్రియాలలోని ప్రాణశక్తివలన మనస్సును మరలా ఉత్తేజితంచేసే శక్తి అవయవాలకున్నది.

వ. అని యివ్విధంబున మనంబును నింద్రియంబులును సంవాదంబు సేసె' నని యప్పురుషవరుం డా వర వర్ణినితో 'వేఱొక్కండు విను' మని యిట్లనియె. 38

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ఈ విధంబునన్= ఈ రీతిగా; మనంబునున్= మనస్సూ; ఇంద్రియంబులునున్= ఇంద్రియాలూ; సంవాదంబు+చేసెను+ అని= వాదోపవాదాలు జరిపాయని; ఆ+పురుషవరుండు= ఆ పురుషశ్రేష్ఠుడు; ఆ+వర+వర్ణినితోన్= ఆ శ్రేష్ఠమైన స్త్రీతో; వేఱు+ ఒక్కండు= మరొక విషయం; వినుము+అని= వినుమని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి. 'ఈ రీతిగా మనస్సు ఇంద్రియాలు వాదోపవాదాలు చేశా' యని ఆ బ్రాహ్మణుడు తన భార్యతో చెప్పి 'ఇంకా మరొక విషయం ఉన్నది వినుము' అంటూ ఇట్లా అన్నాడు.

సీ. 'ప్రాణప్రభృతులగు పవను లంభోరుహ।
గర్భుని నొక్కటఁ గానఁబోయి
'యెక్కుడు మాలోన నెవ్వరు?' నావుడు।
నవ్విభుం 'డెవ్వార లడఁగ నడఁగు
దురు పెఱవార? లెవ్వరికిఁ బ్రవర్తన।
మొందిన నెల్లవారును జరింతు
రధికు లందఱకును నట్టి వారలు మీరు।
సనుఁ' డని పలికినఁ జనక నిలిచి

ఆ. ప్రాణుఁ డాది గాఁగ బవనులందఱుఁ దమ।
వలన నవ్విధంబు గలుగఁ దెలుప
నాతఁ ‘డే నెఱుంగనా? యది యట్టిద।
వినుఁడు మీ విశేషవృత్తి భంగి’. 39

ప్రతిపదార్థం: ప్రాణ ప్రభృతులు+అగు= ప్రాణుడు, అపానుడు మొదలైన; పవనులు= వాయువులు; అంభోరుహగర్భునిన్= కమలగర్భుడైన బ్రహ్మను; ఒక్కటన్= అందరూ కలిసి; కానన్+పోయి= చూడబోయి; మాలోనన్= మా అందరిలోనూ; ఎక్కుడు= అధికుడు; ఎవ్వరు?= ఎవడు?; నావుడున్= అనగా; ఆ+విభుండు= ఆ స్వామి; ఏ+వారలు= ఎవరు; అడఁగన్= అణిగిపోతే; పెఱవారలు= ఇతరులు; అడఁగుదురు= అణిగిపోతారో; ఎవ్వరికిన్= ఎవరు; ప్రవర్తనము+ఒందినన్= పనిచేయటం మొదలు పెట్టితే; ఎల్లవారునున్+చరింతురు= అందరూ ప్రవర్తిస్తారో; అట్టివారలు= అట్లాంటివారు; అందఱకునున్= అందరిలోనూ; అధికులు= గొప్పవారు; మీరు= ఇక మీరు; చనుఁడు= బయలుదేరండి; అని; పలికినన్= చెప్పగా; చనక= తిరిగిపోకుండా; నలిచి= అక్కడే ఆగిపోయి; ప్రాణుఁడు+అది+కాఁగన్= ప్రాణుడు మొదలైన; పవనులు+అందఱున్= వాయువు లందరూ; తమవలనన్= తమచేత; ఆ+విధంబు+కలుగన్+తెలుపన్= ఆ రీతిగా అవుతుందన్న విషయాన్ని; చెప్పగా; అతఁడు= ఆ బ్రహ్మ; ఏన్+ఎఱుంగనా?= నాకు తెలియదా?; అది+అట్టిది+అ= అది అట్లాంటిదే; మీ విశేషవృత్తి భంగిన్= మీ మీ ప్రత్యేక కార్యకలాపాన్ని; వినుఁడు= వినండి.

తాత్పర్యం: ఒకప్పుడు ప్రాణాపానాదులైన వాయువులు బ్రహ్మదేవుడి వద్దకు వెళ్ళి, ‘మాలో ఎవరు గొప్పవాడో దయచేసి చెప్పండి’ అని అడిగారు. బ్రహ్మ అన్నాడు: ‘ఎవరు అణగిపోతే ఇతరులందరూ అణగిపోతారో, ఎవరు పనిచేయటం మొదలుపెట్టితే ఇతరులంతా తమతమ పనులు మొదలు

పెట్టుతారో అట్లాంటివారు గొప్పవారు. ఇక మీరు మీ మీ దారులలో వెళ్ళండి’ అని చెప్పగా ప్రాణుడు మొదలైనవారు అట్లాగే నిలబడి పోయారు. తిరిగిపోలేదు. ప్రతి ఒకడూ తమవలననే ఇతరులు ప్రవర్తిస్తున్నారని చెప్పాడు. అపుడు బ్రహ్మ ‘అది నాకు తెలియదా! దాని విషయం అంతే. మీలో ప్రతి ఒక్కరూ ఒక విశిష్టవృత్తి కలిగినవారు. ఎట్లాగో చెప్పుతాను వినండి’ అని ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు.

తే. ‘ఎప్పు డెవ్వరివలన నే చొప్పు గలుగు।
నపుడ వారెక్కుడగుదు రన్యోన్యమిత్ర
భావమునఁ దాల్పుఁ డొండొరుఁ బవనులార!।
పొరిఁ బరస్పరభావనా పరుల రగుఁడు. 40

ప్రతిపదార్థం: ఎప్పుడు= ఏ సమయంలో; ఎవ్వరివలనన్= ఎవరివలన; ఏ చొప్పు కలుగున్= ఏ తీరున పని జరుగుతుందో; అపుడు+అ= అప్పుడే; వారు; ఎక్కుడు+అగుదురు= అధికులవుతారు; పవనులార!= ఓ వాయువులారా!; అన్యోన్య= పరస్పరం; మిత్ర భావమునన్= స్నేహభావంతో; ఒండొరులన్= ఒకరినొకరు; తాల్పుఁడు= భరించండి (అనుసరించి ప్రవర్తించండి); పొరిన్= మిక్కిలిగా; పరస్పర= ఒకరి నొకరు; భావనా పరులరు+అగుఁడు= సంభావించుకొనేవారు కండి.

తాత్పర్యం: ఎప్పుడూ ఎవరివలన ఏ తీరుగా ఒక పని జరుగుతుందో అప్పుడు మాత్రమే వారు అధికులవుతారు. అట్లా అందరూ ఒక్కొక్క సమయాన గొప్పవారే అవుతారు. అందుచేత ఒకరి నొకరు స్నేహభావంతో అనుసరించాలి. ఒకరి నొకరు గౌరవించుకొనండి.

వ. ఇత్తెఱంగున మీకు భద్రంబగుం బొం’ డని పుచ్చె నట్టుపదేశించిన బ్రహ్మ వాక్యంబుల వాయువులు సమత నొందె’నని చెప్పి, ‘వాయువిషయం బైనయది నారద దేవమత సంవాదంబు సెప్పెద నాకర్ణింపు’ మని బ్రాహ్మణుండు బ్రాహ్మణీ కిట్లనియె. 41

ప్రతిపదార్థం: ఈ తెఱంగునన్= ఈ విధంగా ప్రవర్తిస్తే; మీకున్= మీకు; భద్రంబు+ అగున్= క్షేమమవుతుంది; పొందు+అని= వెళ్ళండని; పుచ్చెన్= పంపించాడు; అట్లు+ ఉపదేశించిన= ఆ విధంగా ఉపదేశించిన; బ్రహ్మవాక్యంబులన్= బ్రహ్మదేవుడి మాటల వలన; వాయువులు= పంచవాయువులూ; సమతన్+ఒందెను+అని= సమభావనను పొందాయని; చెప్పి; వాయు విషయంబు+ఐన+అది= వాయువిషయ సంబంధమైన; నారద= నారదుడికి; దేవమత= దేవమతుడికీ జరిగిన; సంవాదంబు= సంభాషణ; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుమని; బ్రాహ్మణుండు= ఆ విప్రుడు; బ్రాహ్మణికిన్= ఆ బ్రాహ్మణస్త్రీకి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా ప్రవర్తిస్తే మీకు క్షేమం కలుగుతుంది. వెళ్ళిరండి' అని బ్రహ్మ వారిని పంపించాడు. బ్రహ్మ వాక్యాలవలన పంచవాయువులూ సమతను పొందాయి. ఇంతేకాకుండా వాయుసంబంధమైన మరొక సంవాదం నారదుడికి, దేవమతుడికి నడుమ జరిగింది. దానిని చెప్పుతాను విను' మని ఆ విప్రుడు ఆ విప్రస్త్రీకి ఇట్లా చెప్పాడు.

విశేషం : 'సమత' అంటే సమభావనతో ప్రవర్తించటమని అర్థం. పంచవాయువులు ఒక సమరసభావనతో ప్రవర్తించటమే ఆరోగ్యం. ఇందులో ఏది ప్రకోపించినా దానిని 'రోగ'మని అంటారు.

తే. 'దేవమతుఁ డను విప్రుఁడు దేవముని వ।
రేణ్యుఁ డగు నారదుని నొక్క పుణ్యభూమిఁ
గాంచి వినతుఁడై యాతని కరుణ వడసి।
భక్తిరసము పొంగారఁ దత్ప్రాంత మునకు. 42

ప్రతిపదార్థం: దేవమతుఁడు+అను= దేవమతుఁడనే పేరుగల; విప్రుఁడు= బ్రాహ్మణుడు; దేవముని వరేణ్యుఁడు+అగు= దేవర్షిశ్రేష్ఠుడైన; నారదునిన్= నారదుడిని; ఒక్క పుణ్య భూమిన్= ఒక పవిత్రమైన చోట; కాంచి= చూచి;

వినతుఁడు+ఐ= నమ స్కరించిన వాడై; అతని కరుణ+పడసి= అతడి అనుగ్రహం పొంది; భక్తిరసము= భక్తి రసానుభవం; పొంగారన్= అతిశయించగా; తద్+ప్రాంతమునకున్= అతడి సమీపానికి (వెళ్ళి).

తాత్పర్యం: దేవమతుడనే పేరుగల బ్రాహ్మణుడు దేవర్షిశ్రేష్ఠుడైన నారదుడిని ఒక పవిత్రభూమిలో చూచి, వినయంతో నమస్కరించి, ఆయన అనుగ్రహం పొంది, భక్తి అతిశయించగా అతడి సమీపానికి (తరవాతిపద్యంతో అన్వయం.)

సీ. అల్లన చన నాతఁ డాదరంబున 'నిందు।
ర మ్ముండు' మనుచుఁ గరమునఁ జూపు
నెడ సమాసీనుఁడై కడు వినయంబున।
హస్తముల్ మొగిచి దయాసమగ్ర!
యెఱిఁగింపు పవనంబు లేనింటియందును।
జాయమానంబగు జంతువునకుఁ
దొలితొలి యెద్ది దాఁదొడఁగు వర్తింపంగ?'।
ననవుడు నారదుం డతనితోడ

తే. 'వాయు వెయ్యది గర్భసంవాసమునకుఁ।
జొనుపు జీవునిఁ దజ్జంతుజననవేళఁ
దొలుత దాని కనంతరకలిత మైన।
మారుతంబు ప్రవర్తించు: మఱియు వినుము. 43

ప్రతిపదార్థం: అల్లన= నెమ్మదిగా; చనన్= వెళ్ళగా; అతఁడు= నారదుడు; అదరంబునన్= ఆదరంతో; ఇందున్= ఇక్కడికి; రమ్ము= రా!; ఉండుము= కూర్చొనుము; అనుచున్= అంటూ; కరమునన్= చేతితో; చూపు+ఎడన్= చూపించిన చోట; సమాసీనుఁడు+ఐ= కూర్చున్నవాడై; కడు= మిక్కిలి; వినయంబునన్= వినయంతో; హస్తముల్ మొగిచి= చేతులు జోడించుకొని; దయాసమగ్ర!= సంపూర్ణ దయస్వరూపుడా!; పవనంబులు+ఏనింటి+

అందును= ఐదు ప్రాణవాయువులలోనూ; జాయమానంబు+అగు= పుట్టేటటువంటి; జంతువునకున్= ప్రాణికి; తొలి తొలి= మును ముందుగా; ఎద్ది= ఏ వాయువు; తాన్+ వర్తింపన్+తొడఁగున్= తాను ప్రవర్తించటం మొదలు పెట్టుతుంది?; ఎఱిఁగింపు(ము)= తెలపండి; అనవుడున్= అని కోరగా; నారదుండు; అతనితోడన్= ఆ దేవమతుడితో; వాయువు+ఏ+అది= ఏ వాయువైతే; గర్భసంవాసమునకున్= గర్భంలో ఉండటానికి; తొలుతన్= ముందు; జీవునిన్+చొనుపున్= జీవుడిని ప్రవేశపెడుతుందో; తద్+ జంతు+జననవేళన్= ఆ జంతువు పుట్టే సమయంలో; దానికిన్= దానికి; అనంతర కలితము+ఐన= తరువాత ఉండేటటువంటి; మారుతంబు= వాయువు; ప్రవర్తించున్= పనిచేస్తుంది; మఱియున్= ఇంకా; వినుము.

తాత్పర్యం: అట్లా నెమ్మదిగా సమీపించగా నారదుడు ఆదరంతో 'ఇక్కడికి వచ్చి కూర్చొనుము' అని చేతితో ఒకచోటు చూపించాడు. దేవమతుడు ఆ చోట కూర్చున్నాడు. మిక్కిలి వినయంతో చేతులు జోడించి 'అయ్యా! మీరు కరుణా స్వరూపులు. ఐదు ప్రాణవాయువులలోనూ పుట్టే సమయంలో ప్రాణిలో మొట్టమొదట ఏ వాయువు పనిచేయటం మొదలు పెట్టుతుందో చెప్పండి' అని అడిగాడు. నారదుడు 'నాయనా! ఏ వాయువు ప్రాణిని గర్భసంవాసానికి ప్రేరేపిస్తుందో - ఆ జంతువు పుట్టే సమయంలో దాని తరువాత ఉన్న వాయువు పనిచేయటం మొదలుపెట్టుతుంది.

తే. పురుషునందు సమానంబుఁ బొలఁతియందు।
వ్యానమును జువ్వె పొడమించు వరుస ననఘ!
శుక్లమునకు శోణితమునఁ జూలు గల్గు।
నయ్యుగంబును విధి చెయ్ది నమరఁ బొంద. 44

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; వరుసన్= వరుసలో; పురుషునందున్= మగవాడిలో; సమానంబున్= సమాన ప్రాణమూ; పొలఁతి అందున్= అడుదానిలో; వ్యానమునున్= వ్యానమనే ప్రాణమూ; పొడమించున్=

పుట్టిస్తాయి; చువ్వె!= సుమా!; శుక్లమునకున్= వీర్యానికి; శోణితమునన్= రజస్సులో; ఆ+యుగంబును= ఆ రెండూ (శుక్లశోణితాలు); విధిచెయ్దిన్= దైవచేష్టవలన; అమరన్= తగినట్లు; పొందన్= కలువగా; చూలు+కల్గున్= గర్భం కలుగుతుంది.

తాత్పర్యం: సమానవాయువు పురుషుడిలో వీర్యాన్ని, వ్యానమనే వాయువు స్త్రీలో రజస్సును ప్రభవింపచేస్తాయి. శుక్లశోణితాల కలయిక గర్భంగా మారుతుంది. ఆ కలయిక దైవలీల.

క. విను సృష్టశోణితంబునఁ।
బనుగొను శుక్లంబువలనఁ బ్రాణుఁడు దగ వ
ర్తన మొందుఁ బ్రాణశుక్లము।
లనూనహేతువులుగా నపానుఁడు నడచున్. 45

ప్రతిపదార్థం: విను(ము)= ఇంకా వినుము; సృష్ట= పుట్టిన (సవ్యంగా స్రవించిన); శోణితంబునన్= రక్తంలో; పనుగొను= గట్టిపడేటటువంటి; శుక్లంబువలనన్= వీర్యంవలన; ప్రాణుఁడు= ప్రాణమనే వాయువు; తగన్= తగినట్లుగా; వర్తనము+ఒందున్= వ్యాపిస్తాడు; ప్రాణ శుక్లములు= ఇటు ప్రాణమూ,అటు వీర్యమూ; అనూన= గొప్ప; హేతువులుగాన్= కారణాలుగా; అపానుఁడు= అపానమనే మరొక వాయువు; నడచున్= వ్యాపిస్తాడు.

తాత్పర్యం: అప్పటి కప్పుడు నవ్యంగా పుట్టే రజస్సులో గట్టిపడ్డ వీర్యం కారణంగా అందులో ప్రాణుడు ప్రవేశిస్తాడు. ప్రాణుడు, వీర్యం - ఈ రెండూ కారణాలుగా అపానుడూ వ్యాపిస్తాడు.

విశేషం : ఏ వాయువు తరువాత ఏ వాయువు వ్యాపిస్తుంది? అనే ప్రశ్నకు సమాధానం ఇక్కడ ఉన్నది. గర్భధారణంలో ముందుగా పనిచేసేది ప్రాణం. అందుకే శుక్లశోణితాల కలయిక ముద్ద కట్టినపుడు అందులో ప్రాణశక్తి ప్రవేశిస్తున్నది. దానిని అనుసరించి అధోమార్గం కలిగిన అపానం వ్యాపిస్తుంది. అప్పుడు ఏమి జరుగుతుందో తరువాతి పద్యంలో వివరించాడు.

**క.	చనుఁ బ్రాణుఁ డధోగతి నూ।**
ర్ధ్వనిరూఢి నపానుఁ డివ్విధము గల యీ రెం
టను నగ్నిమయోదానం।
**బును వ్యానంబును సమానమును వర్తించున్.	46**

ప్రతిపదార్థం: ప్రాణుఁడు= ప్రాణుడనేవాయువు; అధోగతిన్= క్రిందివైపు; చనున్= ప్రసరిస్తాడు; అపానుఁడు= అపానుడనే వాయువు; ఉర్ధ్వ విరూఢిన్= పై వైపు (చనున్); ఈ విధము+కల= ఈ రీతిగా ప్రసరించే; ఈ రెంటనున్= ఈ రెండింటిలోను; అగ్ని మయ= అగ్నిశక్తితో నిండిన ఉదానంబునున్= ఉదానమూ; వ్యానంబును; వ్యానమూ; సమానమునున్= సమానమూ; వర్తించున్= వ్యాపిస్తాయి.

తాత్పర్యం: అపుడు ప్రాణుడు అధోముఖంగానూ, అపానుడు ఊర్ధ్వముఖంగానూ ప్రసరిస్తారు. అపుడు ఈ రెండు వాయువులలో 'అగ్ని' శక్తితో నిండిన ఉదాన, వ్యాన, సమానులు ప్రసరిస్తారు. (ఇట్లా పిండం ప్రాణశక్తితో నిండుతుందని అర్థం).

**ఆ.	పావకుండు సర్వదేవాత్మకుండు ప్రా।**
ణంబునకు నపాననామమునకు
నంతరమున వెలుఁగు నా భవ్యమూర్తి యు।
**దానరూప మండ్రు తజ్జ్ఞ జనులు.	47**

ప్రతిపదార్థం: తద్‌జ్ఞ+జనులు= ఆ ప్రాణాగ్నితత్త్వం తెలిసిన పండితులు; పావకుండు= అగ్ని; సర్వదేవ+ఆత్మకుండు= దేవతలందరిలోనూ వ్యాపించి ఉన్నవాడు (అందుకే దేవతలందరూ తేజోరూపులు); ప్రాణంబునకున్= ప్రాణానికి; అపాన నామమునకున్= అపానానికి; అంతరమునన్= నడుమ; వెలుఁగు= ప్రకాశించేటటువంటి; ఆ+భవ్యమూర్తి; ఉదానరూపము+అండ్రు= ఉదానరూపుడని అంటారు.

తాత్పర్యం: ఆ ప్రాణాగ్నితత్త్వం తెలిసిన పండితులు దేవతలందరిలోనూ వ్యాపించి ఉండేవాడూ, ప్రాణాపానాల నడుమ వెలిగే పుణ్యమూర్తీ అయిన అగ్నిని ఉనానరూపుడుగా గుర్తిస్తారు.

**సీ.	విను మహోరాత్రంబులును శుభాశుభములు।**
సత్యానృతంబులు సదసదాహ్వ
యములును నైన ద్వంద్వములు ప్రాణాపాన।
ములకు నామాంతరములు; దదీయ
మధ్యవర్తిత నొప్పు మహనీయ వహ్ని:
యుదానంబు దాని నిర్ద్వంద్వభావ
మాంతరయాగ విద్యాప్రవీణులు గండ్రు।
పరమశాంతి యనంగ బ్రహ్మ మనఁగ

**తే.	నరయ భేదంబు లే దన్న యట్టులుండు।**
నమ్మహావస్తువును నుదానాకృతియ య
నంగఁ జెవియార విందుము నలినగర్భు।
**చేత' నని దివ్యముని యిట్లు సెప్పెఁ గరుణ.	48**

ప్రతిపదార్థం: వినుము= ఇంకా ఈ ప్రాణతత్త్వం ఎట్లాంటిదో వినుము; అహోరాత్రంబులునున్= రాత్రింబవళ్ళు; శుభ+అశుభములున్= మేలు కీళ్ళు; సత్య+అనృతంబులున్= సత్యం, అసత్యం, సత్+అసత్+అహ్వాయములునున్+ ఐన= సత్తు, అసత్తు అనే పేర్లు కలిగినటువంటి; ద్వంద్వములు= ద్వంద్వ భావాలు ఏవి ఉన్నాయో-అవి; ప్రాణ+ అపానములకున్= ప్రాణపానాలకు; నామాంతరములు= మారుపేర్లు; తదీయ= వాటి; మధ్యవర్తితన్= నడుమ ఉండటం అనే లక్షణంతో; ఒప్పు అతిశయించేటటువంటి; మహనీయ= గొప్ప; వహ్ని= అగ్ని; ఉదానంబు= ఉదానం; దాని నిర్+ద్వంద్వ భావము= ఆ అగ్ని యొక్క, అద్వైతస్థితిని (అంటే అది ఒకవైపు అగ్ని, మరొకవైపు వాయువు,

ఈరెండూ కలిసిన మహాతత్త్వం అది - అని అర్థం); ఆంతర+యాగవిద్యా ప్రవీణులు= ఆంతర్యాగవిద్యలో నిష్ణాతులైన వారు; కంద్రు= తెలిసికొంటారు; పరమశాంతి+అనంగన్= పరమశాంతి స్థితి అని; బ్రహ్మము+అనఁగన్= బ్రహ్మమనీ; అరయన్= అలోచించగా; భేదంబు+లేదు+అన్న+అట్టులు+ ఉండు= భేదం లేదన్నట్లు కనిపించే; ఆ+ మహా వస్తువును= ఆ గొప్పతత్త్వాన్ని; ఉదాన+ఆకృతి+ఆ= ఉదానమే; అనంగన్= అని; నలినగర్భుచేతన్= బ్రహ్మదేవుడి వలన; చెవి+అరన్+విందుము= చెవులారా విన్నాము; అని; దివ్యముని= నారదుడు; కరుణన్= దయతో; ఇట్లు+చెప్పెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఇంకా ఈ ప్రాణతత్త్వం ఎట్లాంటిదో వినుము. రాత్రింబవళ్ళు, మేలు కీళ్ళు, సత్యాసత్యాలు, సదసత్తులు అనే ద్వంద్వాలు ప్రాణాపానాలకు మారుపేర్లే. వాటి నడుమ వర్తిల్లేటటువంటి అగ్ని ఉదానం. అగ్నితత్త్వాన్ని వాయుతత్త్వాన్ని రెండింటినీ కలిగినదాని అద్వైతస్థితిని అంతర్యాగవిద్యా నిపుణులు మాత్రమే గుర్తించగలరు. పరమశాంతి అని, బ్రహ్మమని పిలువబడే ఆ తత్త్వంలో ఏ భేదపరిగణనా సాధ్యం కాదు. అదే ఉదానతత్త్వమని సాక్షాత్తు బ్రహ్మదేవుడు చెప్పగా మా చెవులారా విన్నాము' అని నారదమహర్షి అతడితో చెప్పాడు.

వ. అని చెప్పి 'యింద్రియ మనః పవనంబుల భంగులు గనుంగొనుట యీ తత్త్వంబులకుఁ బరమంబైన తత్త్వంబు' గనుటకుఁ గతంబై యుండు' నని పలికి యద్ధరామరుం డా రామారత్నంబును సదయంబుగా నవలోకించి 'యుత్తమరహస్యంబు సెప్పెద నాకర్ణింపు' మని యిట్లనియె. 49

ప్రతిపదార్థం: అని చెప్పి= అని చెప్పినవాడై; ఇంద్రియ= ఇంద్రియాల; మనస్= మనస్సు యొక్క; పవనంబుల= వాయువుల; భంగులు= రీతులు; కనుంగొనుట= కనుగొనటం; ఈ+తత్త్వంబులకున్= ఈ తత్త్వాలకు;

పరమంబు+ఐన= అతీతమైన; తత్త్వంబున్+ కనుటకున్= మహాతత్త్వాన్ని దర్శించటానికి; కతంబు+ఐ+ఉండున్+అని= మూలమై ఉంటుందని; పలికి; ఆ+ధరామరుండు= ఆ భూదేవుడు; ఆ+రామారత్నంబును= ఆ స్త్రీరత్నాన్ని; సదయంబుగాన్= దయతో; అవలోకించి= చూచి; ఉత్తమ రహస్యంబు+ చెప్పెదన్= అత్యుత్తమ రహస్యం నీకు చెప్పుతాను; ఆకర్ణింపుము+అని= వినుమని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి, 'ఇంద్రియాలు, మనస్సు - ప్రాణం వీటిని గురించి తెలిసికొనటం ద్వారా ఈ తత్త్వాలకు అతీతమైన మహాతత్త్వాన్ని (అంటే ఆత్మతత్త్వాన్ని) గుర్తించటానికి సాధ్యమవుతుం'దని ఆ బ్రాహ్మణుడు తన భార్యకు చెప్పి, ఆమెవైపు దయామృత వీక్షణాలతో చూచి, 'మరో రహస్యాన్ని నీకు చెప్పుతాను జాగ్రత్తగా విను' మని ఇట్లా ప్రారంభించాడు.

జీవాత్మస్వరూప నిరూపణప్రకారము (సం.14-25-3)

సీ. 'కరణంబు కర్మంబు కర్త యన్నేతద్వి।
రాజితకారకత్రయముచేత
నఖిలంబు సంవ్యాప్తమై యుండు ఘ్రాణాదు।
లును మనంబును బుద్ధియును బ్రవరులు
కరణహేతువు లంద్రు గంధాది విషయ సం।
తతియు మంతవ్యబోద్ధవ్యములును
గర్మహేతువు లగుఁ గంపుకొనఁగ నానఁ।
గాన ముట్టఁగ వినఁగా దలంప

తే. నిశ్చయము దగఁ జేయంగ నేర్పు లేడు।
గలవు జీవాత్మునకు నవి కర్తృహేతు
భూతములు వాన విషయానుభూతి నతఁడు।
దొఱఁగు నిష్ఠలు మోక్షహేతువులు సుమ్ము. 50

ప్రతిపదార్థం: కరణంబు= కరణం (సాధనం); కర్మ= ధాత్వర్థ ఫలాశ్రయం; (క్రియాఫలాన్ని అనుభవించేవాడు కర్మ); కర్త= ధాత్వర్థవ్యాపారాశ్రయం (క్రియావ్యాపారాన్ని చేసేవాడు కర్త); అన్+ఏతద్+విరాజిత= అనబడే ఈ ప్రసిద్ధమైన; కారక త్రయముచేతన్= మూడు కారకాలచేత; అఖిలంబున్= అంతా; సంవ్యాప్తము+ఐ+ఉండున్= బాగా వ్యాపించబడి ఉంటుంది. ఘ్రాణ+ ఆదులునున్= ముక్కు మొదలైన ఐదు కర్మేంద్రియాలు; మనంబునన్= మనస్సు; బుద్ధియునున్= బుద్ధీ; కరణహేతువులు= కరణాలు (సాధ నాలని); ప్రవరులు= శ్రేష్ఠులైన పండితులు; అంద్రు= అంటారు; గంధాది విషయ సంతతియున్= వాసన చూడటం మొదలైన విషయసమూహం; మంతవ్య, బోద్ధవ్యము లునున్= ఆలోచించదగినది, తెలిసికొనదగినది; కర్మహేతువులు+ అగున్= కర్మ హేతువు లవుతాయి; కంపు కొనఁగన్= వాసన చూడటానికి; ఆనన్= తినటానికీ; కానన్= చూడటానికి; ముట్టఁగన్= తాకటానికి; వినఁగన్= వినటానికి; తలంపన్= ఆలోచించ టానికి; నిశ్చయంబు+తగన్+ చేయంగన్= తగినట్టు నిర్ణయించటానికి; నేర్పులు= శక్తులు; ఏడు+కలవు= ఏడున్నాయి. జీవాత్మునకున్= జీవాత్ముడికి; అవి= ఈ ఏడు నేర్పులూ; కర్తృ హేతు భూతములు= కర్తృత్వాన్ని కలిగించే లక్షణాలు; వానన్= వాటిలోనే; అతఁడు= ఆ జీవాత్ముడు; విషయానుభూతిన్= విషయానుభవాన్ని; తొఱఁగున్= వదిలిపెట్ట గలుగుతాడు; నిష్ఠలు= అతడు అవలంబించే నిష్ఠలు (నియమాలు, దీక్షలు); మోక్షహేతువులు; సుమ్ము!= సుమా!

తాత్పర్యం: 'కరణం, కర్మ, కర్త - ఈ మూడు కారకాలు, ప్రపంచమంతా ఈ మూడింటి తోనే నిండి ఉన్నది. ముక్కుమొదలైన కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధికరణహేతువులు. వాసన చూడటం మొదలైన విషయసమూహం. ఆలోచించదగినది, తెలిసికొనదగినది - ఏవి ఉన్నాయో అవి కర్మహేతువులు. వాసన పట్టటం, తినటం, చూడటం, తాకటం, వినటం, ఆలోచించటం, నిర్ణయం చేయటం - అనే ఏడు పనులు జీవాత్ముడు చేయగలుగుతాడు. ఈ నేర్పులు కర్తృహేతువులు అవుతాయి. వీటితోనే ఆ జీవుడు విషయసుఖాలను

తరిమికొట్టగలడు కూడా. తోడుగా అవలంబించే శ్రద్ధ, నియమనిష్ఠలు మోక్షాన్ని కలిగిస్తాయి.

వ. కరణకర్మకర్తృకారకాత్మకుండును జీవాత్ముండు భోక్త యగుట దక్కి వివిధవిషయమూర్తులగు హవిస్సుల నుదాసీనత్వస్రుగ్గతంబులు సేసి వేల్చు నిష్ఠ నాత్మస్వరూపం బగు ననలంబు ప్రజ్జ్వలితం బయి యవిద్యాధూమ రహితం బగుచుం బొలుచు; నది మోక్షప్రకారం బట్లు గాక భోక్త యగు' నేని నట్టిద బంధ ప్రకారం బని నిర్దేశించి 'ముక్తభావంబునకు మూలం బయిన యోగ యజ్ఞంబునం దేను బ్రవృత్తుండనై యున్నవాఁడ; దానికి సర్వపరిత్యాగంబు దక్షిణ; దాన సకలాత్ముండగు నారాయణుండు ప్రీతుండై స్వీకరించు; నద్దశ పేరు మునులు ముక్తి యని చెప్పుదు' రని చెప్పి యన్విప్రుండు వెండియు. 51

ప్రతిపదార్థం: కరణ, కర్మ, కర్తృ కారక+ఆత్ముండు+అగు= కరణ, కర్మ, కర్తృ కారకత్రయాన్ని ఆత్మగా కలిగిన; జీవాత్ముండు= జీవుడు; భోక్త+ అగుటన్+తక్కి= తాను కర్త అనే భావాన్ని వదలిపెట్టి; వివిధ విషయ మూర్తులు+అగు= వివిధాలైన విషయసుఖాల స్వరూపం కలిగిన; హవిస్సులన్; ఉదాసీనత్వ= ఉదాసీన మనేటటువంటి; స్రుక్+ గతంబులు+చేసి= (యజ్ఞంలో వాడే) కొయ్యగరిటెలో వేసి; వేల్చునిష్ఠన్= హోమం చేసే నిష్ఠవలన; ఆత్మ స్వరూపంబు+అగు+అవలంబు= ఆత్మస్వరూపమైన అగ్ని; ప్రజ్జ్వలితంబు+ అయి= బాగా మండి; అవిద్యారూప= అవిద్య (అజ్ఞానం అనే) పొగచేత; రహితంబు+అగుచున్= లేనిదై; పొలుచున్= ప్రకాశిస్తుంది; అది మోక్షప్రకారంబు= అట్లా చేయటం మోక్షం చేకూరే పద్ధతి; అట్లు+కాక+ భోక్త+అగునేనిన్= అట్లాకాకుండా తానే తినేవాడు. అనుభవించేవాడు అయితే; అట్టిది+ఆ= అట్లాంటి విషయానుభవమే; బంధప్రకారంబు+అని= బంధం కలిగించే తీరు అని; నిర్దేశించి= బోధించి; ముక్తభావంబు నకున్= వదలిపెట్టటం (ముక్తం) అనే భావానికి; మూలంబు+అయిన= హేతువైన; యోగ యజ్ఞంబు

నందున్= యోగమనే యజ్ఞంలో; ఏను= నేను; ప్రవృత్తుండను+ఐ= పనిలో తలమునుకలుగా ఉన్నాను; దానికిన్+ సర్వపరిత్యాగంబు దక్షిణ= దానికి అన్నిటినీ వదలిపెట్టటమే దక్షిణ, దానన్= దానివలన; సకల+ఆత్ముండు+ అగు= సకలలోకాలలోనూ ఆత్మమూలంగా వ్యాపించిన; నారాయణుండు= శ్రీమహావిష్ణువు; ప్రీతుండై= సంతోషించినవాడై; స్వీకరించున్= స్వీకరిస్తాడు; ఆ+దశపేరు= ఆ మహోత్తమస్థితి పేరు; మునులు= మహర్షులు; ముక్తి+అని చెప్పుదురు+అని= ముక్తి అని చెప్పుతారని; చెప్పి= చెప్పినవాడై; ఆ విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; వెండియున్= ఇంకా (ఇట్లా అన్నాడు.)

తాత్పర్యం: కరణ, కర్మ, కర్త అనే కారకత్రయాన్ని ఆత్మగా కలిగిన జీవుడు తాను కర్త ననే భావాన్ని (తాను అనుభవిస్తున్నాననే భావనను) వదలిపెట్టి, వివిధాలైన విషయసుఖాల స్వరూపం కలిగిన హవిస్సులను ఉదాసీనమనే 'స్రుక్కు' లో వేసి హోమం చేయటంలోని 'నిష్ఠ' చేత ఆత్మస్వరూపమైన అగ్ని బాగా మండి, 'అవిద్య' అనే పొగలేనిదై ప్రకాశిస్తుంది. ఇది మోక్షం అందుకొనే విధం. అట్లా కాకుండా 'భోక్త' నేనే అని భావించి చేస్తే (లేదా తానే అన్నిటినీ అనుభవిస్తే) ఆ విషయానుభవమే బంధకారక మవుతుంది' అని బోధించి, 'విముక్తి భావానికి మూలమైన యోగయజ్ఞంలో నేను తలమునకలుగా ఉన్నాను. దానికి అన్నిటినీ వదిలిపెట్టటమే దక్షిణ, దానివలన సకలంలోనూ వ్యాపించిన పరమాత్ముడైన నారాయణుడు సంతోషించి జీవుడిని గ్రహించే ఆ మహోత్తమ స్థితినే మోక్ష మని (ముక్తి అని) మునులు పిలుస్తారు' అని చెప్పినవాడై ఆ బ్రాహ్మణుడు ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'శాస్త యొక్కండ తచ్ఛాసనంబునన యేఁ।
జరియింతు నొక్కండ గురుఁ డతండు
సెప్పిన యర్థంబు చిత్తంబులో నుంతు।
శ్రోత యొక్కండ తద్జ్ఞాతబుద్ధి

నెగడుదు నొక్కండ వగవంగ విద్వేష్ట।
వాని వ్రాల్చినదిక్క వ్రాలి యెడరుఁ
గడపుదు గడవంగఁ గారణమయ్యెడు।
తెఱఁగు పెద్దలచేత నెఱిఁగినాఁడ

తే. వినుము దేవతలును మునులును బరమేష్ఠి।
యొద్ద కరిగి 'మాకు నెద్ది హితమొ'
యనిన నా విధాత యక్షరోపాసన।
మనియెఁ గాన దుర్గ మబల! కడతు. 52

ప్రతిపదార్థం: శాస్త= అనుశాసకుడు; ఒక్కండు+అ= ఒక్కడే ; తద్+ శాసనంబునన్+అ= అతడి శాసనంతోనే; ఏన్+చరియింతున్= నేను చరిస్తాను; ఒక్కండ గురుఁడు= గురుడు ఒక్కడే; అతండు+చెప్పిన+అర్థంబు= అతడు చేసిన ఉపదేశాన్ని; చిత్తంబులోన్+ఉంతున్= మనస్సులో ఉంచుకొంటాను; శ్రోత+ఒక్కండు+అ= శ్రోత ఒకడే; తద్+జ్ఞాతబుద్ధిన్= గురువు చెప్పిన దానిని తెలిసికొనే నైపుణ్యంగల బుద్ధితో; నెగడుదున్+ఒక్కండన్= ఏకైకంగా ప్రవర్తిస్తాను; విద్వేష్ట= శత్రువు; వగవంగన్= బాధింపగా; వాని+వ్రాల్చిన దిక్కు+ అ= వాడు ఏదిక్కులో వాల్చితే ఆ దిక్కులోనే; వ్రాలి= వాలి; ఎడరున్= ఆపదను; కడపు దున్= దాటుతాను; పెద్దలచేతన్= పెద్దలవలన; కడవంగన్= తరించటానికి; కారణము+ అయ్యెడు+తెఱఁగున్= మూలమైన మార్గాన్ని; ఎఱిగినాఁడన్= తెలిసికొన్నాను; వినుము= ఇంకా ఒక ప్రధాన విషయం ఉన్నది వినుము; దేవతలునున్= మునులునున్; పరమేష్ఠి+ ఒద్దకున్= బ్రహ్మవద్దకు; అరిగి= వెళ్ళి; మాకున్; ఎద్ది?= ఏ మార్గము?; హితమో= శ్రేయస్సో; అనినన్= అనగా; ఆ విధాత= ఆ బ్రహ్మ; అక్షర+ఉపాసనము+అని= అక్షరతత్త్వాన్ని ఉపాసించటమని; అనియెన్= అన్నాడు; అబల!= ఓ వనితా!; దుర్గము-కాన= దాటటానికి వీలులేని అరణ్యాన్ని; కడతున్= దాటగలను.

తాత్పర్యం: అనుశాసకుడు ఒకడే. అతడి అనుశాసనంతోనే నేను చరిస్తాను. గురుడు ఒక్కడే. అతడు చేసిన ఉపదేశాన్ని మనస్సులో ఉంచుకొంటాను. శ్రోత ఒకడే, గురూపదేశాన్ని తెలిసికొన్న బుద్ధితో ప్రవర్తిస్తాను. శత్రువు ఏ వైపు వ్రాల్చితే ఆ వైపు వ్రాలి, ఓర్పుతో ఆ ఆపదను దాటుతాను. తరించే మార్గం ఏదో దానిని పెద్దలవలన తెలిసికొన్నాను. అంతేకాదు. మరొక విషయం ఉన్నది వినుము. ఒకప్పుడు దేవతలు మునులు బ్రహ్మ దగ్గరకు వెళ్ళి, 'మాకు శ్రేయోమార్గం చెప్పండి' అని అడిగారు. వారికి ఆయన 'అక్షరోపాసన' మాత్రమే తగిన మార్గమని బోధించాడు. ఓ వనితా! నేను ఆ మార్గంలో వెళ్ళుతున్నాను కాబట్టి సంసారమనే దుర్గమారణ్యాన్ని తప్పకుండా దాటగలను.

విశేషం : 'దుర్గం' అంటే లోపలికి పోవటానికి, బయటికి రావటానికి కష్టమైన దని అర్థం. అది అరణ్యమే కానక్కరలేదు.

తరువాతి వచనంలో ఈ అర్థం ఉన్నది.

వ. ఇంక నెక్కడ గడచెద! మున్న కడచితిఁ గ్రోధ తిమిరంబును లోభవ్యాళంబును గామదస్యుదూషితంబును నగు దుర్గంబు గడచి యొక వనంబు ప్రవేశించితి 'ననిన విని 'యవ్వనిత యవ్వనం బెట్టి?' దని యడిగిన నమ్మహాద్విజుం డిట్లనియె. 53

ప్రతిపదార్థం: ఇంకన్+ఎక్కడన్+కడచెదన్!= ఇంకా ఎక్కడ దాటటం! (ఇంకా ఏమి దాటాలి? అని); మున్ను+అ+కడచితిన్= ముందే దాటాను; క్రోధ= కోపమనే; తిమిరంబునున్= చీకటిని; లోభ= లోభమనే; వ్యాళంబునున్= సర్పాన్ని; కామ= కోరికలనే దుస్యు= దొంగలచేత; దూషితంబును= భయంకరంగా ఉన్న; దుర్గంబు+కడచి= కోటను దాటి; ఒకవనంబు= ఒక అడవిని; ప్రవేశించితిన్= చేరాను; అనినన్= అనగా; విని; ఆ+వనిత= ఆ స్త్రీ; ఆ+వనంబు= అ అడవి; ఎట్టిది+అనినన్= ఎట్లాంటిదని అడుగగా; ఆ+మహాద్విజుండు= ఆ గొప్ప బ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇంకా నేను ఏం దాటాలి? ముందే అన్నిటిని అధిగమించాను. కోపమనే చీకటిని, లోభమనే మహా సర్పాన్ని తప్పించుకొని, కోరికలనే దొంగలతో నిండిన భయంకరమైన పాడువడిన కోటను దాటి, ఒక అడవిలోనికి ప్రవేశించాను' అని భర్త చెప్పగా ఆమె 'ఆ అడవి ఎట్లాంటి'దని అడిగింది. దానికి ఆ విప్రుడు ఇట్లా చెప్పాడు. క్రోధతిమిరము-క్రోధమనెడితిమిరము, లోభవ్యాళము-లోభమనే వ్యాళము, కామదస్యు-కామమనే దస్యు-రూపకాలంకారాలు

ఉ. అంతకుఁ బిన్నలున్ వెదక నంతకుఁ బెద్దలు లేవు దుఃఖ మ
త్యంతముఁ జేయ సౌఖ్య మెసలార నొనర్పఁగ నొం డొకంటి యం
దంతటి నేర్పు లేదు వెఱ పన్నది యేమియు నవ్వనంబు ని
శ్చింతతఁ జొచ్చియున్న నరుఁ జెందరు నిర్వృతి సెందు నుగ్మలీ! 54

ప్రతిపదార్థం: ఉగ్మలీ!= ఓ వనితా!; వెదకన్= వెదకగా; అంతకున్= అంతకంటె; పిన్నలున్= చిన్నవి; అంతకున్= అంతకంటె; పెద్దలున్= పెద్దవి; లేవు= అక్కడ కనిపించవు; దుఃఖము+అత్యంతమున్+చేయన్= మిక్కిలి దుఃఖాన్ని కలిగించటానికి కాని; సౌఖ్యము+ఎసలారన్= ఒనర్పఁగన్= సౌఖ్యం మిక్కిలి అధికంగా కలిగించటానికి కాని; ఒండు+ఒకంటి+అందున్= ఏ ఒక్కదానిలోనూ; అంతటి నేర్పు లేదు= అంతటి నైపుణ్యం లేదు; ఆ+వనంబున్= ఆ అడవిని; నిశ్చింతతన్= ఏ చింతా లేకుండా; చొచ్చి ఉన్న= ప్రవేశించి ఉన్న; నరున్= మనిషిని; వెఱపు+అన్నది= భయమన్నది; ఏమియున్+చెందదు= కొంచెంకూడా ఆక్రమించదు; (అతడు); నిర్వృతిన్= విముక్తిని; చెందున్= పొందుతాడు.

తాత్పర్యం: 'ఓ వనితా! ఆ అడవి చాలా చిత్రమైనది. అక్కడ చిన్నా పెద్దా అనే ఏ తారతమ్యమూ లేదు. మిక్కిలి దుఃఖం కలిగించేవి కాని, మిక్కిలి సుఖాన్ని కలిగించేవి కాని అక్కడ ఏ ఒక్క 'విషయ'మూ లేదు. ఏ చింతా లేకుండా అక్కడ ప్రవేశించిన మనిషికి 'భయం' కలుగనే కలుగదు. అట్లాంటి వాడు ముక్తినే పొందుతాడు.

విశేషం : సుఖదుఃఖకారులు 'విషయాలు'. అవి ఇంద్రియాలను చాలా నేర్పుగా లొంగదీసి కొంటాయి. దానితో ఏర్పడేది 'చింత'. దానితో 'భయం'.ఇవేవీ అక్కడ లేవు. చిన్నా పెద్దా అంటే ద్వంద్వభావం, సుఖదుఃఖాలు అంటే కర్తృత్వభావన. ఈ రెండూ లేని మనిషి 'నిశ్చింత' గా ఉంటాడు. వాడు నిర్భయుడు. దానినే 'ధృతి' అంటారు. అందుచేత అట్లాంటి ధీరుడికి 'నిర్వృతి' సులభంగా ప్రాప్తిస్తుంది. అదే అక్షరతత్త్వం.

తే. కొన్నిటికిఁ బంచవర్ణముల్ గుసుమఫలము;।
లందుఁ గొన్నిటి కేకవర్ణాంచితంబు
లవనిజములు కొన్నిటికి నవ్యక్తవర్ణ।
కములు సౌరభ్యమాధుర్యసమధికములు. 55

ప్రతిపదార్థం: కుసుమఫలములందున్= పూవులు, పండ్లలో; కొన్నిటికిన్= కొన్నిటికి; పంచ వర్ణముల్= ఐదు రంగులు; కొన్నిటికిన్= కొన్నిటికి; ఏకవర్ణ+ అంచితంబులు= ఒకే వర్ణంతో కూడినవి; అవనిజములు= చెట్లు; కొన్నిటికిన్= కొన్నిటికి; అవ్యక్తవర్ణకములు= రంగు ఏమిటో తెలియటంలేదు (కాని అవి); సౌరభ్య= సువాసనకలిగిన పూలు; మాధుర్య= తీపు కలిగిన పండ్లు; సమధికములు= అత్యధికంగా కలిగి ఉన్నాయి.

తాత్పర్యం: ఆ అడవిలో చిత్రవిచిత్రాలైన పూలు, పండ్లు కనిపిస్తున్నాయి. కొన్నిటికి ఐదురంగులు, మరికొన్ని ఒకే రంగుతో ఉన్నాయి. కొన్ని చెట్లు ఏ రంగులో ఉన్నాయో గుర్తించటానికి అవకాశం లేదు. కాని, వాటి పూలు సువాసన కలిగినవి: పండ్లు అతి మధురమైనవి.

విశేషం: ఈ అడవి వర్ణన సాంకేతికమైనది. పంచవర్ణాలు - పంచేంద్రియవ్యాపార జనిత సుఖానుభవాలకు సంకేతం. ఒకేవర్ణం-సమత్వభావసాధనకు సంకేతం. అవ్యక్తవర్ణం-నిర్గుణత్వసంకేతం. వాటి కున్న సౌరభం. మాధుర్యం అవ్యక్త అక్షరోపాసనలో లభించే బ్రహ్మానందానికి నిదర్శనం.

వ. అవ్విపినంబున. 56

ప్రతిపదార్థం: ఆ+విపినంబునన్
తాత్పర్యం: ఆ అడవిలో- తరువాతి పద్యంతో అన్వయం.

క. వృక్షంబులకుం గలుగును।
దీక్షాగుణములును నతిథితృప్తికృతియుఁ బ
ద్మాక్షీ! యతిథులు బ్రహ్మ స।
దృక్షులు సౌఖ్యంబు నిట్టఁ దేలుదురు మునుల్. 57

ప్రతిపదార్థం: పద్మాక్షీ= కనులలోచనా!; వృక్షంబులకున్= చెట్లకు; దీక్షా గుణములునున్= దీక్షాలక్షణాలు; కలుగును= ఉంటాయి; అతిథి తృప్తి కృతియున్= అతిథులకు తృప్తి కలిగించటమూ; అతిథులు= వచ్చే అతిథులు; బ్రహ్మసదృక్షులు= బ్రహ్మ సదృశులు; మునులు= ఋషులు; సౌఖ్యంబు నిట్టన్+తేలుదురు= సంతోషంతో తేలుతుంటారు.

తాత్పర్యం: అక్కడ చెట్లు కూడా దీక్షలో ఉంటాయి. అతిథులను సంతృప్తి పరుస్తుంటాయి. అక్కడికి వచ్చే అతిథులు సాక్షాత్తు బ్రహ్మస్వరూపులు. ఆ ఋషులు ఆ వనంలో బ్రహ్మానందంతో మునిగి ఉంటారు.

ఆ. కెలఁకులకును మింటికిని మేర లివి యన।
రాదు గాన యయ్యరణ్యభూమి
వెలుఁగు లొండ్లు సొరపు వినుము క్షేత్రజ్ఞుండు।
రవి దదీయసేవ భవముఁ బాచు. 58

ప్రతిపదార్థం: కెలఁకులకును= దిక్కులకు; మింటికిని= ఆకాశానికి; ఇవి; మేరలు= సీమలు (సరిహద్దులు); అనరాదు= చెప్పలేము; కానన్= కాబట్టి; ఆ+అరణ్యభూమిన్= ఆ అడవిలో; వెలుఁగులు+ఒండ్లు= వేరే కాంతు లేవీ; చొరవు= దూరవు; వినుము= ఇంకా ఒక విచిత్రం వినుము; క్షేత్రజ్ఞుండు= యజమానుడు; రవి= సూర్యుడు; తదీయసేన= అతడి సేన; భవమున్+పాచున్= పుట్టుకను పోగొట్టుతుంది.

తాత్పర్యం: దిక్కులకు, ఆకాశానికి సరిహద్దులు చెప్పలేము కాబట్టి ఆ అడవిలో కూడా ఏ వేరే వెలుగులూ సోకవు. కాని, చిత్రం ఏమిటంటే - ఆ అడవికి యజమానుడు సూర్యుడు. అతడిని సేవిస్తే మరలా పుట్టుక అంటూ ఉండదు.

విశేషం : అది అనంతమైన సౌఖ్యసామ్రాజ్యం. అక్కడ మామూలు దీపపు కాంతులు కనిపించవు. క్షేత్ర యజమానుడు సూర్యుడు కాబట్టి అక్కడి కాంతులు ఎప్పుడూ క్షీణించవు.

క. మృగనయన! బ్రహ్మసంభవ।
మగు జలము వహించుచుండు నందుల నదులన్
నగములు విను దానఁ దప।
స్విగుణం బవ్యయపదంబుఁ జెందం గాంచున్. 59

ప్రతిపదార్థం: మృగనయన!= లేడి కన్నులవంటి కన్నులు కలదానా!; విను; అందులన్= ఆ అడవిలో; నదులన్= నదులలో; బ్రహ్మసంభవము+అగు= బ్రహ్మపదంనుండి పుట్టిన; జలము= నీరు; వహించుచున్+ఉండున్= పారుతూ ఉంటుంది; నగములు=కొండలు; దానన్= అందువలన; తపస్విగణంబు= ఋషుల సమూహం; అవ్యయపదంబున్= మోక్షస్థానాన్ని; చెందన్+ కాంచున్= పొందగలుగుతుంది.

తాత్పర్యం: ఆ అడవిలోని నదులలో బ్రహ్మసంభవమైన జలం ప్రవహిస్తుంది. ఆ అడవిలోని కొండలు పరమపవిత్రాలు. అక్కడ తపస్సు చేసి, ఋషులు ముక్తిపదాన్ని పొందగలుగుతారు.

వ. అట్టి దవ్విపినంబు. 60

ప్రతిపదార్థం: ఆ అడవి అట్లాంటిది.

తాత్పర్యం: రవి క్షేత్రజ్ఞుడై. బ్రహ్మపదస్థానంనుండి పుట్టిన జలాలు ప్రవించే నదులు, కొండలు ఉన్న ఆ చోటు స్వర్గం కంటె చాలా గొప్పది.

ఆ. మాననీయనియతి మహితతపోధన।
వంతులైన యట్టివారు శాంతి
దాంతి నిస్పృహతలు దలకొన సుసమాహి।
తాత్ములై వసింతు రందు సాధ్వి!' 61

ప్రతిపదార్థం: సాధ్వి!= ఉత్తమురాలా!; అందున్= అక్కడ; మాననీయ= పూజనీయమైన గొప్ప; నియతిన్= నిష్ఠతో; మహిత= ప్రభావం కలిగిన; తపోధనవంతులు+ఐన+ అట్టివారు= తపోధనం కల యోగులు; శాంతి= శాంతస్థితి; దాంతి= ఇంద్రియ నిగ్రహాదు లతో ఏర్పడ్డ ఓర్పు; నిస్పృహతలు= వైరాగ్యభావం; తలకొనన్= కూడగా; సు+ సమాహిత+ ఆత్ములు+ఐ= చక్కగా సుస్థితిని పొందిన ఆత్మ కలవారై; వసింతురు= ఉంటారు.

తాత్పర్యం: ఆ అడవిలో మహానిష్ఠాపరులై, ఉత్తమతపోధనం కలిగిన యోగులు నివసిస్తారు. వారికి శాంతమైన మనఃస్థితి, బ్రహ్మచర్యాది వ్రతనిష్ఠవలన ఏర్పడ్డ ఓర్పు, వైరాగ్యభావం ఉండి సంయమితాత్ములై 'సుస్థితి'ని పొంది అక్కడ ఆనందంతో ఉంటారు.

విశేషం: అంటే అట్లాంటి స్థితిని చేరుకొనటం కష్టం (దుర్+గమ= చేరటానికి దుష్కరమైనదని) కాబట్టి 'అడవి'గా ఇక్కడ వర్ణించాడని భావం.

వ. అని చెప్పి మఱియును. 62

తాత్పర్యం: అని చెప్పి ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'వినుము మూర్కొనఁ జవిగొన దర్శనస్పర్శ।
నము లాచరింప విననంగ నెలయ
నేమి సంకల్పము నెడఁ జేర్ప నిష్టార్థ।
ములను ననిష్టార్థములను గోరు
టయును నొల్లక త్రోచుటయును స్వభావవక్తృ।
త్వము లవి గనుఁగొంచు నబల! వానఁ

బొరయ నెట్లన్న మేల్ దొరకొనుఁ గోరక।
యును బోదు కీడు ద్రోచినను దీని

తే. నెఱిఁగి యేను స్వభావంబునెడఁ బయోజ।
పత్రగతజలబిందువుభంగిఁ దాల్తు'
నని యెఱింగించి బ్రాహ్మణుఁ డతివతోడ।
మఱియు నిట్లను శాత్రవ మథనకల్య! 63

ప్రతిపదార్థం: వినుము; మూర్కొనన్= వాసన చూడటానికి; చవిగొనన్= రుచి చూడటానికి; దర్శన స్పర్శనములు ఆచరింపన్= చూడటానికి; తాకటానికి; వినంగన్= వినటానికి; ఎలయన్= సిద్ధించేటట్లు; ఏమి సంకల్పంబున్= ఏ విధమైన సంకల్పాన్ని; ఎడన్= హృదయంలో; చేర్పన్= చేర్చుగా; ఇష్ట+ అర్థములనున్= నచ్చిన కోరికలను; అనిష్ట+ అర్థములనున్= నచ్చనివాటిని; కోరుటయునున్= కోరుకొనటం; ఒల్లక త్రోచుటయునున్= వద్దని వదలిపెట్టటం; స్వభావకృత్యములు= సహజంగా జరిగే పనులు; అవి= వాటిని; కనుఁగొంచున్= పరిశీలిస్తూ; అబల!= ఓ వనితా!; వానన్= ఆ పనులలో; పొరయన్= ప్రవేశించను; ఎట్లు+అన్నన్= ఎట్లాగంటే; మేల్= మేలు; కోరకయును= కోరకుండానే; దొరకొనున్= లాభిస్తుంది; కీడు; త్రోచినను= త్రోసిపారవేసినా; పోదు= జరగకపోదు; దీనిన్+ఎఱిఁగి= దీనిని గుర్తించి; ఏను= నేను; స్వభావంబు+ ఎడన్= స్వభావంలో; పయోజపత్ర= తామరాకు; గత= మీదనున్న; జలబిందువు భంగిన్= నీటిబొట్టువలె; తాల్తున్= ధరిస్తాను; అని; బ్రాహ్మణుఁడు= ఆ విప్రుడు; అతివతోడన్= ఆస్త్రీతో; ఎఱింగించి= చెప్పి; మఱియున్+ఇట్లనున్= మరి ఇంకా ఇట్లా చెప్పాడు; శాత్రవ= శత్రువులను; మథనకల్య!= బాధించటంలో నేర్పరి అయిన ఓ అర్జునా! (వినుము).

తాత్పర్యం: ఇంద్రియాలతో పనులు చేసేటప్పుడు - అంటే వాసన చూసేటప్పుడుకాని, రుచి ఎరిగేటప్పుడుకాని, చూచినప్పుడు కాని, తాకినప్పుడుకాని, విన్నప్పుడుకాని - హృదయంలో ఎట్లా సంకల్పిస్తే కోరిక

సిద్ధించినా, సిద్ధించకపోయినా లభించిన వస్తువు నచ్చినా నచ్చకపోయినా, కోరుకొనటం, వద్దని వదలిపెట్టటం రెండూ ఉండవో అట్లా అత్యంత సహజంగా నిర్లిప్తంగా ఆ పనులు చేస్తూ నేను ఏ బంధాన్నీ పొందకుండా ఉంటాను. ఎందుకంటే జరగబోయే మేలు కోరకుండానే జరుగుతుంది. ఎంత వారించినా రాబోయే ఆపద ఆగదు. దీనిని గుర్తించి, తామరాకుమీద నీటి బొట్టువలె ఏ సంస్పర్శా లేకుండా నేను స్వభావరీత్యా 'నిర్మగ్నుడు' కావటానికి ప్రయత్నిస్తాను' అని చెప్పి ఆ విప్రుడు ఇంకా ఇట్లా చెప్పాడు. (ఓ అర్జునా! నీవు యుద్ధంలో లక్షలమంది శత్రువులను అవలీలగా చంపినవాడవు. ఈ సాధనకూడా మొదలుపెట్టుము అని అర్థం).

విశేషం : అలం: ఉపమ. శ్రీకృష్ణుడు 'విముక్తి' సాధించే సులభమార్గం చెప్పుతున్నాడు. బంధానికి కారణం 'సంకల్పమే'. దానివలననే ఇష్ట అనిష్ట భావనలు ఏర్పడుతాయి. ఈ బ్రాహ్మణుడు దానిని జయించటానికి (నిష్కామ' సంకల్పంతో పని ప్రారంభించటం మొదలుపెట్టాడు. దానితో ఏర్పడేది నేను 'కర్త'ను కానన్న వైరాగ్యభావన. దానితో కార్యసిద్ధి దైవం 'దైవం' మీద వదలి, తాను 'నిష్కర్ముడు' అవుతాడు. అదే మంచి చెడులు ఎట్లాగైనా జరుగుతాయన్న జ్ఞానం కలిగి ఉండటం, చివరకిది 'తామరాకుమీద నీటి బొట్లు. భగవద్గీతలో యోగి సమాజంలో ఉంటూ ఎట్లా బంధ విముక్తుడు అవుతాడంటే దేనిలోనూ అంటి - అంటకుండా ప్రవర్తించటంచేత.

'పద్మపత్ర మివాంభసా' అని గీతాకారుడి పోలిక, దీనినే స్వామి మరలా ఇక్కడ చెప్పాడు.

వ. 'ఒక్కయెడ నధ్వర్యునకు యతికిం గలిగిన సంవాదంబు సెప్పెద నాకర్ణింపు; మధ్వర్యుండు పశువుం బ్రోక్షించుచుండ యతి నిరీక్షించి 'యిది హింస గాదె?' యనిన నతండు. 64

ప్రతిపదార్థం: ఒక్క+ఎడన్= ఒకచోట; అధ్వర్యునకున్= యాజ్ఞికుడికి; యతికిన్= సన్న్యాసికి; కలిగిన= జరిగిన; సంవాదంబు= సంభాషణ; చెప్పెదన్=

చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము; అధ్వర్యుండు= ఆ యజ్ఞంచేసే వ్యక్తి; పశువున్= యజ్ఞంలో బలి ఇచ్చే పశువును; ప్రోక్షించుచుండన్= మంత్రజలం చల్లి పవిత్రం చేస్తుండగా; యతి= సన్న్యాసి; నిరీక్షించి= పొంచి చూచి; ఇది= ఇట్లా చేయటం; హింస+కాదె?= హింసకాదా?; అనినన్= అనగా; అతండు= ఆ యాజ్ఞికుడు.

తాత్పర్యం: ఒక చోట ఒక యాజ్ఞికుడికి, యతికి జరిగిన సంవాదం చెప్పుతాను వినుము. ఒక యాజ్ఞికుడు బలిపశువును మంత్రజలం ప్రోక్షించి బలికి సిద్ధం చేస్తుండగా యతి పొంచి ఉండి, అక్కడకు వచ్చి 'ఇట్లా చేయటం హింస కాదా' అని అడిగాడు. అప్పుడు ఆ యాజి (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'ఛాగ మిది యరయంగ నాశంబు బొంద।
దూర్ధ్వలోకసుఖంబుల నొందుఁ గాని
శ్రుతుల వాక్యముల్ నీ కెక్క సూనృతంబు।
లగున యేని నీ విట్లంట యనుచితంబు.' 65

ప్రతిపదార్థం: ఛాగము+ఇది= ఈ మేక; అరయంగన్= బాగా తెలిసికొంటే నాశంబున్+పొందదు= చావదు; ఊర్ధ్వలోక సుఖంబులన్= స్వర్గాద్యుత్తమ లోకాలను; ఒందున్+కాని= పొందుతుంది తప్ప; శ్రుతులవాక్యముల్= వేదవాక్యాలు; నీకున్+ఎక్కన్= నీ తలపులో (భావనలో); సూనృతంబులు+ అగును+అ+ఏని= సత్యాలు అయితే; నీవు+ఇట్లు+అంట= నీవు ఇట్లా అనటం; అనుచితంబు= సముచితం కాదు.

తాత్పర్యం: 'అయ్యా! వేదవాక్యాలలో మీకు నమ్మకం ఉంటే ఇట్లా అనటం సముచితం కాదు. ఈ మేక చావదు. ఊర్ధ్వగతి పొందుతుంది.'

వ. అని వెండియు నప్పశువు నుద్దేశించి. 66

ప్రతిపదార్థం: అని; వెండియున్= ఇంకా; ఆ+పశువున్= ఆ మేకను; ఉద్దేశించి= దృష్టిలో పెట్టుకొని.

తాత్పర్యం: అని ఇంకా ఆ బలిపశువును దృష్టిలో ఉంచుకొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'భూతములు నింద్రియంబులు। నాతతగుణ!
యాత్మయోనులందుఁ గలయఁ బిం
డేతరుఁ డగు జీవుఁడు సౌ।
ఖ్యాతిశయం బొందు నధ్వరాతిశయమునన్.' 67

ప్రతిపదార్థం: అతతగుణ!= ఉత్తమ గుణాలు కలిగిన ఓ యతీశ్వరుడా!; భూతములున్= పంచభూతాలూ; ఇంద్రియంబులున్= ఇంద్రియ పంచకమూ; ఆత్మయోనులందున్= తమ తమ జీవులు ప్రవేశించే దేహాలలో; కలయన్= ప్రవేశించగా; పిండ+ఇతరుఁడు+ అగు= జీవుఁడు= పిండరూపం పొందని జీవుడు; అధ్వర+అతిశయమునన్= యజ్ఞశక్తివలన; సౌఖ్య+అతిశయమున్+ పొందున్= మిక్కిలి గొప్పదైన స్వర్గసౌఖ్యాన్ని పొందుతాడు.

తాత్పర్యం: 'యతీశ్వరా! పంచభూతాలు, పంచేంద్రియాలు ఆయా జీవులు ప్రవేశించే యోనులలో చేరి, జన్మను పొందుతాయి. యజ్ఞంలో బలి అయ్యే జీవుడు పిండరూపం పొందడు. యజ్ఞప్రభావంవలన మిక్కిలి గొప్పదైన స్వర్గ సుఖాన్ని పొందుతాడు.'

విశేషం : మామూలుగా చనిపోతే పిండరూపం తప్పకపొందుతాడు. యజ్ఞంలో మరణిస్తే అట్లా కాదు. ఆ జీవుడు చేసిన పుణ్యఫలాన్ని అనుభవిస్తాడు. అందుకే జీవితం కర్మప్రధానంగా ఉండాలి. ఆ కర్మ యజ్ఞకర్మ కావాలని 'యాగ' మతం. ఇదీ బంధహేతువే అని, 'జ్ఞానయాగం' ఒకటే ఉత్తమసాధనమని 'జ్ఞానమతం'. అదే 'అక్షరోపాస్తి'గా ముందు ప్రస్తావించినది. ఈ రెండింటిని వ్యాసమహర్షి ఎట్లా సమన్వయించాడో ఈ అధ్వర్యు - యతి సంవాదంలో అర్థంచేసికొనవచ్చును.

క. అని పలుకుటయును యతి యి।
ట్లను 'ఛాగము పుణ్యగతికి నరిగెడుఁ బో యి

ప్పని నీ కెవ్విధము ప్రయో।
జనంబు సిద్ధించుఁ? జెపుమ సమ్యక్ఫణితిన్.' 68

ప్రతిపదార్థం: అని పలుకుటయును= అని 'యాజి' చెప్పగా; యతి; ఇట్లు+ అనున్= ఈ విధంగా అన్నాడు; ఛాగము= మేక;పుణ్య గతికిన్+అరిగెడున్+పో= పుణ్యాలోకాలకు పోతుందే అనుకొందాం; ఈ+పనిన్= ఈ పశువిశసనం వలన; నీకున్+ఏ+విధము+ ప్రయోజనంబు= నీకు ఏమి లాభం; సిద్ధించున్?= ఒనగూడుతుంది?; సమ్యక్+ఫణితిన్= విశదంగా; చెపుము+అను= చెప్పుము.

తాత్పర్యం: అని యాజ్ఞికుడు చెప్పగా అపుడు యతి ఇట్లా అన్నాడు. 'నీ వన్నట్టు ఆ మేక స్వర్గానికి వెళ్ళుతుందనే అనుకొందాము. దానివలన నీకు ఒరిగే లాభం ఏమిటి? బాగా వివరించి చెప్పుము.'

వ. అనుటయు నధ్వర్యుం డతని కిట్లనియె. 69

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అధర్వుండు= యాజి; అతనికిన్+ఇట్లు+ అనియెన్= అతడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని యతి అనగా 'యాజి' అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం : యజ్ఞఫలం ఏమిటి? అనేది ప్రశ్న. మేక స్వర్గానికి వెళ్ళితే 'యాజి'కి వచ్చిన లాభం ఏమిటన్నదీ ఆలోచించదగిన విషయమే. వేదప్రామాణ్యాన్ని బ్రాహ్మణుడు చెప్పుతున్నాడు.

క. 'అగమము పశువిధిం దగ।
యాగ మొనర్చినఁ ద్రివిష్టపానేక మహా
భోగానుభూతి భవ్య స।
మాగమ మగు ననుట బొంకె? యాగమవేదీ! 70

ప్రతిపదార్థం: ఆగమవేదీ!= ఓ యతీశ్వరా! నీవు వేదాలు తెలిసినవాడవు; ఆగమము= వేదం; పశువిధిన్= పశుబలి విధానంతో; తగన్= శాస్త్రోక్తంగా; యాగము+ఒనర్చినన్= యజ్ఞం చేస్తే; త్రివిష్టప= స్వర్గం మొదలైన; అనేక= చాలా; మహాభోగ+అనుభూతి+భవ్య+ సమాగమము+ అగున్+అనుట= గొప్ప సుఖాల అనుభవం కలుగుతుంది అనటం; బొంకె?= తప్పా?

తాత్పర్యం: 'యతీశ్వరా! నీకు వేదాలు బాగా తెలుసు కదా! వేదాల ప్రకారం బలిపశువిధానంతో శాస్త్రోక్తంగా యాగం చేస్తే స్వర్గాది దివ్యసౌఖ్యాలు సిద్ధిస్తాయి. ఇది తప్పంటావా?'

చ. అనవుడు 'హింస పాప మని యాగమవాక్యములంద కాదె! యేఁ
గని యిటు లంటి' నన్న యతిఁ గన్గొని 'నీవు సమాధిఁ బ్రాణరో
ధనము మనోలయంబు సుకృతంబులుగా నొనరించి వెండి యో
గ నిరతిఁ బొందె; దత్తెఱఁగు గాదొకో హింస? దలంచి చూడఁగన్.' 71

ప్రతిపదార్థం: అనవుడున్= అని యాజి చెప్పగా; యతి; హింస పాపము+అని= హింస మహాపాపమని; ఆగమ వాక్యములందున్+అ కాదె!= వేదవాక్యాలలోనే కదా!; ఏన్+కని= నేను చూచి; ఇటులు+అంటిన్= ఇట్లా అన్నాను; అన్నన్= అనగా; యతిన్+కన్గొని= యతిని చూచి; సమాధిన్= సమాధిలో; ప్రాణ రోధనమున్= వాయువును బంధించటం; మనస్+లయంబున్= మనసును లోపలికి తోయటం; సుకృతంబులుగాన్= మంచి పనులుగా; ఒనరించి= చేసి; వెండి= ఆ తరువాత; యోగనిరతిన్= యోగంలో స్థిరపడటాన్ని; పొందెదు= పొందుతున్నావు; ఆ+తెఱఁగు= ఆ పద్ధతి; తలంచి చూడఁగన్= బాగా విమర్శించి చూస్తే; హింస+కాదొకొ?= హింస కాదా మరి?

తాత్పర్యం: అని యాజి చెప్పగా యతీశ్వరుడు 'ఆ వేదవాక్యాలలోనే హింస మహాపాపమని నేను చూచే ఇట్లా అన్నాను' అన్నాడు. అపుడు యాజి ఆ యతితో అన్నాడు: 'నీవు సమాధిలో వాయువును బంధించి, మనస్సును లోపలికి ముంచి వాటిని చాలా పుణ్యకార్యాలుగా చేసి, ఆ తరువాత యోగంలో స్థిరపడుతున్నావు. బాగా విమర్శించి చూస్తే ఇందులో మాత్రం హింస లేదా మరి?' అని ప్రశ్నించాడు.

వ. అని పలికిన నయ్యధ్వర్యునకు నయ్యతిముఖ్యుం డిట్లనియె. 72

ప్రతిపదార్థం: అని పలికినన్= అని చెప్పగా; ఆ+అధ్వర్యునకున్= ఆ యాజితో; ఆ+ యతిముఖ్యుండు= ఆ యతిశ్రేష్ఠుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పలికిన ఆ యాజికి ఆ యతీశ్వరు డిట్లా అన్నాడు.

విశేషం : యజ్ఞఫలం ఏమిటి? అనేది ప్రశ్న, మేక స్వర్గానికి వెళ్ళితే 'యాజి'కి వచ్చిన లాభం ఏమిటన్నదీ ఆలోచించదగిన విషయమే. వేదప్రామాణ్యాన్ని బ్రాహ్మణుడు చెప్తుతున్నాడు.

చ. 'పరమతపంబు గాఢపరిపాకము నొందినఁ జిత్సుఖాత్మకా
క్షరమునఁ జిత్తభూతగుణజాలతనున్ క్షరమున్ వివేకితా
పరిణతిఁ; బాపి చూచి యనపాయసుఖస్థితి నూఁది పొల్లలం
బొరయక త్రోపు హింస యనుబుద్ధి విమూఢత గాక బోధమే? 73

ప్రతిపదార్థం: పరమతపంబు= గొప్ప తపస్సు; గాఢ= మిక్కుటమైన; పరిపాకమున్+ ఒందినన్= పరిపక్వతను పొందగా; చిత్+సుఖ+ ఆత్మక+ అక్షరమునన్= జ్ఞానస్వరూపమైన సుఖాన్ని ఆత్మ కలిగిన అక్షరతత్త్వాన్ని అవలంబించి; చిత్తభూత= మనసునుండి పుట్టిన; గుణజాలతనున్= ప్రకృతి గుణాలతో కూడిన శరీరం కలవాడిని; క్షరమున్= నశించే లక్షణం కలిగిన క్షరతత్త్వాన్ని; వివేకితాపరిణతిన్= వివేకపరిణతిచేత; పాపి= నశింపజేసి; చూచి= ఆ అనంతమైన అద్వైతస్థితిని దర్శించి; న+అపాయ= ఎడబాటులేని; సుఖస్థితిన్+ఊఁది= సుఖస్థితిని పొంది; పొల్లలన్= వ్యర్థమైన వాటిలో; పొరయక= ప్రవేశించకుడా; త్రోపు= నిషేధించటం; హింస+అను బుద్ధి= హింస అనేటటువంటి ఆలోచన; విమూఢత+ కాక= తెలివిలేనితనం తప్ప; బోధమే?= అది జ్ఞానమా?

తాత్పర్యం: 'గాఢంగా చేసిన తపస్సు పండగా జ్ఞానానందస్వరూపం కలిగిన అక్షరోపాసన చేత చిత్తజాతమైన ప్రకృతి గుణాలతో కూడిన ఈ శరీరాన్ని ఆశ్రయించిన క్షరతత్త్వాన్ని వివేకసమగ్రతద్వారా నశింపజేసి, నిరంతరమైన

అద్వైతానంద స్థితిని దర్శించి, ఆ సుఖాన్ని పొంది, వ్యర్థమైన ఐహికసుఖాలలోనికి మనస్సు జారకుండా నియంత్రించటం 'హింస' అనటం వట్టి అజ్ఞానం తప్ప మరొక్కటి కాదు.'

చ. అనవుడు నాతఁ 'డార్యవచనామృత మానినవాఁడు కీడుమేల్
గనుఁగొనఁజాలు; నేను బశుకార్యమునప్పుడు మీ రనుగ్రహిం
చిన క్రియఁ జూడనేర్తుఁ జిదచిద్ద్వయమున్ విభజించి దాన హిం
సనము నొకింతయుం బొరయ జన్నము సేయుదు మేలు నొందుదున్.'74

ప్రతిపదార్థం: అనవుడున్= అని యతి ప్రశ్నించగా; ఆతఁడు= ఆ యాజి; ఆర్య+ వచనామృతము= పెద్దల మాటలనే అమృతాన్ని; ఆనినవాఁడు= తాగినవాడు; కీడుమేల్= చెడు మంచి; కనుఁగొనన్+చాలున్= గుర్తించ గలుగుతాడు; నేను; పశుకార్యము+అప్పుడు= పశుబలి ఇస్తున్న సమయంలో; మీరు+అనుగ్రహించిన+క్రియన్= మీరు ఇంతసేపు బోధించిన పద్ధతిలో; చిత్+అచిత్= జ్ఞానాజ్ఞానాలను; ద్వయమున్= రెండింటినీ; విభజించి= వేరుచేసి; చూడనేర్తున్= యజ్ఞక్రియను దర్శించగలుగుతాను; దానన్= అందుచేత; హింసనమున్= హింసాపాపాన్ని; ఒక+ఇంతయున్= కొంచెంకూడా; పొరయన్= పొందను; జన్నము+చేయుదున్= యాగం చేస్తాను; మేలున్+ఒందుదున్= ఉత్తమగతిని పొందుతాను.

తాత్పర్యం: అని యతి ప్రశ్నించగా ఆ యాజి అన్నాడు: 'స్వామీ! పెద్దలమాటలు అనే అమృతాన్ని త్రాగినవాడు మంచిచెడులను గుర్తించగలుగుతాడు. నేను పశుసంప్రోక్షణచేసి బలి ఇచ్చే సమయంలోకూడా జ్ఞానాజ్ఞానాలను వేరుచేసి, మీరు ఇంతసేపూ ఏ అక్షర, క్షరతత్త్వాన్ని ఉపదేశించారో ఆ తత్త్వాన్ని దర్శించగలుగుతున్నాను. అందువలన నాకు ఏ హింస చేసిన పాపమూ అంటటంలేదు. నేను యజ్ఞం చేస్తాను; ఉత్తమగతిని పొందుతాను.' (ఇందులో దోషం ఏమిటి? ఇది జ్ఞానం ఎందుకు కాదు? అని యాజ్ఞికుడి మీమాంస). వచనామృతము-వచన మనెడి అమృతము - రూపకాలంకారం.

క. అనుటయు నతనికి యతి యి।
ట్లనుఁ 'బశుయజ్ఞమున కంటె ననఘ! తపోయ
జ్ఞనిరూఢి మేలు గావున।
వినిపింపఁ దలంచి యంటి వేయును నేలా?' 75

ప్రతిపదార్థం: అనుటయున్= అని యాజ్ఞికుడు చెప్పగా; అతనికిన్= అతడితో; యతి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అనఘ!= ఓ పుణ్యాత్మా!; పశుయజ్ఞమున కంటెన్= పశు యజ్ఞంకంటె; తపస్+యజ్ఞ నిరూఢి= తపోయజ్ఞంలో నిరతుడై ఉండటం; మేలు+ కావునన్= మేలు కాబట్టి; వినిపింపన్+తలంచి= నీకు చెప్పుదామని భావించి; అంటిన్= ఆ విధంగా చెప్పాను; వేయునున్+ఏలా?= ఇంక ఎక్కువగా చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: అని యాజ్ఞికుడు చెప్పగా యతి ఇట్లా అన్నాడు 'పుణ్యాత్మా! పశుయజ్ఞంకంటె తపోయజ్ఞం మేలుగా భావించినందువలన నీతో అట్లా చెప్పాను. ఇక దీనిని గురించి అధికంగా చెప్పటం ఎందుకు?'

వ. అనవుడు నమ్మాటకు నయ్యధ్వర్యుం డొడంబడియె' నని చెప్పి యాభూసుర పర్యుం డా భామినితో 'నీ యర్థంబున కొక్కయితిహాసంబు గల దాకర్ణింపుము. సహస్రబాహుండగు నర్జునుండు దుర్జయప్రతాపంబున నఖిల ద్వీపంబులు నేలి వ్రాలి తనకు నెదురు లేకున్న విజృంభించి పరశురాముం దొడరి యతనికి నత్యంతం బప్రియంబాచరించిన నతండు బహుశాఖోపశాఖాశోభితం బయిన పాదపంబు నుఱుముగా నఱికి పడవైచిన చందంబునం బరశుఖండిత సర్వాంగునిం జేసె; నంత నిలువక తత్పక్షంబు రాజులు గూడికొని తదీయ తనయులుం దారు నా రాముని యసన్నిధి నతని జనకుం డగు జమదగ్నిం జంపినం బెంపారు కోపంబున నాటోపం బెసంగ నా జామదగ్న్యుండు రాజుల నెల్లం దరమిడి యిరువదియొక్కమాఱు పరశుధారపాలుచేసిన నతనికిఁ బితృదేవతలు సన్నిధి సేసె. 76

ప్రతిపదార్థం: అనవుడున్= అని యతీశ్వరుడు చెప్పగా; ఆ+మాటకున్= ఆ మాటకు; ఆ+అధ్వర్యుండు= ఆ యాజ్ఞికుడు; ఒడంబడియెన్+అని= అంగీకరించాడని; చెప్పి; ఆ భూసురవర్యుండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు; ఆ భామినితోన్= ఆ స్త్రీతో; ఈ అర్థం బునకున్= ఈ విషయాన్ని వివరించేటటు వంటి; ఒక్క+ఇతిహాసంబు+కలదు= ఒక కథ ఉంది; ఆకర్ణింపుము= వినుము; సహస్ర బాహుండు+అగు+అర్జునుండు= వేయి బాహువులుగల కార్తవీర్యార్జునుడు; దుర్జయ ప్రతాపంబునన్= జయించటానికి వీలులేని పరాక్రమంతో; అఖిల ద్వీపంబులున్+ఏలి= అన్ని ద్వీపాలూ పరిపాలించి; వ్రాలి= అతిశయించినవాడై; తనకున్+ఎదురు లేకున్నన్= తనకు ఎక్కడా ఎదురులేకపోతే; విజృంభించి= పరాక్రమించి; పరశురామున్+తొడరి= పరశురాముడిని ఎదిరించి; అతనికిన్= అతడికి; అత్యంతంబు= మిక్కిలి; అప్రియంబు= కీడు; ఆచరించినన్= చేయగా; అతండు= ఆ పరశురాముడు; బహుశాఖా+ఉపశాఖాశోభితంబు+అయిన= చాలా కొమ్మలతో రెమ్మలతో బాగా శోభిస్తున్న; పాదపంబున్= చెట్టును; నుఱుముగాన్= నుగ్గుగా; నఱికి పడవైచిన చందంబునన్= నరికివేసిన రీతిగా; పరశుఖండిత= పరశువు (గొడ్డలి) చేత నరకబడిన; సర్వాంగునిన్+ చేసెన్= అన్ని అంగాలు కలవాడివిగా చేశాడు; అంతన్+ నిలువక= దానితో ఆగక; తద్+పక్షంబు రాజులు= ఆ కార్తవీర్యుడి పక్షాన చేరిన రాజులు; కూడికొని= ఒక్కటై; తదీయ తనయులున్= ఆ కార్యవీర్యుడి కుమారులు; తారున్= తామూ కలిసి; ఆ రాముని= ఆ పరశురాముడిని; అసన్నిధిన్= లేని సమయంలో; అతని జనకుండు+అగు= అతడి తండ్రి అయిన; జమదగ్నిన్= జమదగ్నిని; చంపినన్= చంపివేయగా; ఆ జామదగ్న్యుండు= ఆ పరశురాముడు; పెంపారు కోపంబునన్= అతిశయించిన కోపంతో; ఆటోపంబు+ఎసంగన్= విజృంభించిన; రాజులన్+ ఏల్లన్= రాజుల నందరినీ; తరమిడి= వరుసపెట్టి; ఇరువది+ ఒక్కమాఱు= ఇరవై ఒకసార్లు; పరశుధారపాలు+చేసిన= గొడ్డలి అంచుకు బలిచేసిన; అతనికిన్= అతడికి; పితృదేవతలు; సన్నిధి+చేసి= కనిపించి.

తాత్పర్యం: అని యతీశ్వరుడు చెప్పగా ఆ మాటకు ఆ యాజ్జికుడు అంగీకరించా'డని చెప్పి, ఆ బ్రాహ్మణుడు ఆ వనితతో 'ఈ విషయాన్ని వివరించే కథ ఒకటున్నది చెప్పుతాను; వినుము. వేయి చేతులున్న కార్తవీర్యార్జునుడు జయించటానికి వీలులేని పరాక్రమంతో అన్ని ద్వీపాలూ పాలించి, అతిశయించినవాడై తనకు ఎక్కడా ఎదురులేకపోగా విజృంభించినవాడై పరశురాముడిని ఎదిరించి, అతడికి చాలా కీడు చేశాడు. దానితో ఆ పరశురాముడు చాలా కొమ్మలతో రెమ్మలతో కూడుకొన్న నిండైన చెట్టును నుగ్గునుగ్గుగా నరికివేసినట్లు గొడ్డలితో ఆ కార్తవీర్యుడి అంగాంగాలూ ఖండించి చంపాడు. దానితో రెచ్చిపోయిన అతడి పక్షంలోని రాజులు, అతడి కుమారులు కలిసి పరశురాముడు దగ్గరలేని సమయంలో అతడి తండ్రి అయిన జమదగ్ని మహామునిని చంపివేశారు. అతిశయించిన కోపంతో మిక్కిలి విజృంభించినవాడై ఆ పరశురాముడు రాజుల నందరినీ వరుసపెట్టి ఇరవై ఒక్కసార్లు తన గొడ్డలి అంచుకు గురిచేశాడు. చివరికి అతడికి పితృదేవతలు ప్రత్యక్షమయ్యారు.

విశేషం : కార్తవీర్యుడు త్రిశూలంతో పరశురాముడిని కొట్టగా అతడు క్రిందపడిపోయాడు అని ఒక కథ ఉన్నది. దానినే ఈ వచనంలో అత్యంతమైన అప్రియంగా చెప్పుతున్నారు. బహుశాఖోపశాఖాశోభితంబైన పాదపంబు నుఱుముగా నఱికి పడవైచిన చందంబున- అలంకారం ఉపమ.

ఆ. పరశురామ! నీవు బ్రాహ్మణుండవు నరే।
శ్వరులఁ జంపనేల? వలవ దుడుగు
మయ్య!' యనుడు నాతఁ 'డట్లనకుం డుఁ డీ।
రేను రాజ పశు విధానమునను.' 77

ప్రతిపదార్థం: పరశురామ!= ఓ పరశురామా!; నీవు; బ్రాహ్మణుండవు= బ్రాహ్మణుడవు; నర+ ఈశ్వరులన్= రాజులను; చంపన్+ఏల?= చంపటం ఎందుకు?; వలవదు= కూడదు; ఉడుగుము+అయ్య!= ఆపివేయవయ్యా!;

అనుడున్; అతఁడు= ఆ పరశురాముడు; ఈరు= మీరు; అట్లు+అనకుండుఁడు= అట్లా అనవద్దండి; ఏను= నేను; రాజ పశు విధానమునను= రాజు లనే పశువులను యజ్ఞం చేయటంలో

తాత్పర్యం: పరశురామా! నీవు బ్రాహ్మణుడవు. రాజులను చంపటం ఎందుకు? ఈ పని తప్పు, మానివేయవయ్యా! అని వారు చెప్పగా పరశురాముడు 'మీరు అట్లా అనవద్దు. నేను ఈ రాజపశువులను యజ్ఞం చేసి తీరుతాను. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సారనియతిఁ బాటించి మ।
హారోషాగ్ని పరితృప్త మగునట్టులుగా
వీరాధ్వరంబు సేసెద।
వారింపక యరుగుఁ' డనిన వా రాతనితోన్. 78

ప్రతిపదార్థం: సారనియతిన్= గొప్ప నియమాన్ని; పాటించి= అవలంబించి; మహాదోష+ అగ్ని పరితృప్తము+అగు+అట్టులుగాన్= గొప్ప రోషమనే అగ్నిచేత బాగా కాలిపోయేటట్లు; వీర+అధ్వరంబు+చేసెదన్= వీరోచితమైన యజ్ఞం చేస్తాను; వారింపక= నన్ను వారించకుండా; అరుగుఁడు+అనినన్= వెళ్ళిపోండి; అనగా; వారు; అతనితోన్= ఆ పరశు రాముడితో,

తాత్పర్యం: గొప్ప నియమాన్ని పాటించి గొప్ప రోషమనే అగ్నిచేత ఆ రాజులను హోమంచేసి వీరోచితమైన యజ్ఞం చేస్తాను. నన్ను అడ్డుకోకుండా వెళ్ళిపొండి' అని పరశురాము డంటే అప్పుడు ఆ పితృదేవతలు. (తరువాతి పద్యంతో అన్వయం.-) దోషాగ్ని-దోషమనెడి అగ్ని-రూపకాలంకారం.

క. 'యజ్ఞంబులలోనఁ దపో।
యజ్ఞం బుత్తమము; దాని నాదరణమునం
బ్రాజ్ఞోత్తమ! చేయుము స।
ర్వజ్ఞుఁడు ప్రీతుఁ డగు శాంతరస మొప్పఁ జుమీ!' 79

ప్రతిపదార్థం: ప్రాజ్ఞ+ఉత్తమ!= జ్ఞానులలో శ్రేష్ఠుడా!; యజ్ఞంబులలోనన్= యజ్ఞాల న్నింటిలోనూ; తపస్+యజ్ఞంబు= తపస్సు అనే యజ్ఞం; ఉత్తమము= శ్రేష్ఠమైనది; దానిన్= ఆ తపస్సును; ఆదరణమునన్= ఆదరంతో; చేయుము; సర్వజ్ఞుఁడు= ఈశ్వరుడు; ప్రీతుఁడు+అగున్= సంతోషిస్తాడు; శాంతరసము+ ఒప్పున్+చుమీ!= నీవు శాంతస్థితిని పొందుతావు సుమా!

తాత్పర్యం: 'యజ్ఞాలలో కెల్లా తపస్సు చాలా శ్రేష్ఠమైనది. ఆ తపస్సును ఆదరంతో నిర్వహించుము. ఈశ్వరుడు నిన్ను కరుణిస్తాడు. నీకూ ప్రశాంతి లభిస్తుంది.'

వ. అని చెప్పి మఱియు నిట్లనిరి; 'తొల్లి యలర్కుం డను రాజు మనస్స్పృష్టంబు లగు నింద్రియంబులు గలిగి దివ్యాస్త్రంబులు ప్రయోగింపం జూచిన నవి నయ్యవనిపతితో నయ్యప్రియంబులం దారు సెడ మనియును రోషా వేశంబునం బ్రయోగించిన నతండ చెడు ననియునుం బలికి 'యోపుదేని నీ తపోమయంబు లైన యస్త్రం బులు సంధింపు' మనిననతండు క్రోధంబుదక్కి యోగంబున శాంతి నొంది వానిం దద్రూపతపఃఫలా స్త్రసాధితంబులం జేసె; నీవునుం దపంబున నంతశ్శత్రుజయసౌఖ్యం బనుభవింపుము బాహ్యాశత్రు జయంబు జయంబుగాఁ గొనకుము.' 80

ప్రతిపదార్థం: అని చెప్పి= అని బోధించి; మఱియున్+ఇట్లు+అనిరి= ఇంకా ఇట్లా చెప్పారు; తొల్లి= మునుపు; అలర్కుండు+అను= రాజు= అలర్కు డనే పేరుగల రాజు; మనస్+స్పృష్టంబులు+అగు= మనస్సుచేత అపవిత్రంచేయ బడిన; ఇంద్రియంబులు+ కలిగి= ఇంద్రియాలు కలిగినవాడై; దివ్య+ అస్త్రంబులు= గొప్ప ఆయుధాలు; ప్రయోగింపన్+చూచినన్= ప్రయోగించాలని ప్రయత్నిస్తే; అవి= ఆ ఇంద్రియాలు; ఆ+అస్త్రంబులన్= ఆ అస్త్రాలతో; తారు= తాము; చెడము+అనియునున్= నశించమనీ; రోష+అవేశంబునన్= రోషంతోడ; ప్రయోగించినన్= ప్రయోగిస్తే; అతండు+అ= అతడే; చెడున్+ అనియున్= నశిస్తాడని; పలికి= చెప్పి; ఓపుదు(వు)+ఏని= సమర్థుడవైతే; నీ తపోమయంబులు+ఐన= నీవు తపస్సు చేసి సాధించిన; అస్త్రంబులు= అస్త్రాలను; సంధింపుము+అనినన్= అనుసంధించుమని అడుగగా; అతండు= ఆ అలర్కుడు; క్రోధంబు+తక్కి= కోపం విడిచిపెట్టి; యోగంబునన్= యోగంతో; శాంతిన్+ఒంది= ప్రశాంతిని పొంది; వానిన్= ఆ ఇంద్రియాలను; తద్+రూప= ఆయా ఇంద్రియాలకు తగిన; తపస్+ఫల+అస్త్ర= తపః ఫలరూపం కలిగిన అస్త్రాలచేత; సాధితంబులన్+చేసెన్= సాధింపబడ్డవిగా చేశాడు; నీవునున్= నీవుకూడా; తపంబునన్= తపస్సుతో; అంతస్+శత్రు జయ= లోపలి శత్రువులను జయించటంవలన పుట్టే సౌఖ్యంబు+ అనుభవింపుము= ఆత్మసంతోషాన్ని పొందు; బాహ్య శత్రుజయంబున్= బయటి శత్రువును జయించటం; జయంబుగాన్+ కొనకుము= జయంగా అనుకొనవద్దు.

తాత్పర్యం: అని బోధించి ఇంకా ఇట్లా చెప్పాడు 'మునుపు అలర్కుడు అనే రాజు మనస్సుచేత అపవిత్రం చేయబడిన ఇంద్రియాలు కలవాడై, వాటిని జయించటంకొరకు తన దగ్గరున్న గొప్ప గొప్ప ఆయుధాలు ప్రయోగించాడు. అప్పుడు ఆ ఇంద్రియాలు తాము ఆ ఆయుధాలచేత చావము అని, రోషంతో ప్రయోగిస్తే అతడే చస్తాడని చెప్పి, 'సమర్థుడవైతే తపస్సుచేసి సాధించిన అస్త్రాలు ఉంటే ప్రయోగించుము' అని ఉపదేశించాము' అని ఉపదేశించాయి. అప్పుడు ఆ అలర్కుడు కోపం విడిచిపెట్టి, యోగాభ్యాసంతో ప్రశాంతిని పొంది, ఆ ఇంద్రియాలకు అనుగుణమైన తపోమయదివ్యాస్త్రాలను ప్రయోగించి వాటిని అదుపులోనికి తెచ్చుకొన్నాడు. అట్లాగే నీవు కూడా తపస్సుతో లోపలిశత్రువులను జయించి ఆత్మసౌఖ్యం అనుభవించుము. బయటి శత్రువులను జయించటం విజయమని అనుకోవద్దు' అని చెప్పాడు.

క. అని నిష్ఠించి పలుక న।
వ్వినుతచరిత్రుండు శాంతివిభవంబున మా
నిన మనసుతోడ ముని మా।
ననపాత్రం బైన తపమునన మే లొందెన్.' 81

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; నిష్ఠించి పలుకన్= నిర్ణయించి పలుకగా; ఆ+వినుత చరిత్రుండు= ఆ పుణ్యచరిత్రుడు; శాంతి విభవంబునన్= ప్రశాంతి వైభవంతో; ఊనిన= నిలిచిన; మనసుతోడన్= మనస్సుతో; ముని మానన పాత్రుంబు+ఐన= మునుల గౌరవానికి పాత్రమైన; తపమునన్+అ= తపస్సుతోనే; మేలు+ఒందెన్= ఉత్తమగతిని పొందాడు.

తాత్పర్యం: అని ఈ విధంగా నిర్ణయించి పలుకగా ఆ పుణ్యమూర్తి ప్రశాంతిని పొందాలన్న కోరికతో మునుల ప్రశంసకు పాత్రమైన తపస్సుచేతనే ఉత్తమగతిని పొందాడు.'

సీ. అని చెప్పి బ్రాహ్మణుం డయ్యింతి కిట్లను౯।
'దొమ్మిది గుణములు కొమ్మ! కలవు
స్తంభాభిమానహర్షంబులు సాత్త్విక।
ములు; క్రోధసంరంభములును శోక
మును రాజసంబులు మోహతంద్రాస్వప్న।
ములు తామసము లిట్లు గలుగు రిపుల౯
దునుమ నే యస్త్రంబు లనువగు వాన న।
య్యంతర శత్రుచయంబు నెల్ల౯

తే. దునిమి యేనింద్రియంబుల మనము నోర్చి।
శాంతి నొంది శ్రేయస్సిద్ధి సాధనం బొ
నర్చునది ముఖ్యవైరి నిర్ణయము౯ జేయు।
నంబరీషగీతలు విను మంబుజాక్షి! 82

ప్రతిపదార్థం: అని చెప్పి= అని చెప్పినవాడై; బ్రాహ్మణు౦డు= ఆ విప్రుడు; ఆ+ఇంతికిన్+ఇట్లు+అనున్= ఆ వనితతో ఇట్లా అన్నాడు; కొమ్మ!= ఓ వనితా!; తొమ్మిది గుణములు కలవు= తొమ్మిది గుణాలున్నాయి; స్తంభ= స్థిరత్వం; అభిమాన= ఆత్మగౌరవం; హర్షంబులు= సంతోషం; సాత్త్వికములు=

సాత్త్వికాలు; క్రోధ= కోపం; సంరంభము లునున్= ఉద్రేకం; శోకమునున్= దుఃఖం; రాజసంబులు= రాజసాలు; మోహ= భ్రాంతి; తంద్రా+స్వప్నములు= బడలిక; నిద్రపోవటం; తామసములు= తామస గుణాలు; ఇట్లు= ఈ విధంగా; కలుగు రిపులన్= ఉన్న శత్రువులను; తునుమన్= చంపటానికి; ఏ అస్త్రంబులు+అనువు+అగున్= ఏ అస్త్రాలు తగినవో; వానన్+అ= వాటితోనే; ఆ+అంతర శత్రు చయంబున్+ఎల్లన్= ఆ లోపలి శత్రుసమూహాన్ని అంతటినీ; తునిమి= చంపి; ఏను+ఇంద్రియంబులన్= పంచేంద్రియాలలో; మనమున్= మనస్సును; ఓర్చి= జయించి; శాంతిన్+ఒంది= శాంతిని పొంది; శ్రేయస్సిద్ధి సాధనంబు+ఒనర్చునది= శ్రేయస్సును సిద్ధించేటట్లు ప్రయత్నించాలి; అంబుజ+అక్షి!= పద్మలోచనా!; ముఖ్యవైరి నిర్ణయమున్+ చేయు= ముఖ్యశత్రు నెవరో గుర్తించే; అంబరీషగీతలు= అంబరీష గీతలను; వినుము.

తాత్పర్యం: అని చెప్పినవాడై ఆ విప్రుడు తనభార్యతో ఇట్లా అన్నాడు. 'వనితా! తొమ్మిది గుణాలున్నాయి. వాటిలో స్థిరత్వం, ఆత్మగౌరవం, సంతోషం అనేవి సాత్త్వికాలు. కోపం, ఉద్రేకం, దుఃఖం అనేవి రాజసాలు. భ్రాంతి, బడలిక, నిద్ర అనేవి తామసాలు. ఇవే లోపల ఉన్న శత్రువులు. వీటిని జయించటానికి ఏ అస్త్రం తగినదో దానిని ప్రయోగించియే వీటిని జయించగలము. తరువాత ఐదు ఇంద్రియాలతోనూ మనస్సును జయించి, ప్రశాంతస్థితిని పొంది, మోక్షానికి ప్రయత్నంచేయాలి. ఈ మార్గంలో ముఖ్యశత్రువు ఎవరో నిర్ణయించటంలో పనికి వచ్చేటటువంటి అంబరీష గీతలున్నాయి. వాటిని గురించి చెప్తాను వినుము.

వ. అంబరీషుం డనురాజు రాజనీతిపరత్వంబునం బరమప్రభుత్వంబు నొంది యరాతుల నెల్ల విగతాసులం జేసె పూజ్యం బగు రాజ్యంబు పరిపాలించు చుండి యొక్కనా౦డు విద్వజ్జనంబులతో నిట్లనియె. 83

ప్రతిపదార్థం: అంబరీషుండు+అను రాజు= అంబరీషుడనే పేరుగల రాజు; రాజనీతి పరత్వంబునన్= రాజనీతిలో నిష్ఠ కలిగి; పరమ ప్రభుత్వంబున్+

ఒంది= గొప్ప చక్రవర్తియై; అరాతులన్+ఎల్లన్= శత్రువులందరినీ; విగత+ అసులన్+చేసి= పోయిన ప్రాణాలు గలవారిగా చేసి (చంపి); పూజ్యంబు+ అగు= మహనీయమైన; రాజ్యంబున్= రాజ్యాన్ని; పరిపాలించుచున్+ఉండి= ఏలుతూ ఉండి; ఒక్కనాఁడు= ఒకరోజు; విద్వత్+జనంబు లతోన్= ఆస్థానంలోని పండితులతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అంబరీషుడనే రాజు గొప్పరాజనీతిపరుడు. మహాచక్రవర్తి, శత్రువులనందరినీ చంపి, రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండి. ఒకనాడు తన ఆస్థానంలోని పండితులతో ఇట్లా అన్నాడు.

తే. 'అరుల నెల్ల జయించియు నది జయంబు।
గాఁ గొనక యున్నవాఁడ; నగ్గలపుఁ బగ జ
యింప కున్కిఁ దద్విజయవిహీనుఁ దృష్ణ।
జనిజరామృత్యువశగ వర్తనునిఁ జేయు. 84

ప్రతిపదార్థం: అరులన్+ఎల్లన్= శత్రువులందరినీ; జయించియున్= జయించికూడా; అది= అట్లా జయించటం; జయంబుగాన్+ కొనక+ఉన్నవాఁడన్= విజయంగా నేను గ్రహించకుండా ఉన్నాను (ఎందుకంటే); అగ్గలపున్= మిక్కిలి అయినటువంటి; పగన్+ జయింపక+ఉన్కిన్= శత్రుత్వ భావనను జయించకపోవటంచేత; తద్+విజయ+ విహీనున్= ఆ పగను జయించనివాడివి; తృష్ణ= దురాశ; జని= పుట్టుక; జరామృత్యువశగ వర్తనునిన్= ముసలితనం, చావులకు వశుడై మరల మరల తిరిగేవాడిగా; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: శత్రువులందరినీ జయించినా నాలోని పగ నశించలేదు. అందువలన నేను ఇంకా సంపూర్ణవిజయం పొందినవాడను కాను. పగను జయించనివాడిని దురాశ జన్మజరామృత్యువులకు వశుడై బాధపడేటట్లు చేస్తుంది.

క. అంతటి లోభము గెలువక।
శాంతి గలదె?' యని తదీయశక్తి నడఁచి ని
శ్చింతత్వ మొంది యా భూ।
కాంతుఁడు సామ్రాజ్యమున సుఖస్థితి వడసెన్. 85

ప్రతిపదార్థం: అంతటి= అట్లాంటి; లోభమున్= లోభాన్ని (దురాశను); గెలువక= జయించకుండా; శాంతి+కలదె?+అని= శాంతి లభిస్తుందా? అని; తదీయశక్తిన్+అడఁచి= ఆ లోభగుణాన్ని ఏ శక్తితో అణచిపెట్టెలో అట్లాచేసి; నిశ్చింతత్వము+ఒంది= నిశ్చింతను పొంది; ఆ భూకాంతుఁడు= ఆ రాజు; సామ్రాజ్యమునన్= రాజ్యపాలనలో; సుఖస్థితి= సుఖస్థితిని; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: అట్లాంటి లోభాన్ని గెలువకుండా శాంతి ఎక్కడిది?' అని నిర్ణయించుకొన్న వాడై విరాగభావంతో ఆ దురాశను జయించి, నిశ్చింతుడై ఆ రాజు పాలనలో సుఖశాంతు లను పొందాడు.

విశేషం: 'యతి'

జనకునకు విప్రరూపధరుండైన యమునితో నైన సంవాదము (సం. 14-32-1)

వ. అని వెండియు నవ్విప్రుం డిట్లను. 'జనకచక్రవర్తికి నొక్కబ్రాహ్మణునకుం గలిగిన సంవాదంబు సెప్పెద నాకర్ణింపుము. జనకుండు తన కట్టెదుర బ్రాహ్మణుండు కొఱగామి సేసిన నతనితో 'నీవు నా విషయంబున వసియింప వలదు పొ' మ్మనిన నతండు. 86

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; వెండియున్= మరల; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; జనక చక్రవర్తికిన్= జనకుడికీ; ఒక్క బ్రాహ్మణునకున్= ఒక బ్రహ్మణుడికీ; కలిగిన= జరిగిన; సంవాదంబు= సంవాదం; చెప్పెదన్+ఆకర్ణింపుము= చెప్పుతాను వినుము; జనకుండు; తన కడు+ఎదురన్= తన ఎదుటే; బ్రాహ్మణుడు; కొఱగామి= వ్యర్థమైన పని; (తప్పు) చేసినన్= చేయగా; అతనితోన్= అతడితో; నీవు; నా; విషయంబునన్=

దేశంలో; వసియింపన్ వలదు= ఉండవద్దు; పొమ్ము+అనినన్= పొమ్ము; అని అనగా; అతండు= ఆ బ్రాహ్మణుడు.

తాత్పర్యం: అని అంబరీషగీతలను చెప్పి, మరల ఆ బ్రాహ్మణుడు తన భార్యకు జనకమహారాజుకు విప్రుడి రూపంలో వచ్చిన బ్రాహ్మణుడికి నడుమ జరిగిన సంవాదాన్ని ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు. ఒకసారి జనకుడు తన కళ్ళ ఎదుటే ఒక బ్రాహ్మణుడు ఒక అనుచితమైన పనిని చేయగా అతడితో 'నీవు నా దేశంలో ఉండవద్దు. వెళ్ళిపొమ్ము' అని అన్నాడు. దానికి ఆ విప్రుడు ఇట్లా అన్నాడు.

విశేషం : విషయము= దేశము.

క. 'నీ విషయ మెంత వ? ట్టది।
యే విని పరవిషయమునకు నేఁగెదఁ దెలియం
గా వినిపింపు' మనుడు నా।
భూవల్లభుఁ డూరకుండెఁ బుణ్యచరిత్రా! 87

ప్రతిపదార్థం: పుణ్యచరిత్రా!= ఓ పుణ్యచరిత్ర కలిగిన వనితామణీ!; నీ విషయము= నీ దేశం; ఎంత+పట్టు?= ఎంతమేరకు?; అది+ఏన్+విని= దానిని చెప్పుము అది నేను తెలిసికొని; పరవిషయమునకున్= మరొక దేశానికి; ఏఁగెదన్= వెళ్లిపోతాను; తెలియంగాన్+వినిపింపుము+ అనుడున్= బాగా స్పష్టంగా చెప్పుము అని అనగా; ఆ భూవల్లభుఁడు= ఆ రాజు; ఊరకుండెన్= మౌనంగా ఉండిపోయాడు.

తాత్పర్యం: 'ఓ పుణ్యచరిత్రా! నీ దేశం ఏ మేరకుందో స్పష్టంగా నాకు చెప్పుము. దానిని తెలిసికొని నేను మరో దేశానికి వెళ్ళిపోతాను' అని ఆ బ్రాహ్మణుడు అన్నాడు. దానికి ఏమీ బదులు చెప్పక జనకుడు మౌనంగా ఉండిపోయాడు.

ఆ. ఊరకుండి మూర్ఛ నూని యొక్కింత సే।
పునకుఁ దేఱి యిట్టులనియె 'నాదు

తాత తండ్రి తరము ధరణి మద్వశ్యత।
నుండ నాకు మమత యొలయ దందు. 88

ప్రతిపదార్థం: ఊరక+ఉండి= అట్లా మౌనంగా ఉండి; మూర్ఛన్+ఊని= మూర్ఛపోయి; ఒక్కింతసేపునకున్+తేఱి= కొంతసేపటికి తేరుకొని; ఇట్టులు+ అనియెన్= ఇట్లా అన్నాడు; నాదు= నా యొక్క; తాత తండ్రి తరము= నా తాతతండ్రుల తరాలనుండి; ధరణి= భూమి; మత్= నా; వశ్యతన్+ఉండన్= వశంలో ఉండగా; అందున్= ఆ భూమి విషయంలో; నాకున్; మమత= నాది అనే భావన; ఒలయదు= పుట్టదు.

తాత్పర్యం: అట్లా మౌనంగా ఉండి, మూర్ఛలో మునిగి కొంతసేపటికి తేరుకొని ఇట్లా అన్నాడు. 'అయ్యా! ఈ రాజ్యం మా తండ్రి తాతల కాలంనుండీ నా వశంలో ఉన్నదే. అందువలన ఇది నాది అనే భావన నాకు ఎప్పుడూ కలుగలేదు. (అంటే ఇది నా దేశమని ఎట్లా చెప్పను? అని అర్థం).

వ. మిథిల నెప్పుడు వసియించెద; నిప్పురంబును మదీయంబని యంగీకరింపం బడదు కావున నిది నా విషయంబున లేమింజేసి మున్ను నీతో నాడిన మాటలఁ బుట్టిన వగ పెంపున మూర్ఛవచ్చె' ననిన విని యవ్విప్రుండా భూవిభు నాననం బాలోకించి. 89

ప్రతిపదార్థం: మిథిలన్= మిథిలలో; ఎప్పుడున్= ఎప్పుడూ; వసియించెదన్= నివసిస్తాను; ఈ+పురంబునున్= ఈ నగరం కూడా; మదీయంబు+అని= నా దని; అంగీకరింపం బడదు= ఒప్పుకొనటానికి వీలులేదు; కావునన్+ఇది= కాబట్టి ఇది; నా విషయంబు+ అనన్+లేమిన్+చేసి= నా రాజ్యం అని చెప్పటానికి వీలులేని కారణంవలన; మున్ను= మునుపు; నీతోన్+ఆడిన= నీతో అన్న; మాటన్= మాటవలన; పుట్టిన= కలిగిన; వగ పెంపునన్= దుఃఖాతిశయంతో (బాధతో); మూర్ఛ వచ్చెన్= మూర్ఛ వచ్చింది; అనినన్ విని= అని జనకుడు చెప్పగా విని; ఆ విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఆ భూవిభు+ అననంబు+ అలోకించి= ఆ రాజు ముఖం చూచి.

తాత్పర్యం: నేను మిథిలలో ఎప్పుడూ ఉంటాను. కాని, ఇది కూడా నా నగరమని చెప్పటం కుదరదు. అందువలన ఇది నా రాజ్యం అని చెప్పటానికి ఏదీ లేకపోవటంవలన ముందు నీతో అట్లా ఎందుకన్నానా? అనే బాధ అతిశయించి మూర్ఛపోయాను' అని జనకుడు చెప్పగా విని, ఆ బ్రాహ్మణుడు ఆ రాజు ముఖం చూచి ఇట్లా అన్నాడు.

క. 'నరనాయక! నీ యేలెడు।
పురమున భూమిని మమత్వబుద్ధి గలుగ కి
ట్లిరవై యుండుటకుఁ గతం।
బరయఁగ నెద్ది? వినిపింపు మది విశదముగన్.' 90

ప్రతిపదార్థం: నరనాయక!= ఓ రాజా!; నీ ఏలెడు పురమునన్= నీవు పరిపాలించే నగరం విషయంలోనూ; భూమినిన్= రాజ్య విషయంలోనూ, మమత్వబుద్ధి+ కలుగక= నాది - అనే బుద్ధి ఏర్పడక; ఇట్లు+ఉండుటకున్= ఇట్లా అనాసక్తంగా ఉండటానికి; కతంబు= కారణం; అరయఁగన్= బాగా ఆలోచిస్తే; ఎద్ది?= ఏమిటి?; అది= దానిని; విశదముగన్= వివరంగా; వినిపింపుము= వినిపించుము.

తాత్పర్యం: రాజా! నీవు ఉంటున్న నగర మిది; నీవు పాలిస్తున్న రాజ్య మిది. ఈ రెంటి విషయంలోనూ 'నాది' అనే భావన నీకు లేకుండా నీవు ఏదో పరుల సొత్తును వాడుకొంటున్న భావనతో అనాసక్తుడివలె ఎట్లా ఉండగలుగుతున్నావు? ఆ రహస్యం ఏమిటో నాకు వివరంగా చెప్పుము' అన్నాడు.

వ. అనుటయు నజ్జనపతి యతని కిట్లనియె. 91

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+జనపతి= ఆ రాజు; అతనికిన్+ ఇట్లు+అనియెన్= ఆ విప్రుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా ఆ రాజు ఆ విప్రుడితో ఇట్లా అన్నాడు.

తే. 'అరయ నివి యెట్లుఁ జెడియెడు నవియకాన।
వినుము మద్ధన మిది యని వీనిలోన

నొకటి యందు నంగీకార మొలయ దెల్ల।
విషయమును నా యదియ యను విధము గలదె?' 92

ప్రతిపదార్థం: అరయన్= బాగా చూడగా; ఇవి+ఎట్లున్= ఇవి ఎట్లాగైనా; చెడియెడు+ అవి+అ+కాన= చెడిపోయేవే కాబట్టి; వినుము; మత్+ధనము+ ఇది+అని= ఇది నా సంపద అని; వీనిలోనన్= వీటిలో; ఒకటి+అందున్= ఒకదానిలోనూ; అంగీకారము= ఒప్పుదల; ఒలయదు= కలగలేదు; ఎల్ల విషయమును= అంతా; నా+అది+అ= నాదే; అను విధము= అనే పద్ధతి; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: 'అంతేకాదు, బాగా చూస్తే ఈ రాజ్యం, ధనం-ఇవన్నీ ఎప్పటికైనా నశిస్తాయి. కాబట్టి ఇది నా సంపద అని ఏ ఒక్క విషయంలోనూ నాకు అనిపించటం లేదు. అంతా నాదే అనే పద్ధతి - అంటూ ఒకటి ఉన్నదా?

వ. ఎట్లంటేని ఘ్రాణాదులకు గోచరంబు లయినను గంధాదులు సెడంగలయవి గావున నాయవి యనకుండుటం జేసి భూమ్యాది భూతంబులు నాచేత నిర్జితంబులై మద్వశగత్వంబు నొంది యుండు.' 93

ప్రతిపదార్థం: ఎట్లు+అంటి(వి)+ఏని= ఎట్లాగంటే; ఘ్రాణ+ఆదులకున్= ముక్కు; మొదలైనవాటికి, గోచరంబులు+అయిననున్= తెలిసినా; గంధ+ ఆదులు= వాసన మొదలైనవి; చెడన్+కలయవి+కావున= చెడిపోయే స్వభావం కలిగినవి కాబట్టి; నా+అవి= నావి; అనకుండుటన్+చేసి= అనకుండా ఉండటంవలన; భూమి+ఆది భూతంబులు= భూమి, ఆకాశం మొదలైన పంచభూతాలు; నాచేతన్; నిర్జితంబులు+ఐ= జయింపబడ్డవై; మత్+వశ గత్వంబున్= నేను చెప్పినట్టుగా ప్రవర్తించే ధర్మాన్ని; ఒంది+ఉండున్= కలిగి ఉంటున్నాయి.

తాత్పర్యం: ఎట్లాగంటే ముక్కు - మొదలైన ఇంద్రియాలకు తెలిసినా వాసన - మొదలైనవి నశించే స్వభావం కలిగినవి. కాబట్టి అవి నావి అని అనుకోకుండా

ఉండటంవలన భూమ్యాదులైన పంచభూతాలూ నాచేత జయించబడి నేను చెప్పినట్లు ప్రవర్తిస్తున్నాయి.'

చ. అనవుడు బ్రాహ్మణప్రవరుఁ డల్లన నవ్వుచు 'నిన్ను నారయ
న్మనమున వేడ్క పుట్టి నరనాయక! వచ్చితి నేను ధర్ముఁడం
బనుపడు నివ్వివేకపరిపాకము గాఢనిరూఢభావ మొం
ది నిలుచుఁ గాత! నీ దగు మదిన్ సతతంబును శాంతికారియై. 94

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; బ్రాహ్మణ ప్రవరుఁడు= బ్రాహ్మణ శ్రేష్ఠుడు; అల్లనన్= నెమ్మదిగా; నవ్వుచున్= నవ్వుతూ; నరనాయక!= రాజా!; నిన్నున్= నిన్ను; అరయన్= పరీక్షించటానికి; వేడ్క+పుట్టి= కోరిక కలిగి; వచ్చితిన్= వచ్చాను; నేను; ధర్ముఁడున్= యమధర్మరాజును; పనుపడు+ఈ+ వివేక+పరిపాకము= క్రమంగా వికసించే లక్షణం కలిగిన ఈ వివేకపరిపక్వత; నీది+అగు మదిన్= నీ మనస్సులో; సతతంబునున్= శాశ్వతంగా; శాంతికారి+ ఐ= శాంతిదాయకమైన; గాఢనిరూఢభావము+ఒంది+నిలుచుఁగాత!= గాఢమై స్థిరమై నిలుచునుగాక!

తాత్పర్యం: అని అనగా బ్రాహ్మణశ్రేష్ఠుడు నెమ్మదిగా నవ్వుతూ 'నాయనా! నిన్ను పరీక్షించాలనే కోరిక కలిగి ఇట్లా వచ్చాను. నేను యమధర్మరాజును. క్రమంగా వికసించే లక్షణం కలిగిన ఈ వివేకం పక్వమై నీ హృదయంలో శాశ్వతంగా శాంతిప్రదాయకమై, గాఢమై, స్థిరమై నిలుచునుగాక!' అని అశీర్వదించాడు.

వ. అని ధర్మదేవత జనకునకు వరం బిచ్చి యంతర్ధానంబు సేసె' నని చెప్పి యా ధరణీసురోత్తముం డయ్యుత్తమాగంగనతో 'హితోపదేశంబు సేసెద; నవహిత వయి యాకర్ణింపు' మని పలికి యిట్లను 'సంసారవర్తనంబు వదలవిడిచి యే నేకతంబ యున్నయెడ నీవు మ్రుచ్చిలి వచ్చి 'మదీయవైరాగ్యంబు మాన్పఁ దలంచి నాకు నధ్యాత్మబోధంబు గలుగంజేయు' మని యభ్యర్థించిన నీ తలం పెఱింగియు నెఱుంగని వాఁడపోలె నధ్యాత్మ

విద్యాబోధకప్రకారంబు లైన వాక్యంబులు సెప్పితి; నేనింక లోకంబులం గలసి చరించువాఁడంగాను; నిక్కపు బ్రాహ్మణుండ నయితి; బ్రహ్మచారి నయితి; జీవన్ముక్తుండ నయితి; మిముబోంట్ల కొలఁదిగా నన్నుంజూచెద వది నా తెఱం గెఱుంగమి; యేను జగంబు సమస్తంబును వ్యాపించి యున్నవాఁడ; నా యున్న భంగికి నా బుద్ధి సకల పృథ్వీరాజ్యంబును నాకలోకాధి రాజ్యంబును సరిగావని తలంచు నా బుద్ధియ నాకు ధనంబు; దారువుల నగ్నియున్న చందంబున సర్వజంతువుల యందును నంతర్గతయై సిద్ధియున్నది; గురువాస గృహవాస వనవాస పరులగు బ్రాహ్మణులకెల్లను శ్రేయః ప్రాప్తికిం దెరువొక్కండ; యందఱును సరిత్తులు సాగరంబుఁ బ్రాపించిన తెఱంగునఁ బరతత్త్వంబు నొందుదురు; బుద్ధి నిమ్మార్గంబు నధిగమింప నగుఁగాని శరీరంబున వశంబుగాదు కర్మంబు లాద్యంతవంతంబులు శరీరంబు గర్మబంధనకరం బింత యెఱుంగుదుం గాన నా హృదయంబునం బరలోకభయంబులేదు నా చెప్పిన యధ్యాత్మ విద్యావిషయ వాక్యంబుల తాత్పర్యంబు చిత్తంబున నెలకొలిపి భావనా నిరతవయి యుండుము; నన్న పోలెదు; వెఱవకు' మనినఁ బతికి సాష్టాంగదండ ప్రణామం బాచరించి కేలు మొగిచి. 95

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; ధర్మదేవత= యమధర్మరాజు; జనకునకున్= జనకమహారాజుకు; వరంబు+ఇచ్చి= వరం ఇచ్చి; అంతర్ధానంబు+చేసెన్= మాయమయ్యాడు; అని చెప్పి; ఆ ధరణీసుర+ ఉత్తముండు= ఆ బ్రాహ్మణుడు; ఆ+ఉత్తమాం గనతోన్= ఆ ఉత్తమ స్త్రీతో; హితోపదేశంబు+చేసెదన్= నీకు హితోపదేశం చేస్తాను; అవహితవు+అయి= ఏకాగ్రచిత్తంతో; ఆకర్ణింపుము+అని పలికి= విను మని చెప్పి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; సంసారవర్తనంబు= సంసారంలో ప్రవర్తించటాన్ని; వదలవిడిచి= పూర్తిగా వదలివేసి; ఏను= నేను; ఏకతంబ= ఏకాంతంగా,

ఉన్న+ఎడన్= ఉన్నపుడు; నీవు; ముచ్చిలి వచ్చి= దొంగగా వచ్చి; మదీయ
వైరాగ్యంబున్= నా వైరాగ్యాన్ని; మాన్పన్+తలంచి= పోగొట్టాలని ఆలోచించి;
నాకున్= నాకు; అధ్యాత్మ బోధంబున్= వేదాంతాన్ని (ఆత్మజ్ఞానాన్ని); కలుగన్+
చేయుము+అని= కలిగించండని; అభ్యర్థించినన్= కోరితే; నీ తలంపు+
ఎఱింగియున్= నీ ఆలోచన తెలిసినవాడినే అయినా; ఎఱుంగని వాఁ
డు+అ+పోలెన్= తెలియనివాడివలె; అధ్యాత్మ విద్యా బోధక ప్రకారంబులు+
ఐన, వాక్యంబులు= వేదాంతవిద్యను నేర్పించే పద్ధతికి సంబంధించిన
వాక్యాలను చెప్పితిన్= చెప్పాను; నేను; ఇంకన్= ఇక; లోకంబులన్+కలసి=
లోక వ్యవహారాలలో కలిసి; చరించువాఁడన్+కాను= ప్రవర్తించేవాడను కాను;
నిక్కపు బ్రహ్మణుండను+అయితిన్= నిజమైన బ్రాహ్మణుడను అయ్యాను;
బ్రహ్మచారిని+అయితిని= బ్రహ్మచారి నయ్యాను; జీవన్ముక్తుండను+ ఐతిన్=
బ్రతికి ఉండగానే బంధాలనుండి విముక్తిని పొందాను; మిముబోంట్ల కొలఁ
దిగాన్= మీవంటి వారితో సమానంగా; నన్నున్+చూచెదవు= నన్ను చూస్తావు;
అది; నా తెఱంగు+ఎఱుంగమి= నా విషయం తెలియకపోవటం; ఏను= నేను;
జగంబు సమస్తంబును= ప్రపంచాన్ని అంతటినీ; వ్యాపించి ఉన్నవాఁడన్= నిండి
ఉన్నాను; నా+ఉన్న భంగికిన్= నేనున్న స్థితికి; నా బుద్ధిన్= నా ఆలోచనలో;
సకల పృథ్వీ రాజ్యంబునున్= ఈ భూమండల మంతా పాలించినా; నాకలోక+
అధి రాజ్యంబునున్= స్వర్గలోకాధిపత్యం చేసినా; సరి+కావని= సమానం కావని;
తలంచు= తలచేటటువంటి; నా బుద్ధి+అ= నా బుద్ధే; నాకున్+ధనంబు=
నాకు సంపద; దారువులన్= కొయ్యలలో; అగ్ని+ఉన్న చందంబునన్= అగ్ని
ఉన్న విధంగా; సర్వజంతువులయందునున్= అన్ని జంతువులలోనూ;
అంతర్గత+ఐ= లోన వ్యాపించినదై; సిద్ధి+ఉన్నది= యోగరూపమైన భగవదంశ
ఉన్నది; గురువాస= గురువు వద్ద వసించటం (బ్రహ్మచర్యం); గృహవాస=
ఇంటిలో ఇల్లాలితో వసించటం (గృహస్థాశ్రమం); వనవాస పరులు+అగు=
వనంలో వసించటం (వానప్రస్థం)- వీటిలో నిష్ఠ కలిగిన; బ్రాహ్మణులకున్+

ఎల్లనున్= బ్రాహ్మణులందరికీ; శ్రేయస్+ప్రాప్తికిన్= మోక్ష ప్రాప్తికి; తెరువు+
ఒక్కండు+అ= దారి ఒకటే; సరిత్తులు= నదులు; సాగరంబున్+ప్రాప్తించిన
తెఱంగునన్= సముద్రాన్ని చేరుకొన్నట్లుగా; అందఱునున్= అందరూ; పరతత్త్వ
ంబున్+ఒందుదురు= పరతత్త్వాన్ని (బ్రహ్మపదాన్ని) పొందుతారు; బుద్ధిన్=
బుద్ధితో (వివేకంతో); ఈ మార్గంబున్= ఈ మార్గాన్ని; అధిగమింపన్+అగున్+
కాని= దాటవచ్చును కాని; శరీరంబునన్= శరీరంతో; వశంబు కాదు= సాధ్యం
కాదు; కర్మంబులు= పనులు; ఆద్యంతవంతంబులు= తొలి, చివరలు
కలిగినవి; శరీరంబు= ఈ శరీరం; కర్మ బంధనకరంబు= కర్మబంధాన్ని
కలిగిస్తుంది; ఇంత+ఎఱుంగుదున్+కాన= ఇది తెలుసును కాబట్టి; నా
హృదయంబునన్= నా హృదయంలో; పరలోక భయంబు లేదు=
పరలోకవిషయంగా ఏ భయమూ లేదు; నా+చెప్పిన= నేను చెప్పిన;
అధ్యాత్మవిద్యా విషయ= వేదాంతవిద్యకు సంబంధించిన; వాక్యంబుల
తాత్పర్యంబు= వాక్యాల అర్థాన్ని; చిత్తంబునన్+నెలకొలిపి= మనస్సులో
పదిలపరుచుకొని; భావనా నిరతవు+అయి= భావనలో నిష్ఠకలిగినదానవై;
ఉండుము; నన్నున్+అ= నన్నే; పోలెదు= నీవు పోలెదు= పోలుతావు (నావలె
అవుతావు); వెఱవకుము+అనినన్= భయపడకు అని చెప్పగా; పతికిన్= ఆమె
భర్తకు; సాష్టాంగ దండప్రణామంబు+ ఆచరించి= సాష్టాంగ నమస్కారంచేసి;
కేలు మొగిచి= చేతులు జోడించి.

తాత్పర్యం: అని ఈ ప్రకారంగా ధర్ముడు జనకమహారాజునకు వరమిచ్చి
మాయ మయ్యాడు' అని చెప్పి, ఆ బ్రాహ్మణుడు తన భార్యతో 'నీకు
హితోపదేశం చేస్తాను. అవధానంతో వినుము' అని ఇట్లా అన్నాడు. 'నేను
సంసారబంధాలను పూర్తిగా వదలివేసి ఇక్కడ ఏకాంతంగా ఉండగా నీవు
దొంగగా వచ్చి నా వైరాగ్యాన్ని పోగొట్టాలని ఆలోచించి, పైకి ఆత్మజ్ఞానాన్ని
బోధించుమని అడిగావు. నీ ఆలోచన నాకు తెలిసినా ఏమీ తెలియనివాడివలెనే
నీకు వేదాంతవిద్యను బోధించే మహావాక్యాలను బోధించాను. చూడుము. ఇక
నేను ఈ లోకవ్యవహారాలలో తలదూర్చను. నిజమైన బ్రాహ్మణుడను అయ్యాను,

బ్రహ్మచారినయ్యాను. జీవన్ముక్తుడనయ్యాను. నన్ను కూడా మీవంటివారితో సమానంగానే చూస్తున్నావు. నా సాధన విషయం నీకు తెలియదు. నేను ప్రపంచమంతటా నిండి ఉన్నాను. నేనున్న స్థితికి, ఈ భూమండలాన్నంతా పాలించినా; స్వర్గలోకాన్ని ఏలినా సమానం కావు- అని నా ఆలోచన. ఈ తలపుగల నాబుద్ధే నాకు పరమసంపద. అన్ని కొయ్యలలోనూ అగ్ని అణగి ఉన్న విధంగా అన్ని జంతువులలోనూ యోగపరమైన భగవదంశ నిండి ఉన్నది. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ ఆశ్రమాలలో నిష్ఠ కలిగిన బ్రాహ్మణులందరికీ మోక్షప్రాప్తి మార్గం ఒకటే. నదు లన్నీ సాగరంలో కలిసిపోయినట్లు అందరూ బ్రహ్మపదాన్నే చేరుతారు. ఈ మార్గాన్ని వివేకంతో అధిగమించగలము కాని శరీరంతో కుదరదు. కర్మలు మొదలుచివరలు కలిగినవి. ఈ శరీరం కర్మబంధాన్ని కలిగిస్తుంది. నాకు ఇదంతా తెలుసును కాబట్టి నా హృదయంలో మృత్యువు తరువాత ఏమిటి? అనే భయం లేదు. నేను ఇంతవరకు చెప్పిన ఆధ్యాత్మికవాక్యాల అర్థాన్ని మనసులో పాదుకొల్పి 'భావన' నిష్ఠురాలివై ఉండుము. నావలె నీవు కూడా సిద్ధి పొందుతావు. భయపడకుము' అని భర్త చెప్పగా ఆమె భర్తకు సాష్టాంగదండ నమస్కారం చేసి, చేతులు జోడించుకొని ఇట్లా అన్నది.

విశేషం : దారువుల నగ్నియున్నచందంబున, -సరిత్తులు సాగరంబుఁబ్రాపించిన తెఱంగున-అలంకారములు ఉపమలు.

సీ. 'నీవు సెప్పిన మహనీయవాక్యనికాయ।
మతిగహనం బకృతాత్ములకును
నర్థగ్రహణశక్తి యనఘ! కల్గునె కృతా।
త్ములకైన? గ్రమ్మనఁ దెలియవచ్చి
యుండ దయ్యెఱుకకు నుదయింపఁ బట్టైన।
యట్టి యుపాయంబు నాదరమున
నాకుఁ బ్రసాదింపవే కరుణాకర!'
నావుడు నాతఁ డన్నాతితోడ

ఆ. 'నరణి బ్రాహ్మణుండు గురుఁ డుత్తరారణి।
దపము శ్రుతము నిర్మథన మొనర్చి
జ్ఞానవహ్ని పుట్టు మానిని! యని చెప్ప।
వనిత యిట్లులనియె వల్లభునకు. 96

ప్రతిపదార్థం: నీవు చెప్పిన= నీవు ఇంతవరకు చెప్పిన; మహనీయ= గొప్ప; వాక్య నికాయము= వాక్య సముదాయం; అకృత+ఆత్ములకును= సాధనా రహితులకు; అతిగహనంబు= మిక్కిలి కష్టమైనది; అనఘ!= పుణ్యాత్మా!; కృతాత్ములకున్+ఐనన్= కొంత సాధనచేసినవారికైనా; అర్థగ్రహణశక్తి= ఆ వాక్యాల అర్థాన్ని గ్రహించే శక్తి; కల్గునె= కలుగుతుందా?; గ్రమ్మనన్= శీఘ్రంగా; తెలియన్+వచ్చి ఉండదు= అర్థం కాకపోవచ్చు కూడా; ఆ+ఎఱుకకున్= ఆ జ్ఞానం; ఉదయింపన్= పుట్టటానికి; పట్టు+ఐన+అట్టి= ఆధారమైనటువంటి; ఉపాయంబున్= ఉపాయాన్ని; ఆదరమునన్= ఆదరంతో; కరుణాకర!= కరుణామూర్తీ!; నాకున్+ప్రసాదింపవే!= నాకు ప్రసాదించు స్వామీ!; నావుడున్= అని ప్రార్థించగా; అతఁడు= ఆ బ్రాహ్మణుడు; ఆ నాతితోడన్= ఆ స్త్రీతో; బ్రాహ్మణుండు; అరణి= అరణివంటివాడు; గురుఁడు= గురువైనవాడు; ఉత్తర+అరణి= ఉత్తరారణివంటివాడు; తపమున్+శ్రుతమున్= తపస్సును, వేదాన్ని; నిర్మథనము+ ఒనర్చన్= కలిసి ఒరిపిడి పెట్టగా; మానిని!= ఓ స్త్రీ; జ్ఞానవహ్ని= జ్ఞానమనే అగ్ని; పుట్టున్= పుట్టుతుంది; అని చెప్పన్= అని చెప్పగా; వనిత= ఆ స్త్రీ; వల్లభునకున్= మగనితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: నీవు ఇంతవరకు చెప్పిన మహనీయవాక్యసముదాయాన్ని అర్థంచేసికొనటం సాధనలేని వారికి చాలా కష్టం. సాధన చేసినవారికైనా అర్థం త్వరగా గ్రహించటం అంత సులభం కాదు. ఒకసారి తెలిసినా, మరచిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు. అట్లాంటి జ్ఞానం కలిగేటందుకు ఆధారమైన ఉపాయాన్ని నాకు బోధించి కృతార్థురాలిని చేయండి. మీరు కరుణగలవారు' అని భార్య ప్రార్థించగా ఆయన ఇట్లా అన్నాడు. 'బ్రాహ్మణుడు అరణి, గురువు ఉత్తరారణి. విప్రుడి తపస్సు, గురువుగారి వేదం - ఈ రెండు కొయ్యలనూ

మథనం చేయగా పుట్టే జ్ఞానం ముక్తి సాధకం’ అని అతడు చెప్పగా ఆమె భర్తతో ఇట్లా అన్నది.

విశేషం: యాగాగ్నిని రెండు అరణులచేత పుట్టిస్తారు. అరణులంటే ఒక విధమైన కఱ్ఱలు. వర్తులాకారమైన కఱ్ఱకు రంధ్రం పొడిచి గుండ్రని స్తంభాకారమైన మరి ఒక కఱ్ఱను అందులో దూర్చి కింద ఉన్న కఱ్ఱ (అధరారణి) ను కవ్వంవలె అతివేగంగా, బలంగా త్రిప్పినప్పుడు నిప్పు పుట్టుతుంది. ప్రత్తి అంటుకొన్నాక దానిని యాగంలో వాడుతారు. గురువు ‘ఉత్తరారణి’ అని కొందరు. ‘దక్షిణారణి’ అని కొందరు చెప్పుతారు. ఎట్లా చెప్పినా విద్య గురుశిష్యుల ముఖంగా ఉంటుందని అర్థం. అరణి బ్రాహ్మణుండు; గురుఁడుత్తరారణి; జ్ఞానవహ్ని-రూపకాలంకారములు.

క. **జనవినుతచరిత! బ్రాహ్మణుఁ।**
డనఁగా క్షేత్రజ్ఞుఁ డగుట యల్పము దోఁచెన్;
మనమున నతని నరణిగాఁ।
గొను టవ్వస్తువు నెఱింగికొని పిదపఁ గదా!’ **97**

ప్రతిపదార్థం: జనవినుతచరిత!= ప్రజలు ప్రస్తుతించే చరిత ఉన్న ఓ విప్రోత్తమా!; బ్రాహ్మణుఁడు+అనఁగాన్= బ్రాహ్మణుడు అంటే; క్షేత్రజ్ఞుఁడు+ అగుట= క్షేత్రజ్ఞుడు కావటం; అల్పము+తోఁచెన్= కొద్దిగా మాత్రమే తెలిసినది; మనమునన్= మనస్సుతో; అతనిన్= అతడిని; అరణిగాన్= అరణిగా; కొనుట= స్వీకరించటం; ఆ+వస్తువున్+ ఎఱింగికొని= ఆ వస్తువును తెలిసికొని; పిదపన్+ కదా!= తరువాత కదా!

తాత్పర్యం: ‘స్వామీ! బ్రాహ్మణుడు అంటే క్షేత్రజ్ఞుడనే విషయం ఏమిటో పూర్తిగా బోధపడలేదు. అతడిని అరణిగా గుర్తించటానికి ముందు బ్రాహ్మణుడు అంటే ఎవరో తెలియాలి కదా! అని ఆమె అన్నది.

వ. **అనిన నతం డిట్లనియె.** **98**

తాత్పర్యం: అనగా ఆ బ్రాహ్మణుడు ఇట్లా అన్నాడు.

ఆ. **‘అతనిఁ దోఁపఁ జేయునట్టి సాధనము లే;।**
దింద్రియముల కందఁ; డేమి లక్ష
ణములు లేవు; నిర్గుణత్వనిరూఢుం డ।
హంత లేమిఁ దోఁచుఁ గాంత! కనుము.’ **99**

ప్రతిపదార్థం: కాంత!= ఓ వనితా!; అతనిన్= ఆ బ్రాహ్మణుడిని; తోఁపన్+చేయునట్టి= గుర్తింపచేసేటటువంటి; సాధనము లేదు= ఏ సాధనమూ లేదు; ఇంద్రియములకున్+ అందఁడు= ఏ అవయవాలచేతా అతడిని గుర్తించలేము; ఏమి లక్షణములు లేవు= ఇక ఏ లక్షణాలతోనూ అతడిని గుర్తుపట్టలేము; నిర్గుణత్వ నిరూఢుండు= నిర్గుణత్వమే అతడి స్వభావం; అహంత= అహంకారిత్వం; లేమిన్+తోఁచున్= లేకపోవటంచేత కొంత గుర్తించవచ్చును; కనుము= చూడుము.

తాత్పర్యం: ‘ఓ కాంతా! అతడిని ప్రత్యేకంగా గుర్తించే ఏ సాధనమూ లేదు. ఏ అవయవాలచేతా అతడిని గుర్తించలేము. అతడికి ఏ లక్షణాలూ లేవు. నిర్గుణత్వమే అతడి ధర్మం. అహంకారం లేకపోవటం అనే లక్షణంచేత అతడిని కొంత గుర్తించవచ్చును. నీవు ప్రయత్నించుము.’

వ. **అని నిర్దేశించుటయు క్షేత్రజ్ఞవిషయసంశయంబు వాసి యయ్యింతి శాంతి నొందె’ నని గోవిందుండు సెప్పి గాండీవి ‘యా బ్రాహ్మణుండును బ్రాహ్మణియు నిట్టి వారగుదురె! వారెచ్చటివారు? వారల నా కెఱింగింపవే’ యని యడిగిన నద్దేవుం డతని యాననం బాలోకించి.** **100**

ప్రతిపదార్థం: అని ఈ విధంగా; నిర్దేశించుటయున్= నిర్దేశించగా; క్షేత్రజ్ఞ విషయ= క్షేత్రజ్ఞుడి విషయంగా; సంశయంబు= సందేహం; పాసి= పోగొట్టుకొని; ఆ+ఇంతి= ఆ స్త్రీ; శాంతిన్+ఒందెను+అని= శాంతిని పొందినదని; గోవిందుండు= కృష్ణుడు; చెప్పినన్= చెప్పగా; గాండీవి= అర్జునుడు; ఆ

బ్రాహ్మణుండును= ఆ బ్రాహ్మణుడు; బ్రాహ్మణియున్= బ్రాహ్మణస్త్రీ; ఇట్టివారు+ అగుదురె!= ఇంత గొప్పవారా!; వారు= వారిద్దరు; ఎచ్చటివారు?= ఎక్కడివారు? వారలన్= వారిని గురించి; నాకున్+ఎఱింగింపవే= దయచేసి తెలుపుము; అని; అడిగినన్= అడుగగా; ఆ+దేవుండు= కృష్ణుడు; అతని; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి

తాత్పర్యం: ఈ విధంగా ఉపదేశం చేయగా క్షేత్రజ్ఞుడి విషయంగా సందేహం పోయి, ఆ స్త్రీ పరమశాంతిని పొందింది అని శ్రీకృష్ణుడు చెప్పగా అర్జునుడు 'ఆ దంపతులు ఇంత గొప్పవారా? వారు ఎక్కడివారు? వారిని గురించి నాకు తెలుపుము' అని అడుగగా శ్రీకృష్ణుడు అతడి ముఖంవైపు చూచి (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'నా మనమును బుద్ధియును గృ।
పా మహితా! బ్రాహ్మణుండు బ్రాహ్మణియు హృషీ
కామేయమైన క్షేత్ర।
జ్ఞానుల వస్తువును నేన యనియె నరేంద్రా!' 101

ప్రతిపదార్థం: కృపామహితా!= ఓ కృపాగుణంచే అధికుడా!; నా మనమునున్= నా మనస్సూ; బుద్ధియునున్= బుద్ధీ; బ్రాహ్మణుండు; బ్రాహ్మణియు= బ్రాహ్మణస్త్రీ; హృషీక= ఇంద్రియాలచేత; అమేయము+ఐన= కొలవటానికి వీలులేని; క్షేత్రజ్ఞ= పరమాత్మ రూపమైన; అమల= నిర్మలమైన; వస్తువునన్= వస్తువుకూడా; నేను+అ= నేనే; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'కృపాగుణంచేత మహితుడవైన ఓ అర్జునా! నా మనస్సే బ్రాహ్మణుడు, బుద్ధి బ్రాహ్మణి, ఇంద్రియాలచేత కొలవటానికి వీలుకాని పరమాత్మస్వరూపమైన నిర్మలవస్తువును కూడా నేనే' అని కృష్ణుడన్నాడు.